www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



‘హ్యాట్రిక్’పై బీజేపీ ధీమా

2

గెలుపుపై ఇండీ కూటమి విశ్వాసం

నేడే లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు



మంగళవారం | 4-6-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 49 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: త్రయోదశి రా. 10.01 తదుపరి చతుర్దశి; నక్షత్రం: భరణి రా 10.35 తదుపరి కృత్తిక; వర్జ్యం: ఉ. 9.05-10.35; దుర్ముహూర్తం: ఉ. 8.19-9.11, రా. 10.19-11.01; అమృతఘడియలు: సా. 6.05-7.35; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.43 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తెల్లారింది తెగండోయ్!

● నేడే విడుదల

కౌంటింగ్‌కు వేళాయె.. హైటెన్షన్‌కు నేటితో తెర



తెల్లారింది! ఎన్నాళ్లో వేచిన ఉదయం వచ్చేసింది! అటో ఇటో తేలిపోయే సమయం ఆసన్నమైంది. ఐదేళ్ల వైసీపీ పాలనకు జనం పాతరేస్తారా? లేక... ‘వన్స్ మోర్’ అని గెలిపిస్తారా? ‘మీ అరాచకాలు భరించలేం’ అని వైసీపీకి తేల్చిచెప్పి... సంక్షేమం, అభివృద్ధి సవిమ్మళితంగా సాగిస్తామనే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికే పట్టం కడతారా? ‘ఎగ్జిట్ పోల్స్’ అంచనాలు ఏ మేరకు నిజమవుతాయి? అత్యధిక సర్వేలు స్పష్టం చేసినట్లుగా కూటమినే విజయం వరిస్తుందా? లేక... ఈ అంచనా తిరగబడుతుందా? ఇన్ని ప్రశ్నలకు సమాధానం లభించే సమయం ఆసన్నమైంది! మంగళవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మొదలవుతుంది. మధ్యాహ్నం 12 గంటలకల్లా ‘తుది ఫలితం’పై ఒక స్పష్టత వచ్చేస్తుంది. అప్పటిదాకా హైటెన్షన్ తప్పదు మరి!

11 12

కొద్ది గంటల్లోనే తేలనున్న పార్టీల భవితవ్యం

- గెలుపు మాదంటే మాదంటూ నేతల ధీమా.. 3 వారాలుగా శ్రేణుల్లో నరాలు తెగే ఉత్కంఠ
- ఎగ్జిట్ పోల్స్ అంచనాలు కూటమివైపే.. కాదంటే కాదంటున్న పాలకపక్ష పెద్దలు
- హోరాహోరీ పోరులో భారీ పోలింగ్.. దేశ విదేశాల నుంచి భారీగా వచ్చి ఓటేసిన జనం
- పార్టీల గెలుపు అవకాశాలపై పది వేల కోట్ల దాకా బెట్టింగులు
- ఎగ్జిట్ పోల్స్ వచ్చాక మరింత ప్రవాహం.. గత రెండ్రోజుల్లోనే వెయ్యి కోట్లు!

హై అలర్ట్!

- ఓట్ల లెక్కింపునకు భద్రత కట్టుదిట్టం
- రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్, యాక్ట్ 30
- రెడ్ జోన్లుగా కౌంటింగ్ కేంద్రాలు
- పల్నాడులో డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ
- సున్నిత, సమస్యాత్మక ప్రాంతాల్లో భారీ సంఖ్యలో కేంద్ర బలగాల మోహరింపు
- ‘కాల్చివేత’ అనుమతి కోరిన పోలీసులు
- కలెక్టర్లకు నిర్ణయాధికారం ఇచ్చిన ఈసీ?

అప్రమత్తంగా ఉండండి

- కౌంటింగ్‌లో ఏ అనుమానం వచ్చినా వెంటనే ఆర్వోకు ఫిర్యాదు చేయండి
- వైసీపీ హింసకు పాల్పడవచ్చు
- సంయమనంతో వ్యవహరించండి
- మరికొన్ని గంటలు ఇలాగే కష్టపడండి
- ప్రజల ఐదేళ్ల కష్టాలకు నేటితో తెర
- ఏజెంట్లతో టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు

పార్టీ ఆఫీసు నుంచే పవన్ పర్యవేక్షణ

నాగబాబు, సీనియర్ నాయకులూ రాక



కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- ఉదయం 8 గంటలకు ప్రారంభం
- ప్రతి 25 నిమిషాలకు ఒక రౌండ్ ఫలితం
- తొలి 5 గంటల్లోనే 111 నియోజకవర్గాల తీర్పు
- కొవ్వూరు, నరసాపురంలో 13 రౌండ్లే
- దీంతో తొలి తీర్పు ఇక్కడి నుంచే..
- 25-27 రౌండ్లు పట్టనున్న భీమిలి, పాణ్యం
- అక్కడ పది గంటలకుపైగా ఉత్కంఠే..
- లోక్‌సభ ఫలితాల్లో ముందుగా రాజమండ్రి, నరసాపురం.. చివరిగా అమలాపురం!

కౌంటింగ్ కేంద్రాల్లో అల్లర్లు చేస్తే జైలుకే

42 వేల మంది పోలీసులు, 67 కంపెనీల బలగాలతో పటిష్ఠ భద్రత: సీఈవో మీనా



12

ఫోన్ ట్యాపింగ్‌పై

సుమోటో విచారణ

టీ-హైకోర్టు నిర్ణయం

హైకోర్టు జడ్జి ఫోన్ ట్యాప్ చేశారని పేర్కొనడంతోనే..

ఢిల్లీ మద్యం కేసులో 1100 కోట్ల అక్రమాలు

- అందులో రూ.292 కోట్ల మేరకు కవిత పాత్ర! 3
- విజయ్ నాయర్ ద్వారా ఆప్‌కు 100 కోట్లు ఇచ్చారు
- డిజిటల్ సాక్ష్యాల్ని చెరిపేశారు.. కవితపై చర్యలు తప్పనిసరి
- ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవాలి.. ఈడీ అనుబంధ చార్జిషీట్

కవిత కస్టడీ పొడిగింపు.. సీబీఐ కేసులో ఈ నెల 7 వరకు.. ఈడీ కేసులో జూలై 3 దాకా..

పాక్ కోసం గూఢచర్యం.. బ్రహ్మోస్ మాజీ ఇంజనీర్‌కు జీవిత ఖైదు

14 ఏళ్ల కఠిన కారాగారం కూడా

2018లో నిషాంత్ అగర్వాల్ అరెస్టు

2

ఇదేమి తీర్పు?

పిన్నెల్లికి బెయిల్‌పై సుప్రీం విస్మయం

ఆయనకు రక్షణ కల్పించడం పెద్ద జోక్ అని వ్యాఖ్య

- వ్యవస్థలను అపహాస్యం చేసేలా హైకోర్టు తీరు
- సిటింగ్ ఎమ్మెల్యే బూత్‌లోకి వెళ్లి ఈవీఎం, వీవీప్యాట్‌ను ధ్వంసం చేశారు
- అది మార్ఫింగ్ వీడియో కాదు
- ‘గుర్తు తెలియని వ్యక్తుల’పై కేసు పెడతారా?
- ధర్మాసనం ఆక్షేపణ



పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేయొద్దంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు వ్యవస్థలను అపహాస్యం చేసేలా ఉంది. ఈ తీర్పుపై మేం స్టే ఇవ్వకుంటే అది న్యాయ వ్యవస్థను అపహాస్యం చేసినట్లే.

పోలింగ్ కేంద్రంలో ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ద్వారా జరిగిన ప్రత్యక్ష ప్రసారం నుంచి తీసిన వీడియో ఇది. దీనిని మార్ఫింగ్ వీడియో అనడానికి వీల్లేదు.

- సుప్రీంకోర్టు

నేడు కౌంటింగ్ కేంద్రానికి పిన్నెల్లి వెళ్లొద్దు

ఆ పరిసరాల్లో కూడా కనిపించొద్దు

సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని జూన్ 6 వరకు అరెస్టు చేయొద్దంటూ హైకోర్టు మధ్యంతర ముందస్తు బెయిల్ ఇవ్వడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. హైకోర్టు తీరు వ్యవస్థలను అపహాస్యం చేసేలా ఉందని వ్యాఖ్యానించింది. మంగళవారం ఓట్ల లెక్కింపు రోజు పిన్నెల్లి తన నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రంలోకి అడుగుపెట్టడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఆ పరిసర ప్రాంతాల్లో కూడా ఆయన కనిపించకూడదని తేల్చిచెప్పింది. మే 13న పోలింగ్ సందర్భంగా మాచర్ల వైసీపీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి.. అక్కడ ఈవీఎంతోపాటు వీవీప్యాట్‌ను ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. అక్కడే ఉన్న టీడీపీ పోలింగ్ ఏజెంట్ నంబూరి శేషగిరిరావు ఆయనను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ దృశ్యాలన్నీ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) పిన్నెల్లిపై తక్షణ చర్యలకు ఆదేశించింది. దాంతో ఆయన గృహనిర్బంధం నుంచి పరారయ్యారు. అజ్ఞాతంలోనే ఉండి హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 6వ తేదీ వరకు ఆయన్ను అరెస్టు చేయొద్దంటూ హైకోర్టు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరుచేసింది. దీనిపై బాధితుడు శేషగిరిరావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిన్నెల్లికి హైకోర్టు ఇచ్చిన అరెస్టు మినహాయింపు ఆదేశాలు రద్దు చేయాలని కోరారు. ఆయన కౌంటింగ్ రోజు కూడా హింసకు పాల్పడే ప్రమాదం ఉందని, కౌంటింగ్ కేంద్రం వద్దకు రానివ్వకుండా ఆదేశాలు జారీచేయాలని మరో పిటిషన్ వేశారు. ఈ రెండు పిటిషన్లపై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన వెకేషన్ బెంచ్

మిగతా 12వ పేజీలో...

చంద్రగిరిలో రీ పోలింగ్‌కు ‘నో’

అందుకు తగిన కారణాల్లేవు

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిటిషన్

కొట్టివేసిన సుప్రీంకోర్టు



‘పోస్టల్’పై జోక్యానికి సుసేమిరా

జోక్యం చేసుకుంటే ఓట్ల లెక్కింపుపై ప్రభావం

సుప్రీంకోర్టు స్పష్టీకరణ.. వైసీపీకి అక్కడా ఎదురుదెబ్బే

న్యూఢిల్లీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్ల అంశంలోనూ వైసీపీకి సుప్రీంకోర్టులోనూ ఎదురుదెబ్బ తగిలింది. పోస్టల్ బ్యాలెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకం ఉంటే సరిపోతుందని, సీల్ ఉండాల్సిన అవసరం లేదన్న కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయంపై హైకోర్టు ఆదేశాలను ఆ పార్టీ సుప్రీంకోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. దానిపై సోమవారం జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన వెకేషన్ బెంచ్ విచారణ చేపట్టింది. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు వ్యవహారంలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. మంగళవారం ఓట్ల లెక్కింపు జరుగనుండగా.. ఈ దశలో జోక్యం చేసుకోవడం ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ప్రభావం చూపుతుందని తెలిపింది. వైసీపీ పిటిషన్‌ను తోసిపుచ్చింది. కాగా, ఈవీఎంలను ధ్వంసం చేసిన వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కేసుతోపాటు పోస్టల్ బ్యాలెట్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని తెలుగుదేశం సీనియర్ నేత, న్యాయవాది కనకమేడల రవీంద్రకుమార్ తెలిపారు. సోమవారం సుప్రీంకోర్టు ఎదుట ఆయన మీడియాతో మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్ల అంశంపై హైకోర్టు తీర్పునే సుప్రీంకోర్టు సమర్థించిందని.. వైసీపీ పిటిషన్‌ను తిరస్కరించిందన్నారు.



కర్నూలు-ఉల్చాల ప్రధాన రహదారిపై కొట్టుకుపోయిన వంతెన

నరసాపురం వరకు ‘నైరుతి’

నాలుగైదు రోజుల్లో రాష్ట్రమంతా విస్తరణ.. పలుచోట్ల వర్షాలు.. అనంతలో భారీగా పంటనష్టం

పొంగి ప్రవహించిన వాగులు, వంకలు.. నీట మునిగిన ఉద్యాన పంటలు

పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు.. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కూలిన స్తంభాలు, చెట్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

నైరుతి రుతుపవనాలు రాయలసీమ, కోస్తాంధ్రలోని అనేక ప్రాంతాలకు విస్తరించడంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడుకు ఆనుకుని పశ్చిమ మధ్య, నైరుతి బంగాళాఖాతం, కేరళలో వేర్వేరుగా ఉపరితల ఆవర్తనాలు కొనసాగుతున్నాయి. ఇంకా అరేబియా సముద్రం నుంచి కేరళ మీదుగా పడమర గాలులు వీస్తున్నాయి. దీంతో నైరుతి రుతుపవనాలు కర్ణాటకతోపాటు తెలంగాణలో కొన్ని ప్రాంతాలు, రాయలసీమలో ఎక్కువ ప్రాంతాలు, కోస్తాలో నరసాపురం వరకూ విస్తరించాయి. కోస్తాకు ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంతోపాటు మరికొన్ని ప్రాంతాలకు కూడా విస్తరించాయి. రానున్న నాలుగైదు రోజుల్లో కర్ణాటక, తెలంగాణ, రాయలసీమ, కోస్తా ఆంధ్రలోని మిగిలిన ప్రాంతాలకు, దక్షిణ ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో పలు ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు విస్తరించేందుకు వాతావరణం అనుకూలంగా ఉందని వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. ఉపరితల ఆవర్తనం, బంగాళాఖాతం నుంచి వస్తున్న తేమ గాలుల ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు రాష్ట్రంలోని అనేక చోట్ల వర్షాలు, పలుచోట్ల భారీ నుంచి అతి భారీవర్షాలు కురిశాయి. సోమవారం కూడా పలుచోట్ల వర్షాలు కురిశాయి. బనగానపల్లెలో 18, శ్రీశైలంలో 17, నర్సీపట్నంలో 12 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అనంతపురం జిల్లాలోని


మిగతా 3వ పేజీలో...

జూలై-సెప్టెంబరులో లా నినా!

ప్రపంచ వాతావరణ విభాగం ప్రకటన

బలహీనపడుతున్న ఎల్ నినో

2





రేవ్ పార్టీ కేసులో

నటి హేమ అరెస్టు

విచారణ తర్వాత అరెస్ట్ చేసిన పోలీసులు

వైద్య పరీక్షల అనంతరం కోర్టుకు తరలింపు

14 రోజులు జ్యుడీషియల్ కస్టడీ విధింపు

రేవ్ పార్టీలో నేను లేను: హేమ

12

పాల ధర పెంచిన మదర్ డెయిరీ

లీటర్‌పై రూ. 2 పెంపు..

న్యూఢిల్లీ, జూన్ 3: అమూల్ పాల ధర పెంచిన మరుసటి రోజే మదర్ డెయిరీ కూడా పాల ధర పెంచింది. అన్ని రకాల పాలపై లీటర్‌కు రూ.2 చొప్పున పెంచినట్లు మదర్ డెయిరీ సోమవారం ప్రకటించింది. సోమవారం నుంచే కొత్త ధరలు అమల్లోకి వచ్చాయి. మదర్ డెయిరీ ప్రస్తుతం రోజు 35 లక్షల లీటర్ల పాలు అమ్ముతోంది. గతేడాది ఫిబ్రవరి తర్వాత ఈ కంపెనీ మళ్లీ పాల ధరలు పెంచింది ఇప్పుడే.



నాగపూర్‌లో ఓట్ల లెక్కింపు కోసం సన్నద్ధమవుతున్న అధికారులు

నేడే 'లోక్‌సభ' ఓట్ల లెక్కింపు

న్యూఢిల్లీ, జూన్ 3: కేంద్రంలో అధికార పీఠం ఎవరిదో మరికొద్ది గంటల్లో తేలిపోనుంది. ప్రజలు, రాజకీయ పార్టీల ఉత్కంఠకు తెరపడనుంది. వరసగా మూడోసారి, రికార్డు విజయంపై ప్రధాని మోదీ కన్నేయగా.. ప్రతిపక్ష ఇండీ కూటమి అనూహ్యంగా తామే అధికారంలోకి వస్తామని ధీమాగా ఉంది. ఎగ్జిట్ పోల్స్ అన్నీ ఏకపక్షంగా కేంద్రంలో మళ్లీ మోదీ సర్కారే వస్తుందని, బీజేపీ హ్యాట్రిక్ కొడుతుందని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ సారి 400 సీట్లు సాధించాలన్న మోదీ లక్ష్యానికి దగ్గరగా ఎన్డీయే కూటమి సీట్లు సాధిస్తుందని కూడా వెల్లడించాయి. ఇండీ కూటమికి 180 సీట్లలోపే వస్తాయని ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. ఈ క్రమంలో అవి ఎగ్జిట్ పోల్స్ కాదని.. మోదీ మీడియా పోల్స్ అని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే.

లోక్‌సభ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఇలా..

నిబంధనల ప్రకారం తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు.

పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు మొదలైన అరగంట తర్వాతే ఈవీఎంల్లోని ఓట్ల లెక్కింపును మొదలెట్టాల్సి ఉంటుంది.

ఒకవేళ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్లు లేకుంటే నిర్దేశించిన సమయానికే ఈవీఎంల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభించాలి.

కంట్రోల్ యూనిట్ల నుంచి ఫలితాన్ని నిర్ధారించే ముందు.. పేపర్ సీల్ చెదిరిపోకుండా చూసుకోవాలి. అనంతరం మొత్తం పోలైన ఓట్లను, ఫారం 17సీలో పేర్కొన్న సంఖ్యతో సరిపోల్చుకోవాలి.

ఫలితాన్ని తొలుత కౌంటింగ్ సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ ఏజెంట్లకు చూపించాలి.

కంట్రోల్ యూనిట్‌లోని డిస్‌ప్లే ప్యానెల్‌పై ఒకవేళ ఫలితం కనిపించకపోతే, అన్ని యూనిట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత, ఆయా వీవీ ప్యాట్లలోని స్లిప్పులను లెక్కించాలి.

ప్రతి పోలింగ్ స్టేషన్‌కు చెందిన ఫారం 17సీని తుది ఫలితాన్ని కంపైల్ చేస్తున్న అధికారికి పంపించాలి. ఆయన వాటిని ఫారం 20లో పొందుపరుస్తారు.

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం/లోక్‌సభ పరిధిలోని ఒక్కో సెగ్మెంట్ నుంచి ఐదు పోలింగ్ స్టేషన్లను ఎంపిక చేసుకొని.. ఒక్కో వీవీప్యాట్‌లోని స్లిప్పులను లెక్కించాల్సి ఉంటుంది.

తిరస్కరణకు గురైన పోస్టల్ బ్యాలెట్ల సంఖ్య కంటే గెలుపు మార్జిన్ తక్కువగా ఉన్నట్లయితే.. తిరస్కరించిన పోస్టల్ బ్యాలెట్లను మళ్లీ పరిశీలించాలి. ఆ తర్వాతే తుది ఫలితం వెల్లడించాలి.

ఇద్దరు అభ్యర్థులకు సమాన ఓట్లు వస్తే డ్రా తీస్తారు.

నడ్డా అధ్యక్షతన బీజేపీ నేతల కీలక భేటీ

న్యూఢిల్లీ, జూన్ 3: లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు ఒకరోజు ముందున బీజేపీ సీనియర్ నేతలు సోమవారం భేటీ అయ్యారు. పార్టీ చీఫ్ జేపీ నడ్డా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు కూడా పాల్గొన్నారు. మూడోసారి మెజారిటీ సీట్లతో కేంద్రంలో బీజేపీ సర్కారే వస్తుందన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాల నేపథ్యంలో తాజా రాజకీయ పరిస్థితులపై వారు చర్చించినట్లు తెలిసింది. భేటీ అనంతరం పార్టీ నేత వినోద్ తావ్డే మీడియాతో మాట్లాడుతూ.. 'దేశంలో ఏడు దశల్లో నిర్వహించిన ఎన్నికలు, ఓటింగ్ సరళి, పోలింగ్ ఎలా జరిగిందనే దానితో పాటు రేపు జరగబోయే ఓట్ల లెక్కింపుపై విస్తృతంగా చర్చించాం. కౌంటింగ్ కేంద్రాలకు పార్టీ ఏజెంట్లు సకాలంలో చేరుకునేలా దిశానిర్దేశం చేశాం. ఎక్కడైనా ఓట్ల లెక్కింపులో అనుమానాలుంటే పార్టీ ఆఫీసు బేరర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించాం' అని వెల్లడించారు.

పాక్ కోసం గూఢచర్యం.. బ్రహ్మోస్ మాజీ ఇంజనీర్‌కు జీవిత ఖైదు

- 14 ఏళ్ల కఠిన కారాగారం కూడా
- 2018లో నిషాంత్ అగర్వాల్ అరెస్టు
- అప్పట్లో రంగంలోకి మిలటరీ ఇంటెలిజెన్స్

నాగపూర్, జూన్ 3: పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐకు క్షిపణి రహస్యాలను చేరవేసిన కేసులో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ మాజీ ఇంజనీర్ నిశాంత్ అగర్వాల్‌కు జీవిత ఖైదు పడింది. దాంతోపాటు 14 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ నాగపూర్ జిల్లా కోర్టు జడ్జి ఎంవీ దేశ్‌పాండే సోమవారం తీర్పునిచ్చారు. డీఆర్‌డీవో, రష్యాకు చెందిన మిలటరీ ఇండస్ట్రియల్ కన్సార్షం సంయుక్తంగా బ్రహ్మోస్ ఏరోస్పేస్‌ను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. నిశాంత్ అగర్వాల్ 2014 నుంచి ఆ సంస్థలోని సాంకేతిక విభాగంలో పనిచేశాడు. అతను బ్రహ్మోస్‌కు చెందిన రహస్యాలను ఐఎస్ఐకు చేరవేసినట్లు మిలటరీ ఇంటెలిజెన్స్ గుర్తించింది. 2018లో మిలటరీ ఇంటెలిజెన్స్‌తోపాటు ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రకు చెందిన ఉగ్రవాద నిరోధక బృందాలు(ఏటీఎస్) సంయుక్త ఆపరేషన్ నిర్వహించి, నిశాంత్‌ను అరెస్టు చేశాయి. సీఆర్పీసీతోపాటు, ఐటీ చట్టంలోని సెక్షన్ 66(ఎఫ్), అధికారిక రహస్యాల చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో అతనికి నాగపూర్ జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రభుత్వం తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జ్యోతి వాజాని వాదనలను వినిపించారు. పూర్వాపరాలను పరిశీలించిన జడ్జి ఎంవీ దేశ్‌పాండే.. దర్యాప్తు అధికారులు కోర్టుకు సమర్పించిన ఆధారాలు, వాదనలతో ఏకీభవిస్తూ.. సోమవారం తుది తీర్పును వెలువరించారు. నిశాంత్‌కు జీవిత ఖైదుతోపాటు.. 14 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 3 వేల జరిమానా విధించారు.

ముంబైలో పదో అంతస్తు నుంచి దూకి ఐఏఎస్ దంపతుల కుమార్తె బలవన్మరణం

ముంబై, జూన్ 3: మహారాష్ట్ర కేడర్ ఐఏఎస్ దంపతుల కుమార్తె బలన్మరణానికి పాల్పడ్డారు. సోమవారం తెల్లవారుజామున దక్షిణ ముంబైలోని మంత్రాలయ సమీపంలోని ప్రభుత్వ నివాస భవనం పదో అంతస్తు నుంచి దూకి ఆమె తనువు చాలించారు. ఐఏఎస్ దంపతుల కుమార్తె లిపి రస్తోగి (27) హరియాణాలోని సోనిపట్‌లో ఎల్ఎల్‌బీ కోర్సు చదువుతున్నారు. ఆమె తన చదువు పట్ల ఒత్తిడికి గురి కావడం ఈ పరిణామానికి దారితీసినట్టు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ నివాస భవనంలో అంతా గాఢ నిద్రలో ఉన్న సమయంలో తెల్లవారుజామున దాదాపు 4 గంటల ప్రాంతంలో ఆమె ఈ ఘటనకు పాల్పడినట్టు చెప్పారు. ఆ ప్రాంగణంలో పార్క్ చేసిన మోటార్‌బైక్‌పై ఆమె అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గుర్తించిన భవన గార్డ్.. లిపి కుటుంబ సభ్యులకు తెలియజేశారని, వెంటనే ఆమెను జీటీ హాస్పిటల్‌కు తరలించినట్టు పోలీసులు చెప్పారు. ఆమెకు చికిత్స అందిస్తుండగానే మృతి చెందినట్టు తెలిపారు. ఆమె గదిలో ఒక సూసైడ్ నోట్ కూడా దొరికిందని, తన చావుకు ఎవరూ కారణం కాదని అందులో ఉన్నట్టు చెప్పారు. పోలీసులు అసహజ మరణంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లిపి తండ్రి వికాస్ రస్తోగి మహారాష్ట్ర ఉన్నత, సాంకేతిక విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్నారు. ఆమె తల్లి రాధికా రస్తోగి రాష్ట్ర ప్రభుత్వంలో సీనియర్ ఐఏఎస్ అధికారి. కాగా ఇంతకు ముందు కూడా ముంబైలో ఇలాంటి ఘటనే వెలుగు చూసింది. 2017లో మహారాష్ట్ర క్యాడర్ ఐఏఎస్ అధికారులు మిలింద్, మనీషా మైస్కర్‌ల 18 ఏళ్ల కుమారుడు కూడా ఓ పెద్ద భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు.

64.2 కోట్లు

ఈ సార్వత్రిక ఎన్నికల్లో పోలైన ఓట్లు
ఇది ప్రపంచ రికార్డు



మీడియా సమావేశంలో సీఈసీ రాజీవ్ కుమార్

- భారత ఎన్నికలు ఓ అద్భుతం
- ఏడు దశల్లో.. రూ.10 వేల కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నాం
- పత్తాలేని పెద్దమనుషులం కాదు.. ఎప్పుడూ అందుబాటులో ఉన్నాం
- త్వరలో జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ: సీఈసీ రాజీవ్‌కుమార్

న్యూఢిల్లీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో 64.2 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రపంచరికార్డు సృష్టించారని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ ప్రకటించారు! "భారతదేశ ఎన్నికలు నిజానికి ఒక అద్భుతం. వీటికి ప్రపంచంలో ఏదీ సాటిరాదు" అని ఆయన వ్యాఖ్యానించారు. జీ7 దేశాల ఓటర్లతో పోలిస్తే భారత్‌లో ఈ ఎన్నికల్లో ఓటేసిన వారి సంఖ్య ఒకటిన్నర రెట్లు ఎక్కువని.. యూరోపియన్ యూనియన్‌లో ఉన్న 27 దేశాల ఓటర్ల కంటే రెండున్నర రెట్లు ఎక్కువని తెలిపారు. 31.2 కోట్ల మహిళా ఓటర్లు పార్లమెంటు ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. సోమవారం ఇక్కడ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయంలో ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధుతో కలిసి రాజీవ్‌కుమార్ పాత్రికేయులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలలో ఓటుహక్కు వినియోగించుకున్న ఓటర్లందరికీ కృతజ్ఞతభావంతో స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. 85 ఏళ్లు దాటిన ఓటర్లు ఈ తరానికి ఆదర్శమని.. గత 70 ఏళ్లుగా వారు దేశం పట్ల తమ బాధ్యతను నెరవేరుస్తున్నారని రాజీవ్‌కుమార్ కొనియాడారు. గత నాలుగు దశాబ్దాలలో ఎప్పుడూ లేనివిధంగా జమ్మూకశ్మీర్‌లో ఈసారి అత్యధికంగా ఓటింగ్ జరిగిందన్న ఆయన.. జమ్మూకశ్మీర్ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అక్కడ నమోదైన ఓటింగ్ పట్ల ఈసీ సంతోషంగా ఉందని.. ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొనడానికి ప్రజల ఉత్సుకతకు కశ్మీర్‌లో పోలింగ్ శాతమే నిదర్శనమని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఈసారి ఎన్నికల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోలేదని.. డీప్‌ఫేక్ వీడియోల బెడదను నియంత్రించామని చెప్పారు. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయడానికి ప్రయత్నించిన అధికారులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని.. నియమావళిని ఉల్లంఘించిన నాయకులకు నోటీసులు జారీ చేశామని గుర్తుచేశారు. ఎన్నికల సిబ్బంది సమర్థంగా పనిచేయడంతో ఈసారి అతి తక్కువగా 39 చోట్ల మాత్రమే రీపోలింగ్ జరిగిందని.. అందులోనూ 25 చోట్ల రీపోలింగ్ రెండు రాష్ట్రాలలోనే జరిగిందని వివరించారు. గత లోక్‌సభ ఎన్నికలలో 540 చోట్ల రీపోలింగ్ నిర్వహించినట్లు గుర్తుచేశారు. సామాజిక మాధ్యమాలలో ఎన్నికల సంఘాన్ని 'లాపతా జెంటిల్మెన్ (పత్తా లేని పెద్ద మనుషులు)' గా అభివర్ణిస్తూ వైరల్ అవుతున్న మీమ్స్ పట్ల సీఈసీ స్పందించారు. తాము ఎక్కడికీ పోలేదని, ఎల్లప్పుడూ అందుబాటులోనే ఉన్నామని చెప్పారు. ఏపీలో ఎన్నికల అనంతరం భద్రతాబలగాల బందోబస్తును కొనసాగిస్తున్నట్లు తెలిపారు. 23 దేశాలకు చెందిన 75 మంది ప్రతినిధులు లోక్‌సభ ఎన్నికల ప్రక్రియను పరిశీలించినట్లు వెల్లడించారు.

కోటిన్నర మంది..


కోటిన్నర మంది పోలింగ్, భద్రతా సిబ్బంది, 68 వేల పర్యవేక్షణ బృందాలు ఈ ఎన్నికల బృహత్తర యజ్ఞంలో పాలుపంచుకున్నట్లు రాజీవ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా నాలుగు లక్షల వాహనాలను, 135 ప్రత్యేక రైళ్లను, 1692 ట్రిప్పుల హెలికాప్టర్/విమాన సేవలను వినియోగించుకున్నామని చెప్పారు. అలాగే.. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు తరలిస్తున్న నగదు, వస్తువులు, మాదక ద్రవ్యాలు, మద్యం.. ఇలా అన్నింటినీ కలిపితే తాము స్వాధీనం చేసుకున్నవాటి విలువ రూ.10వేల కోట్ల దాకా ఉంటుందని తెలిపారు. 2019లో ఇలా స్వాధీనం చేసుకున్నవాటి విలువ రూ.3500 కోట్లేనని వివరించారు. కౌంటింగ్‌లో భాగంగా తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కించి, ఆ ఫలితాలను వెల్లడించాలన్న విపక్షాల విజ్ఞప్తిపై సీఈవో వివరణ ఇచ్చారు. నిబంధనల ప్రకారం.. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ముందుగానే లెక్కించనున్నట్లు తెలిపారు. ఆ ఓట్లను లెక్కించడం మొదలుపెట్టిన అరగంట తర్వాతే ఈవీఎంలలో పోలైన ఓట్లను లెక్కిస్తామన్నారు.

అమిత్ షాపై ఆరోపణలకు ఆధారాలు చూపండి

కేంద్ర మంత్రి అమిత్ షాపై తాను చేసిన ఆరోపణలకు ఆధారాలు సమర్పించడానికి వారం రోజుల సమయం కావాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ చేసిన అభ్యర్థనను ఎన్నికల సంఘం తిరస్కరించింది. చివరి దశ ఎన్నికలు ముగిశాక.. జిల్లా కలెక్టర్లకు అమిత్ షా ఫోన్ చేసి బెదిరిస్తున్నారని జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. దీనిపై స్పందించిన ఎన్నికల సంఘం.. ఆ ఆరోపణలకు సోమవారం రాత్రి 7 గంటలలోగా ఆధారాలు చూపాలని జైరాం రమేశ్‌ను ఆదేశించింది. లేనిపక్షంలో వాటిని నిరాధార ఆరోపణలుగా భావించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కాంగ్రెస్ ఆరోపిస్తున్నట్లుగా.. బెదిరింపులకు సంబంధించి తమకు ఏ జిల్లా మేజిస్ట్రేట్ నుంచిగానీ, ఇతర అధికారుల నుంచిగానీ ఎలాంటి ఫిర్యాదులూ అందలేదని కమిషన్ స్పష్టం చేసింది.

ఢిల్లీకి ఇండియా కూటమి నేతలు

ఇండియా కూటమి నేతలు ఒక్కొక్కరుగా ఢిల్లీకి చేరుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేతల పిలుపు మేరకు తృణమూల్ అధినేత్రి మమతాబెనర్జీ, ఇతర మిత్రపక్షాల నేతలు ఢిల్లీకి వస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడగానే వీరంతా సమావేశమై, భవిష్యత్ కార్యచరణపై చర్చించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఫలితాలు అనుకున్న విధంగా, అనుకూలంగా రాకపోతే.. ఇతర మార్గాలను అన్వేషించాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో రాష్ట్రపతిని కలవడం, మీడియా సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించడం వంటి అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణలో ఈసీ పాత్రపైనా చర్చించాలని ఇండియా కూటమి నేతలు భావిస్తున్నారని తెలిసింది. ఎన్డీయేకు 350కి పైగా స్థానాలు వస్తే ఎన్నికల ప్రక్రియ బూటకమని భావించాలని వారు తీర్మానించినట్లు సమాచారం.



ఫలితాలు ఎగ్జిట్ పోల్స్‌కు భిన్నంగా ఉంటాయి: సోనియా

న్యూఢిల్లీ, జూన్ 3: లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఎగ్జిట్ పోల్స్‌కు పూర్తి భిన్నంగా ఉంటాయన్న ఆశాభావంతో ఉన్నామని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తెలిపారు. సోమవారం తమిళనాడు మాజీ సీఎం కరుణానిధి శత జయంతి సందర్భంగా ఢిల్లీలోని డీఎంకే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి సోనియా హాజరై నివాళి అర్పించారు. అనంతరం 'మంగళవారం వెలువడనున్న ఎన్నికల ఫలితాలపై మీ అంచనాలు ఏమిటని పీటీఐ ప్రతినిధి అడగ్గా ఆమె బదులిస్తూ ఎగ్జిట్ పోల్స్‌కు పూర్తి భిన్నంగా ఫలితాలు ఉంటాయని తమ పార్టీ ఆశాభావంతో ఉందని, రేపటి వరకు వేచి చూడాలని పేర్కొన్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ తిరుగులేని మెజారిటీ సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఎగ్జిట్ పోల్స్ బోగస్ అని కాంగ్రెస్ నాయకులు కొట్టిపారేశారు.

'హంగ్' వస్తే కూటమిని పిలవండి


- రాష్ట్రపతికి మాజీ జడ్జీల లేఖ

న్యూఢిల్లీ, జూన్ 3: ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఒకవేళ ఏ పార్టీకీ స్పష్టమైన ఆధిక్యం రాకుండా 'హంగ్' వస్తే అలాంటి సందర్భాల్లో ప్రజాస్వామ్య సంప్రదాయాలను పాటించాలని కోరుతూ ఏడుగురు మాజీ న్యాయమూర్తులు రాష్ట్రపతికి లేఖ రాశారు. ఎక్కువ సీట్లు సంపాదించిన, ఎన్నికల ముందు ఏర్పడిన కూటమిని ప్రభుత్వ ఏర్పాటు కోసం తొలుత ఆహ్వానించాలని కోరారు. ఎంపీల కొనుగోళ్లను నివారించడానికి ఈ చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల్లో ఓడిపోతే అధికార బదిలీ సక్రమంగా జరిగేందుకు రాజ్యాంగాన్ని పాటించాలని కోరారు. రాష్ట్రపతితో పాటు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన ఎన్నికల కమిషనర్‌లకు కూడా ఈ బహిరంగ లేఖ రాశారు. ప్రస్తుత ప్రభుత్వం ఓడిపోతే అధికార బదిలీ సక్రమంగా జరగదన్న ఆందోళన నెలకొందని తెలిపారు.

దుర్బుద్ధితో వ్యవహరించొద్దు

ఓట్ల లెక్కింపు రోజు ఎవరికీ భయపడవద్దు

కౌంటింగ్ సందర్భంగా అధికార యంత్రాంగానికి ఖర్గే లేఖ



న్యూఢిల్లీ, జూన్ 3: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా రాజ్యాంగాన్ని పాటించాలని కోరుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోమవారం అధికార యంత్రాంగానికి బహిరంగ లేఖ రాశారు. ఎలాంటి భయం, పక్షపాతం లేకుండా దేశానికి సేవ చేయాలని, ఎవరిపట్లా దుర్బుద్ధితో వ్యవహరించకూడదని కోరారు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగానే కాకుండా, రాజ్యసభలో ప్రతిపక్ష నేత హోదాలో ఈ లేఖ రాస్తున్నట్టు తెలిపారు. "ఓట్ల లెక్కింపు రోజున ఎవరికీ భయపడకండి. ఎలాంటి రాజ్యాంగేతర శక్తులకూ తలవంచకండి. మెరిట్ ఆధారంగా నిర్ణయాలు తీసుకోండి. మనం భవిష్యత్తు తరాలకు సచేతనమైన ప్రజాస్వామ్యాన్ని, సుస్థిరమైన రాజ్యాంగాన్ని అందించాల్సి ఉంది. భారత్ నిజమైన ప్రజాస్వామ్య దేశంగా ఉండాలన్నా, రాజ్యాంగంలో పొందుపరిచిన ఉన్నత విలువలను కాపాడాలన్నా అది అధికార యంత్రాంగం ద్వారా సాధ్యమ"ని తెలిపారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినందుకు ఎలక్షన్ కమిషన్, సివిల్ సర్వెంట్లు, పోలీసులు, జిల్లా కలెక్టర్లు, ఇతర సిబ్బందిని అభినందించారు. సివిల్ సర్వెంట్లు భారత దేశ ఉక్కు చట్రంలాంటి వారని ప్రథమ హోం మంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. రాజ్యాంగానికి అనుగుణంగా వివిధ సంస్థలను ఏర్పాటు చేసి ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులు వేసింది కాంగ్రెస్ పార్టీయేనన్న విషయం దేశ ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. "సంస్థలు స్వతంత్రంగా వ్యవహరించడం చాలా ముఖ్యమైన విషయం. ప్రతి సివిల్ సర్వెంట్ కూడా రాజ్యాంగానికి అనుగుణంగా నడుచుకుంటామని ప్రమాణం చేస్తారు. అందువల్ల కింది నుంచి పై స్థాయి వరకు ఉన్న అధికారులంతా తమ విధి నిర్వహణలో ఈ స్ఫూర్తిని ప్రదర్శించాలి. ఈ విషయంలో అధికార కూటమి నుంచి గానీ, విపక్ష కూటమి నుంచిగానీ ఎలాంటి బెదిరింపులు వచ్చినా లొంగకండి" అని కోరారు. "గత దశాబ్ద కాలంగా సంస్థల స్వయంప్రతిపత్తిని అధికార పక్షం ఒక పద్ధతి ప్రకారం అణగదొక్కింది. దాని ప్రభావంగా ప్రజాస్వామ్య విలువలు దెబ్బతిన్నాయి. దేశాన్ని నియంతృత్వం వైపుగా తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయి. సంస్థలు కూడా తమ స్వయంప్రతిపత్తిని విస్మరించి అధికార పక్ష హుకుంలను అమలు చేస్తున్నాయి. కొందరితే అధికార పార్టీ మాదిరిగా మాట్లాడుతుండడంతో పాటు, వాటి వ్యవహార శైలినే అనుసరిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వారి రాజకీయ భావజాలాన్నే చెబుతున్నారు" అని వ్యాఖ్యానించారు. ఇందుకు ఆ సంస్థలను తప్పుపట్టలేమని ఖర్గే అభిప్రాయపడ్డారు. "మంద బలం, బెదిరింపులు, వివిధ వ్యవస్థలను దుర్వినియోగం చేసి భయపెట్టడం, తమ అధికారం ముందు అందరూ తలవంచాలనే మనస్తత్వం కలిగిన ప్రభుత్వ పక్ష వైఖరితో ఇలాంటివి జరుగుతున్నాయి. ఈ కారణంగా చివరకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యానికి నష్టం కలుగుతోంది" అని వివరించారు.

జూలై-సెప్టెంబరులో లా నినా!

- ప్రపంచ వాతావరణ విభాగం ప్రకటన
- బలహీనపడుతున్న ఎల్ నినో

న్యూఢిల్లీ, జూన్ 3: ప్రపంచవ్యాప్తంగా ప్రతికూల వాతావరణం, రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలకు కారణమైన ఎల్ నినో బలహీనపడుతోందని, ఈ ఏడాది జూలై-సెప్టెంబరులో లా నినా ఏర్పడే అవకాశం 60 శాతం వరకు ఉందని ప్రపంచ వాతావరణ విభాగం(డబ్ల్యూఎంవో) తాజా బులెటిన్‌లో వెల్లడించింది. ఎల్ నినో ప్రభావంతోనే గత 13 నెలలుగా సముద్ర ఉపరితలాలపై రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు కొనసాగాయని తెలిపింది. ఆ ఫలితంగానే భారత్, పాకిస్థాన్ సహా దక్షిణాసియాలో కోట్లాదిమంది ప్రజలు ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో అత్యధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోయారని, అత్యంత వేడి ఏప్రిల్‌ను కూడా ఈ ఏడాది చూశామని పేర్కొంది. ఎల్ నినో వల్ల పసిఫిక్ మహాసముద్రం తూర్పు, మధ్య ప్రాంతాల్లో జలాలు అసాధారణంగా వేడెక్కిపోతున్నాయని వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వాతావరణ కేంద్రాల దీర్ఘకాలిక అంచనాల మేరకు ఈ ఏడాది జూన్-ఆగస్టు కాలంలో లా నినా లేదా తటస్థ పరిస్థితి ఏర్పడేందుకు సమాన అవకాశాలు(50 శాతం) ఉన్నాయని పేర్కొంది. జూలై-సెప్టెంబరు నాటికి లా నినా ఏర్పడే అవకాశాలు 60 శాతానికి, ఆగస్టు-నవంబరులో 70 శాతానికి పెరుగుతాయని తెలిపింది. ఆ సమయంలో తిరిగి ఎల్ నినో ఏర్పడే అవకాశాలు చాలా తక్కువని పేర్కొంది. ఎల్‌నినో వల్ల భారత్‌లో బలహీన రుతుపవన గాలులు, పొడి వాతావరణం ఏర్పడిందని, దీనికి వ్యతిరేకంగా లా నినా వల్ల రుతుపవన కాలంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. '2023 జూన్ నుంచి ప్రతి నెలా ఉష్ణోగ్రతల్లో కొత్త రికార్డులు నెలకొల్పాయి. అలాగే, అత్యంత వేడి సంవత్సరంగా 2023 రికార్డులకెక్కింది. ఎల్ నినో ముగియడమంటే దీర్ఘకాలిక వాతావరణ మార్పులకు విరామమని అర్థంకాదు. ఎందుకంటే గ్రీన్ హౌస్ వాయువుల విడుదల వల్ల గ్రహం వేడెక్కడం కొనసాగుతోంది. రానున్న నెలల్లోనూ అసాధారణ సముద్ర ఉపరితల అత్యధిక ఉష్ణోగ్రతలు కీలకపాత్ర పోషించే అవకాశం ఉంది' అని డబ్ల్యూఎంవో డిప్యూటీ ప్రధానకార్యదర్శి కో బారెట్ పేర్కొన్నారు.

ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకు భవాని



బెంగళూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల వివాదంలో బాధితురాలిని కిడ్నాప్ చేసిన కేసు నిందితురాలు, ప్రజ్వల్ తల్లి భవాని ముందస్తు బెయిల్ కోసం సోమవారం హైకోర్టును ఆశ్రయించారు. కిడ్నాప్ కేసులో రేవణ్ణ తొలి నిందితుడు కాగా, ఇప్పటికే అరెస్టు అయి బెయిల్‌పై బయటకు వచ్చారు. భవాని రేవణ్ణకు దర్యాప్తు సంస్థ సిట్ నోటీసులు జారీ చేసింది. ఆమె స్పందించలేదు. ప్రజాప్రతినిధుల న్యాయస్థానంలో భవాని బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురైంది. దీనిపై ఆమె తరఫు న్యాయవాదులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సిట్ జారీ చేసిన నోటీసుల ప్రకారం తాను చట్ట ఉల్లంఘనలకు పాల్పడలేదని, అరెస్టు భయం ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. దర్యాప్తునకు సహకరించాలని ఆమెకు శనివారం రెండోసారి సిట్ నోటీసులు జారీ చేసింది. హొళెనరసీపుర ఇంట్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలవరకు ఉండాలని, విచారణకు సహకరించాలని సూచించారు. ఆమె అందుబాటులో లేకపోవడంతో గుర్తించేందుకు 4 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

ప్రజ్వల్‌కు మరోసారి వైద్య పరీక్షలు

అత్యాచార ఆరోపణలతో అరెస్టు అయిన హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు మరోసారి వైద్య నిర్వహించారు. ప్రజ్వల్‌ను సిట్ అధికారులు అంబులెన్స్‌లో సోమవారం శివాజీనగర్‌లోని బౌరింగ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కోర్టుకు సమర్పించేందుకు అవసరమైన మూడు, నాలుగు రకాల వైద్యపరీక్షలు చేయాలని వైద్యాధికారులను కోరారు. దీంతో మెడికల్ కాలేజీ డీన్, సూపరింటెండెంట్ సమక్షంలోనే వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రజ్వల్‌ను కస్టడీకి తీసుకుని మూడు రోజులు గడిచింది. ఏ ప్రశ్న అడిగినా తాను తప్పు చేయలేదని, ఇదంతా రాజకీయ కుట్ర అని, తనను రాజకీయంగా వేధిస్తున్నారని చెప్పినట్లు తెలుస్తోంది. పంచనామా జరిపేందుకు ప్రజ్వల్‌ను హాసన్ జిల్లా హొళెనరసీపురకు సోమవారం రాత్రి లేదా మంగళవారం తరలించే అవకాశం ఉంది. లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ మంగళవారం ఉండడంతో సిట్ అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ప్రజ్వల్ హాసన్ ఎంపీ అభ్యర్థి. ఇలాంటి సమయంలో ప్రజ్వల్‌ను పంచనామాకు తీసుకెళ్తే శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని అధికారులు ఆలోచిస్తున్నట్లు సమాచారం.

గ్యాంగ్‌స్టర్ అరుణ్ గావ్లీ విడుదలపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ, జూన్ 3: హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న గ్యాంగ్‌స్టర్-పొలిటీషియన్ అరుణ్ గావ్లీని ముందస్తుగా విడుదల చేయడంపై స్టే విధిస్తూ సోమవారం సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. తనను ముందస్తుగా విడుదల చేయాలంటూ గావ్లీ పెటుకున్న దరఖాస్తును పరిశీలించాలంటూ ఏప్రిల్ 5న బాంబే హైకోర్టు నాగపూర్ బెంచ్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన ఆదేశాలపై స్టే ఇచ్చింది. 2006లో శివసేన కార్పొరేటర్ కమలాకర్ జామసండేకర్‌ను హత్య చేసిన కేసులో గావ్లీకి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.17 లక్షల జరిమానా విధిస్తూ ముంబయిలోని సెషన్స్ కోర్టు 2012లో తీర్పు చెప్పింది. అప్పటి నుంచి ఆయన జైలులో ఉన్నారు. వయసు 65 ఏళ్లు దాటడం, శారీరకంగా బలహీనపడడంతో 2006 రెమిషన్ పాలసీ ప్రకారం ముందస్తుగా విడుదల చేయాలని గావ్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. కానీ, గావ్లీ దరఖాస్తును పరిశీలించాలని హైకోర్టు ఆదేశించింది. దీనిపై ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేయగా స్టే ఇచ్చింది. గావ్లీ 2004-09 మధ్య ముంబయిలోని చించ్‌పోక్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పనిచేశారు.

మాల్దీవులు వద్దు.. లక్షద్వీప్ ఉందిగా..

- ఇక్కడి అందమైన బీచ్‌లు సందర్శించండి
- తమ దేశ పౌరులకు ఇజ్రాయెల్ పిలుపు
- మాల్దీవుల నిషేధం ప్రకటనతో నిర్ణయం

న్యూఢిల్లీ, జూన్ 3: ఇజ్రాయెల్ పౌరులను తమ దేశంలోకి ప్రవేశించకుండా నిషేధిస్తామని మాల్దీవులు ప్రభుత్వం ప్రకటించిన మరుసటి రోజే ఇజ్రాయెల్ కీలక నిర్ణయం తీసుకుంది. ఎవరూ మాల్దీవుల పర్యటనకు వెళ్లొద్దని దానికి బదులుగా భారత్‌లోని లక్షద్వీప్‌ను సందర్శించాలని తమ దేశ ప్రజలను కోరింది. ఈ నిర్ణయాన్ని భారత్‌లో ఇజ్రాయెల్ కాన్సుల్ జనరల్ కోబీ షోషాని స్వాగతించారు. మాల్దీవుల్లో ఇజ్రాయేలీయులపై విధించే నిషేధం వారిని లక్షద్వీప్ బీచ్‌లను సందర్శించేలా ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు. "మాల్దీవుల ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఇజ్రాయేలీయులు ఇప్పుడు లక్షద్వీప్ అందమైన బీచ్‌లను సందర్శించవచ్చు" అని షోషాని ఎక్స్ (ట్విటర్)లో ట్వీట్ చేశారు. లక్షద్వీప్ అందించే ప్రశాంతతను చూడాలని ప్రజలను ప్రోత్సహిస్తూ భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఏడాది జనవరి 4న చేసిన ట్వీట్‌ను కూడా షోషాని మళ్లీ షేర్ చేశారు. ఈ నేపథ్యంలో భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం లక్షద్వీప్‌లోని అందమైన బీచ్‌ల చిత్రాలను ఎక్స్‌లో షేర్ చేసింది. 'మాల్దీవులు ఇకపై ఇజ్రాయెల్ పౌరులను స్వాగతించడం లేదు కాబట్టి.. ఇక్కడ కొన్ని అందమైన, అద్భుతమైన భారత్ బీచ్‌లు ఉన్నాయి. ఇజ్రాయెల్ పర్యాటకులను ఇక్కడ ఆప్యాయంగా స్వాగతిస్తారు. మంచి ఆతిథ్యం ఇస్తారు' అని ట్వీట్ చేసింది. ఈ ఏడాది ఆరంభంలో మాల్దీవులకు చెందిన కొందరు మంత్రులు భారత్‌పై చేసిన వివాదాస్పద వ్యాఖ్యల కారణంగా ఇరుదేశాల మధ్య దౌత్యపరమైన వివాదం నెలకొంది. దీంతో 'బాయ్‌కాట్‌మాల్దీవులు' పేరిట సోషల్ మీడియాలో భారత్ నుంచి పెద్దఎత్తున నిరసన మొదలైంది. కాగా.. గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల నేపథ్యంలో పాలస్తీనియన్లకు మద్దతుగా ఇజ్రాయేలీయులను తమ దేశంలో పర్యటించకుండా నిషేధించాలని మాల్దీవులు ప్రభుత్వం ఆదివారం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ కూడా తమ దేశ పౌరులెవరూ మాల్దీవులకు వెళ్లొద్దని పిలుపునిచ్చింది.

అప్పు చేసి బినామీ కాంట్రాక్టర్లకు బిల్లులు

- మరో 4 వేల కోట్ల అప్పునకు సర్కారు దరఖాస్తు
- రుణాలు, చెల్లింపులు చేయకుండా అడ్డుకోండి
- ఎన్నికల కమిషన్‌కు అచ్చెన్నాయుడు లేఖ

అమరావతి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అప్పుచేసి బినామీ కాంట్రాక్టర్లకు, కంపెనీలకు బిల్లుల రూపంలో చెల్లించి అధికార దుర్వినియోగానికి పాల్పడిందంటూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. అప్పులపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిని ప్రభుత్వం జూన్ ఒకటో తేదీ నాటికే దాటేసిందని పేర్కొన్నారు. ఈ ఏడాది చేసిన అప్పుల్లో ఎక్కువ శాతం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాతే ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.4 వేల కోట్ల అప్పులకు దరఖాస్తు చేసిందన్నారు. సీఎఫ్ఎంఎస్ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇప్పుడు తెస్తున్న రూ.4 వేల కోట్లు అప్పులు సైతం కాంట్రాక్టర్లకు చెల్లించాలని చూస్తున్నారని ఫిర్యాదు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని ఎన్నికల ఫలితాలు విడుదలయ్యే వరకు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఎలాంటి అప్పులు, చెల్లింపులు చేయకుండా అడ్డుకోవాలని కోరారు. ఇష్టానుసారంగా అప్పులు చేసేందుకు సహకరిస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న అధికారులపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

నరసాపురం వరకు 'నైరుతి'



కర్నూలు నగరంలోని అశోక్‌నగర్ ప్రధాన రహదారిలో కూలిన భారీ వృక్షం

(మొదటి పేజీ తరువాయి)

అన్ని మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. రాప్తాడు సమీపంలోని పండమేర వంక పొంగడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బొమ్మనహాల్, కణేకల్లు మండలాల్లో వేదవతి హగరి నదికి భారీగా నీరు చేరింది. ఉద్దేహాల్ వద్ద వంతెనపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో బళ్లారి, కళ్యాణదుర్గం ప్రాంతాలకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అనంతపురం జిల్లావ్యాప్తంగా 17.90 హెక్టార్లల్లో రూ.34.72 లక్షల విలువైన ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. అరటి, మామిడి, బొప్పాయి, టమోటా పంటలు ధ్వంసమయ్యాయి. బొమ్మనహాళ్ మండలంలో 200 ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న పంటలు నీటమునిగాయి. రూ.60 లక్షలకుపైగా పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలంలో వంకలు, వాగులు, చెక్‌డ్యాంలు పొంగిపొర్లాయి. 12 ఎకరాల్లో సాగుచేసిన అరటి మొక్కలు నీటమునిగాయని, రూ.10 లక్షల దాకా నష్టపోయానని రైతు కనగానపల్లిలో రైతు బట్టా నాగభూషణం ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోనూ వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించాయి. గాలివానకు పలుచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు, వైర్లు తెగిపోయాయి. కర్నూలు-ఉల్వాల ప్రధాన రహదారిలో వంతెన కూలిపోయి సి.బెళగల్ మండలం గుండ్రేవుల, సంగాల, కొత్తకోట, కర్నూలు రూరల్ మండలం రేమట, ఉల్వాల తదితర సమీప ప్రాంతాల నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. కల్లూరు మండలంలో వక్కెర వాగుకు వరద పోటెత్తింది. కర్నూలు నగరంలోని అశోక్‌నగర్ సెంటర్‌లో ప్రధాన రహదారి పక్కనే ఉన్న భారీ వృక్షం కూలి ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంపై పడింది. చిత్తూరు, ప్రకాశం, కర్నూలు, అల్లూరి, మన్యం, విశాఖ జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడ్డాయి.



అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం కొళగానహల్లి వద్ద నీట మునిగిన పత్తి పంట

నేడు పిడుగులతో వర్షాలు..

రానున్న 24 గంటల్లో రాయలసీమలో అనేకచోట్ల, కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసేటప్పుడు, పిడుగులు పడే సమయంలో ఆరుబయట ఉండొద్దని సూచించింది. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, సత్యసాయి, కడప, అన్నమయ్య చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడతాయని తెలిపింది.

ఒకే రోజు 110 మి.మీ. వర్షం

- బెంగళూరులో 133 సంవత్సరాల రికార్డు బద్ధలు

బెంగళూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో వర్షాలు సాధారణమే. అయితే, జూన్ ఆరంభంలోనే ఆదివారం ఒకే రోజు ఏకంగా 110.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. 133 ఏళ్ల నాటి రికార్డును బద్దలు కొట్టింది. బెంగళూరులో 1891 జూన్ 16న 101.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆ రికార్డును తాజా వర్షం తిరగరాసింది. నగరంలో శని, ఆదివారాలలో మొత్తం 140.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయేదాకా వర్ష బీభత్సం కొనసాగింది. ఒక్కరోజులోనే 261 విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. 200కు పైగా చెట్లు కూలాయి. దాదాపు నగరమంతటా చెట్లు, కొమ్మలు విరిగిపడిన దృశ్యాలు కనిపించాయి. ఈనెల 5వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధనశాఖ ప్రకటించింది.

ఆ 4 వేల కోట్లను వాడుకోరాదు

- ఎన్నికల నోటిఫికేషన్ తర్వాతా 21 వేల కోట్ల అప్పులు
- అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారు: వర్ల రామయ్య

అమరావతి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కమీషన్ల కోసం ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆరోపించారు. సోమవారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత కూడా దాదాపు రూ.21 వేల కోట్ల అప్పులు తెచ్చి అస్మదీయ కాంట్రాక్టర్లకు కట్టబెట్టి కమీషన్లు దండుకున్నారని విమర్శించారు. ఆ రూ.21 వేల కోట్లు ఎవరికి ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఆర్బీఐ బాండ్ల ద్వారా వచ్చే రూ.4 వేల కోట్లలో ఒక్క రూపాయిని కూడా సీఎస్, ఫైనాన్స్ సెక్రటరీ సత్యనారాయణ ఎవరూ విడుదల చేయకూడదన్నారు. రూ.4 వేల కోట్లను అలాగే ఉంచాలని, ప్రజా సంక్షేమానికి ఎలా ఖర్చు పెట్టాలో వచ్చే ప్రభుత్వం చూసుకుంటుందన్నారు. అల్లర్లకు తాడేపల్లి కేంద్రంలో ఏ ప్రణాళికలు రచిస్తున్నారోనని, పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. క్రిమినల్ మైండ్‌తో ఉన్న నేతలు చేసే వాటిని అరికట్టడానికి సీఈసీ డీజీపీకి సరైన డైరెక్షన్ ఇవ్వాలన్నారు. పీఎస్‌ఆర్ ఆంజనేయులు, కొల్లి రఘురామిరెడ్డి, మాజీ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి కదలికలపై ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ నిఘా పెట్టాలన్నారు.

కే-సెట్ ఫలితాల్లో నారాయణ ప్రభంజనం

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన కే-సెట్ పరీక్షల్లో తమ సంస్థ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు సింధూర, శరణిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కే-సెట్‌లో తమ విద్యార్థులు 1,2,3,4,6,7,9,10 వంటి ర్యాంకులతో సత్తా చాటారని చెప్పారు. 10లోపు ర్యాంకులు 19 వచ్చాయని, 100 లోపు ర్యాంకులు 92 వచ్చాయని వెల్లడించారు. అలాగే, వివిధ కేటగిరీల్లో రెండు విభాగాల్లో 1,000 లోపు 399 ర్యాంకులను సాధించినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటకలోనూ తమ విజయ ప్రస్థానం కొనసాగుతోందని సింధూ, శరణి పేర్కొన్నారు.

ఢిల్లీ మద్యం కేసులో రూ.1100 కోట్ల అక్రమాలు

- అందులో రూ.292 కోట్ల మేరకు కవిత పాత్ర!
- విజయ్ నాయర్ ద్వారా ఆప్‌కు 100 కోట్లు ఇచ్చారు
- ఆమె ఆస్తులను స్వాధీనం చేసుకోవాలి
- అనదపు చార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ



న్యూఢిల్లీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించిన కల్వకుంట్ల కవితపై మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 4 కింద చర్యలు తీసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ప్రత్యేక కోర్టును కోరింది. ఆమె ఆస్తుల స్వాధీనానికి ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేసింది. మద్యం కుంభకోణంలో మొత్తం రూ.1100 కోట్ల మేరకు అక్రమాలు జరిగాయని, ఇందులో కవిత పాత్ర రూ.292 కోట్ల మేరకు ఉందని తెలిపింది. ఈ మేరకు ఢిల్లీలోని ప్రత్యేక కోర్టులో ఈడీ సోమవారం అనుబంధ చార్జిషీటు దాఖలు చేసింది. 'ఢిల్లీ మద్యం కుంభకోణం ఎలా జరిగింది? ఇందులో ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, అరుణ్ రామచంద్ర పిళ్లై, విజయ్ నాయర్, సమీర్ మహేంద్రుతోపాటు వివిధ మద్యం సంస్థల పాత్ర ఏంటి? ఎక్కడెక్కడ సమావేశాలు నిర్వహించారు? గోవా ఎన్నికల సమయంలో ఆప్‌కు ఎలా ముడుపులు సమకూర్చారు?..' వంటి విషయాలన్నింటినీ ఈడీ వివరించింది. దాదాపు 44 మంది సాక్షులను, 92 కీలక డాక్యుమెంట్లను చార్జిషీటుతో పొందుపర్చింది.

ఆప్‌కు 100 కోట్ల ముడుపులిచ్చిన కవిత..

ఢిల్లీ మద్యం విధానంలో.. కవిత 33 శాతం భాగస్వామిగా ఉన్న ఇండోస్పిరిట్ కంపెనీ రూ.92 కోట్ల మేరకు లాభాలు పొందిందని, కవితకు బినామీగా అరుణ్ రామచంద్ర పిళ్లై వ్యవహరించారని ఈడీ తెలిపింది. మద్యం విధానాన్ని తమకు అనుకూలంగా మార్చేందుకు విజయ్ నాయర్ ద్వారా ఆమ్ ఆద్మీ పార్టీకి కవిత రూ.100 కోట్ల ముడుపులు ఇచ్చారని పేర్కొంది. తన మొబైల్ నంబరు 8008666666లో ఉన్న సమాచారం అంతటినీ కవిత తొలగించారని, ఆమె ఇచ్చిన ఫోన్‌లో ఎలాంటి సమాచారం లభించలేదని తెలిపింది. అనేక మంది సాక్షులను ప్రభావితం చేశారని తెలిపింది. అరుణ్ పిళ్లై కూడా కవిత పాత్ర గురించి తాను చేసిన ప్రకటనను వెనక్కి తీసుకున్నారని వెల్లడించింది. బుచ్చిబాబు, రాఘవ మాగుంట మధ్య వాట్సాప్ చాట్ల గురించి తనకేమీ తెలియదని చెప్పారని వివరించింది. సౌత్ గ్రూపులో సభ్యులు సమీర్ మహేంద్రుతో కలిసి ఇండో స్పిరిట్‌ను నెలకొల్పడంలో కీలకపాత్ర పోషించడంతో కవిత పెర్నాండ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో కూడా డిస్ట్రిబ్యూషన్ హక్కులను పొందారని, లాభాల్లో రూ.102.8 కోట్లు కవితకు దక్కాయని ఈడీ తెలిపింది.

కవిత కస్టడీ పొడిగింపు

కవిత జ్యుడిషియల్ కస్టడీని న్యాయస్థానం మరోసారి పొడిగించింది. సోమవారం ఆమెను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. ఈ నెల 7 వరకు జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తున్నట్లు జడ్జి చెప్పారు. కోర్టు హాలులోకి వచ్చే ముందు కవిత 'జై భారత్.. జై తెలంగాణ' అంటూ నినాదాలు ఇచ్చారు.



దేవాపై దాడి చేస్తున్న గంజాయి మూక

ఒంగోలులో రెచ్చిపోయిన గంజాయి మూక

- అక్క కుమార్తెను అల్లరి చేస్తుండటంతో ప్రశ్నించినందుకు మూకుమ్మడి దాడి
- బాధితుడి కుమారుడిపైనా దాష్టీకం
- కంటికి తీవ్ర గాయం, చూపు కోల్పోయే ప్రమాదం
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

ఒంగోలు(క్రైం), జూన్ 3: ఒంగోలులో గంజాయి మూక మరోసారి రెచ్చిపోయింది. తన అక్క కుమార్తెను అల్లరి చేస్తుండటంతో ప్రశ్నించినందుకు విచక్షణా రహితంగా కర్రలతో బాదడమే కాకుండా అతని కుమారుడి కంటిపైన కొట్టారు. ఈ సంఘటన ఒంగోలు శర్మ కాలేజీ వద్ద గత నెల 26న జరిగింది. దాడికి సంబంధించిన వీడియో సోమవారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ ఘటన వెలుగు చూసింది. స్థానిక జక్రయ్య ఆసుపత్రి వద్ద నివాసం ఉండే రోహిత్ తన ఫోన్‌లో ఓ యువతితో కలిసి తీసుకున్న ఫొటో పెట్టుకొని తిరుగుతున్నాడు. అది గమనించిన కొంతమంది ఆ యువతి మేనమామ, శర్మ కాలేజీ సమీపంలో నివాసం ఉండే ఆటోడ్రైవర్ దేవాకు చెప్పారు. దీంతో గత నెల 25న రాత్రి శర్మ కాలేజీ వద్ద ఉన్న రోహిత్‌ను దేవా ప్రశ్నించడంతో వారి మధ్య ఘర్షణ జరిగింది. అనంతరం మరుసటి రోజు మధ్యాహ్నం రోహిత్ స్నేహితుడు ప్రసాద్.. దేవా కుమారుడికి ఫోన్ చేసి రాత్రి జరిగిన విషయం గురించి మాట్లాడుకుందామని కాలేజీ వద్దకు పిలిపించారు. విషయం తెలిసి అక్కడికి వెళ్లిన దేవాపై రోహిత్, ప్రసాద్, రోహిత్ తండ్రి వెంకయ్యతోపాటు సుమారు 25మంది మూకుమ్మడిగా దాడి చేశారు. కర్రలతో విచక్షణారహితంగా చితకబాదారు. ఆ సమయంలో వారంతా గంజాయి, మద్యం మత్తులో ఉన్నట్టు తెలుస్తోంది. బీరు సీసాలతో దాడి చేశారని ఆసుపత్రిలో చేరిన దేవా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎంతసేపటికీ దేవా ఇంటికి రాకపోయేసరికి అక్కడికి వెళ్లిన అతని కుమారుడు సుబ్రహ్మణ్యంపైనా దాడి చేసి కంటి మీద తీవ్రంగా గాయపరిచారు. అతన్ని ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు కంటిచూపు రావడం కష్టమేనని తేల్చారు. ఈ మేరకు ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశామని తెలిపారు.

యువకుడిని బలిగొన్న లోన్ యాప్స్

- వేధింపులు తాళలేక రైలు కిందపడి ఆత్మహత్య

గోపాలపట్నం (విశాఖపట్నం), జూన్ 3: లోన్ యాప్స్ నిర్వాహకుల వేధింపులు తాళలేక ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు...విశాఖ జిల్లా పెందుర్తి సమీపంలోని సుజాతనగర్‌కు చెందిన జెన్నేటి జగన్‌కుమార్ (23) డిగ్రీ చదువుతున్నాడు. మొబైల్‌లో గేమ్స్‌కు అలవాటుపడిన జగన్‌కుమార్ లోన్ యాప్‌ల నుంచి రుణం తీసుకున్నాడు. అవి తీర్చకపోవడంతో యాప్‌ల నిర్వాహకుల నుంచి వేధింపులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం సింహాచలం రైల్వేస్టేషన్ రెండో నంబర్ ప్లాట్‌ఫారం పైనుంచి యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ వెళుతున్న సమయంలో కిందకు దూకాడు. దీంతో రైలు ఢీకొని జగన్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు.

సజ్జల, పేర్ని నానిని అదుపులోకి తీసుకోవాలి

- టీడీపీ ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి

మాజీ మంత్రి పేర్ని నాని ప్రభుత్వ ఉద్యోగులను అంతు చూస్తామని బెదిరిస్తున్నారని టీడీపీ ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఉద్యోగులకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. దాడులు, దౌర్జన్యాలకు దిగేవారే కౌంటింగ్ ఏజెంట్లుగా వెళ్లాలని చెప్పడం సిగ్గుచేటని, అధికారులకు ఫిర్యాదు చేసినా సజ్జలను అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. సోమవారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సజ్జల, పేర్ని నాని లాంటి వ్యక్తులు బయట ఉంటే ఉద్రిక్త పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవాలన్నారు. ఓటమి భయంతో వైసీపీ నేతలు అవాకులు, చవాకులు పేలుతున్నారన్నారు.

నకిలీ విత్తన బాధ్యులపై కఠిన చర్యలు

- ఆర్బీకేల్లో విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉంచాలి: సీఎస్

అమరావతి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగుకు అవసరమైన, నాణ్యమైన విత్తనాల సరఫరాకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాలపై ఫిర్యాదులొస్తే.. వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం అమరావతి సచివాలయంలో విత్తన సరఫరాపై ఆయన సమీక్షించారు. ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమౌతున్న నేపథ్యంలో ఆర్బీకేల్లో రాయితీ, రాయితేతర విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉంచాలని, విత్తన సరఫరాపై మండలాల వారీగా నిరంతర పర్యవేక్షణ జరగాలని స్పష్టం చేశారు. వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ ఈ సీజన్‌కు వరి వంగడాలు 2.35 లక్షల క్వింటాళ్లు, వేరుశనగ 3.05 లక్షల క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇప్పటికే వేరుశనగ విత్తనాలు 40 శాతం సబ్సిడీపై పంపిణీ చేపట్టామన్నారు.

అక్రమ మద్యం కేసులో వైసీపీ అభ్యర్థి లావణ్య తండ్రి

- శివనాగేంద్రాన్ని ఏ2గా చేర్చుతూ కేసు నమోదు చేసిన సెబ్ అధికారులు
- మంగళగిరిలో సంచలనం రేపిన కేసు



సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం బాక్సులు

మంగళగిరి సిటీ, జూన్ 3: గుంటూరు జిల్లా మంగళగిరిలో ఇటీవల సంచలనంరేపిన అక్రమ మద్యం కేసులో వైసీపీ నేతల పాత్రపై స్పష్టత వచ్చింది. మంగళగిరి వైసీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య తండ్రి కాండ్రు శివనాగేంద్రంపై కేసు నమోదు చేసినట్టు సెబ్ అధికారులు వెల్లడించారు. ఆయనను ఏ2గా పేర్కొన్నట్టు తెలిపారు. మంగళగిరి కాండ్రు వారి వీధిలో దామర్ల వీరాంజనేయులు నివాసంలో అక్రమ మద్యం నిల్వలు ఉన్నట్టు సమాచారం రావడంతో ఈ నెల 1న సాయంత్రం సెబ్ అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడుల్లో భారీగా మద్యం నిల్వలను గుర్తించారు. మద్యం సీసాలపై ఎలాంటి స్టిక్కర్లు కనిపించలేదు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు తెచ్చిన మద్యం నిల్వల్లో ఇదొక డంప్ మాత్రమేనని ఆరోపణలున్నాయి. హైదరాబాద్ బ్లూ బ్రాండ్ 120 బాక్సులు, ఓల్డ్ ట్రావెన్ 16 బాక్సులు ఇలా మొత్తం సుమారు రూ.9.79 లక్షల విలువైన 6,528 మద్యం సీసాలను సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంటి యజమాని వీరాంజనేయులును అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల భర్త, మంగళగిరి వైసీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య తండ్రి శివనాగేంద్రం తమ ఇంట్లో మద్యం నిల్వలను ఉంచినట్టు నిందితుడు చెప్పారు. దీంతో ఏ-2గా శివనాగేంద్రంపై కేసు నమోదు చేసినట్టు సెబ్ అధికారులు తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో బిజీగా ఉన్నామని, తదుపరి విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఏఎన్‌సీకి ఎదురుదెబ్బ

దక్షిణాఫ్రికా పార్లమెంట్ ఎన్నికల్లో అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ)కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తెల్లవారి నుంచి దేశానికి విముక్తి సాధించిపెట్టిన ఆ పార్టీ పట్ల ప్రజలు ఈమారు విముఖత ప్రదర్శించడంతో ముప్పయ్యేళ్ళుగా ఒంటిచేత్తో దేశాన్ని ఏలుతున్నదల్లా ఇప్పుడు అధికారంలో కొనసాగడానికి మరోపార్టీతో చేతులు కలుపుతోంది. దేశాధ్యక్షుడు సిరిల్ రాంఫోసా నేతృత్వంలో ఏఎన్‌సీ ఈ ఎన్నికల్లో నలభైశాతం ఓట్లు మాత్రమే తెచ్చుకుంది. ప్రధాన ప్రతిపక్షం డెమొక్రాటిక్ అలయెన్స్ (డీఏ)కు 21శాతం, ఏఎన్‌సీ నుంచి విభేదించి బయటకుపోయిన మాజీ అధ్యక్షుడు జాకోబ్ జుమా నాయకత్వంలోని ఎంకే పార్టీకి 14శాతం వచ్చాయి. వామపక్ష భావజాలం ఉన్న ఎకనామిక్ ఫ్రీడమ్ ఫైటర్స్ (ఈఎఫ్ఎఫ్)కు 9శాతం ఓట్లు పడ్డాయి. ప్రజల్లో వ్యతిరేకత హెచ్చడంతో 1994లో నెల్సన్‌మండేలా నేతృత్వంలో అధికారం చేపట్టిన ఆ పార్టీ తొలిసారిగా ఈ ఎన్నికల్లో ఓటమి చవిచూడాల్సి వచ్చింది. ఏఎన్‌సిని అధికారానికి దూరంగా ఉంచడం ఈ ఎన్నికల సందేశమని విపక్షాల వాదన. ప్రజల ఆదేశాన్ని శిరసావహిస్తాం అంటూ, రాంఫోసా ఇప్పుడు కూటమిదిశగా చర్చలు జరుపుతున్నారు. ఓడినా, ఏఎన్‌సీయే పెద్దపార్టీ కనుక, రాంఫోసాకు ఆ అవకాశం ఉన్నది.

మూడుదశాబ్దాల తరువాత కూడా విద్యుత్, నీరు, ఆహారం ఇత్యాదివి సమస్యలుగా, అందని ద్రాక్షలుగా ఉన్నప్పుడు ప్రజలు మాత్రం ఎంత కని భరిస్తారు? వర్ణవివక్షనుంచి తమను రక్షించిన పార్టీగా ప్రజలకు ఇప్పటికీ ఆ పార్టీమీద ప్రేమాభిమానాలు లేకపోలేదు. కానీ, ఉత్సాహంగా పోలింగ్ బూత్‌ముందు బారులు తీరి ఓటేసిన తీరు మారింది. సకల సమస్యలకు, సమస్త కష్టాలకు తెల్లవాళ్ళే కారణమన్న వాదనకు కూడా కాలం చెల్లిపోయింది. మూడుదశాబ్దాలు అధికారంలో ఉన్న తరువాత, ఎవరినో తప్పుబట్టడానికీ, ఆరోపించడానికి కూడా ఏమీ ఉండదు. దీనికి తోడు, మాజీ అధ్యక్షుడు జాకోబ్ జుమా గత ఏడాది రాంఫోసాతో విభేదించి వేరు కుంపటిపెట్టుకోవడంతో ఏఎన్‌సీ బాగా బలహీనపడింది. పార్టీ ఓటును ఆయన గణనీయంగా చీల్చగలడన్న అంచనాలు నిజమైనాయి. జుమా స్వంత ప్రావిన్సు క్వాజులు నటాల్ లో ఈ చీలిక ప్రభావం బాగా కనిపించింది. అవినీతి, మనీలాండరింగ్ ఇత్యాది ఆరోపణలు ఎదుర్కొంటున్న సిరిల్ రాంఫోసా ఏమాత్రం ఉన్నతంగా వ్యవహరించకుండా తన రాజకీయబలంతో దర్యాప్తులను, విచారణలను అడ్డుకోవడం కూడా పార్టీ పరువు తీసింది. తన రాజకీయ మనుగడకోసం దాదాపు యాభైమంది విపక్ష నేతలు, అధికారులు, హక్కుల కార్యకర్తలను రాంఫోసా హత్య చేయించారన్న ఆరోపణలున్నాయి. దేశంలో అసమానతలు మరింత పెరిగాయి. నల్లవారు, తెల్లవారు అన్న తేడాలేకుండా ఈ ముప్పయ్యేళ్ళలో కొద్దిమంది ఆర్థికంగా బలపడ్డారు. అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోవడానికి ఏఎన్‌సి నాయకులు కారకులని ప్రజలు నమ్మారు. నిరుద్యోగం భయంకరంగా ఉంది, ప్రపంచంలోనే దక్షిణాఫ్రికా అగ్రస్థానంలో ఉంది. దారిద్ర్యం యాభైశాతం దాటింది, నేరాలు అధికమైనాయి. ఇంతటి తీవ్ర పరిస్థితుల నేపథ్యంలో ఈపాటి ప్రజావ్యతిరేకత సహజం కూడా.

ఏకచత్రాధిపత్యంగా దేశాన్ని దశాబ్దాలు ఏలిన ఓ పార్టీకి ఎవరితోనో పొత్తు పెట్టుకోవాల్సిరావడం పెద్ద విషమపరీక్ష. మైనారిటీ శ్వేతజాతీయుల నాయకత్వంలో, వారి ప్రయోజనాల పరిరక్షణకు ఉద్దేశించిన పార్టీగా పేరుపడిన డెమొక్రాటిక్ అలయెన్స్ (డీఏ)తో కూడా రాంఫోసా చర్చలు జరుపుతున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. కానీ, ఈ పార్టీతో చేతులు కలిపితే రాంఫోసాతో పాటు ఏఎన్‌సి మరింత అప్రదిష్టపాలవుతుంది. పార్టీ కేడరు, ఓటరు దీనిని చరిత్రాత్మక ద్రోహంగా, వెన్నుపోటుగా చూసే అవకాశం అత్యధికం. ఇక, అసమానతల నిర్మూలన, అవినీతిపై పోరాటం ఇత్యాది ఆశయాలనేకం లక్ష్యాలుగా ప్రకటించి ఏఎన్‌సీతో దశాబ్దం క్రితం వేరుపడిన మలేమా నాయకత్వంలోని ఎకనామిక్ ఫ్రీడమ్ ఫైటర్స్ (ఇఎఫ్ఎఫ్)తో చేతులు కలిపిన పక్షంలో పెట్టుబడిదారులకు, వ్యాపారవర్గాలకు వ్యతిరేకమన్న సందేశం ఇచ్చినట్టవుతుందని రాంఫోసా భయం. ఇఎఫ్ఎఫ్ రాడికల్ ఆలోచనలకు అనుగుణంగా నడుచుకుంటూ, దాని ఎజెండాకు కట్టుబడటం రాంఫోసాకు సమస్యలు తెచ్చిపెడుతుంది. మాజీ అధ్యక్షుడు జాకోబ్ జుమాతో చేతులు కలిపితే, ఆయనమీద ఉన్న అవినీతి ఆరోపణలు, కేసుల విషయంలో నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించాలి, సమీప భవిష్యత్తులోనే కేసులన్నీ వీగిపోవాలి. అధికారంలోకి రావడానికి రాంఫోసా ఇప్పుడు ఎవరితో పొత్తుపెట్టుకున్నా, అది ఏఎన్‌సి పునాదులు మరింత బలహీనపడటానికే తోడ్పడుతుంది.

మోదీకి తోడైన దైవబలం

'మేము మూడోసారి అధికారంలోకి రావడం ఎంతో దూరంలో లేదు. భారతీయ జనతా పార్టీ అత్యధిక సీట్లు సాధించి తీరుతుంది. దేశం మనోభావాలు ఎలా ఉన్నాయో నాకు బాగా తెలుసు. మూడో టరమ్‌లో మేము ఎన్నో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోబోతున్నాం. అది వేయి సంవత్సరాల వరకు భారతదేశ పునాదిని చెక్కుచెదరకుండా చేస్తుంది. మూడవ టరమ్‌లో భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ గత ఫిబ్రవరిలో రాజ్యసభలో చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో ఎన్డీఏ అఖండ విజయాలు సాధిస్తుందని దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ ప్రకటించడంలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే మళ్లీ మూడోసారి భారీ మెజారిటీతో ఎన్డీఏ అధికారంలోకి రావడం గురించి నరేంద్రమోదీకి కాని, భారతీయ జనతా పార్టీకి గానీ




■ వై. సత్యకుమార్
సత్యకాలమ్

ఎప్పుడూ సందేహాలు లేవు. ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన సంస్థల ప్రతినిధులకు ప్రజలు తమ మనసులో మాట చెప్పుకున్నారు. విచిత్రమేమంటే ప్రతిపక్షాలు గత కొద్ది నెలలుగా ఒక అభూత మాయాజాలాన్ని కల్పించి బీజేపీకి గతంలో మాదిరి సీట్లు రాబోవనే బూటకపు ప్రచారాన్ని విస్తృతంగా జనంలోకి తీసుకువెళ్లాయి. సామాజిక న్యాయం చేస్తామని, ఉచితంగా వనరుల్ని పంచిపెడతామని, ఈ దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో ఉన్నదని జనం ముందుకు వెళ్లాయి. వందలాది పుస్తకాలు, వ్యాసాలు రాశారు. కాని ఇవేవీ ప్రజలు ఏ మాత్రం నమ్మనందుకే ఇవాళ బీజేపీ అఖండమైన మెజారిటీతో తిరిగి రాబోతున్నది.

తన ఎన్నికల మేనిఫెస్టో తొలి పేజీలోనే కాంగ్రెస్ జనం ముందు ఒక ప్రశ్నను ఉంచింది : 'మీ జీవితాలు 2014లో కంటే మెరుగైన విధంగా ఉన్నాయా?' ఈ ప్రశ్న ప్రజలను బాగా ఆలోచింపచేసింది. 2014 కంటే ముందు జరిగిన దుర్మార్గాలు, దారుణాలు వారి కళ్లముందు కదలాడాయి. ఆకలి చావులు, రైతుల ఆత్మహత్యలు, అత్యాచారాలు, మత కల్లోలాలు, సిక్కుల ఊచకోతలు, ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోయడాలు, ప్రశ్నించిన వారిని జైలుపాలు చేయడం, ఒకే కుటుంబానికి వందిమాగధత్వం చేసిన వారికే పట్టం గట్టడం, బోఫోర్స్ నుంచి 2జీ వరకూ లక్షల కోట్ల అవినీతి కుంభకోణాలు, బుజ్జగింపు రాజకీయాలు, భారతీయులుగా ఆత్మగౌరవం కోల్పోవడం మొదలైనవన్నీ ప్రజలు తలుచుకున్నారు.

నిజంగా 2014కు ముందు అంతా బాగుంటే 2014లో మోదీ ఒక ప్రభంజనంలా ఎందుకు జనం ముందుకు వస్తారు? సంకీర్ణ యుగాలను ప్రక్కన పెట్టి పూర్తి మెజారిటీతో బీజేపీని ఎందుకు అధికారంలోకి తీసుకువస్తారు? త్రిపుర, బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో వామ పక్షాలను కూడా తుడిచిపెట్టి బీజేపీని ప్రత్యామ్నాయంగా ఎందుకు ఆదరిస్తారు? 2014లోనే కాదు 2019లో కూడా గతంలో భారీ మెజారిటీతో ఎందుకు మోదీకి పట్టం గడతారు? ప్రజలు కొన్ని దశాబ్దాల పాటు కుళ్లిపోయిన రాజకీయ వ్యవస్థల్ని చూశారు కనుకే కొత్తగా ఆలోచించారు. ఎలాంటి అవినీతి మచ్చలేని, ప్రపంచ చిత్రపటంలో భారతదేశ ఆత్మగౌరవానికి పట్టం కట్టగల నాయకుడిని ఎన్నుకున్నారు. గత నాయకత్వాల పట్ల ప్రజలు ఎంత విసిగిపోయారంటే మోదీ మాట్లాడిన ప్రతి మాటకూ ఆకర్షితులయ్యారు. ఆయన ఉపన్యాసాలకు ఉర్రూతలూగారు. ఆయన కరోనా సమయంలో దేశ ప్రజలను ఐక్యంగా ఉంచేందుకు, వారి మనోబలాన్ని పెంచేందుకు ఏమి చేయమంటే అది చేశారు. ప్రజల మనసుల్లో నిరాశా నిస్పృహలు రాకుండా ఒక ఐకమత్యం సాధించడంలో ఆయన విజయం సాధించారు. 140 కోట్లమంది భారతీయులు తనపై అంత విశ్వాసం ఉంచినందువల్లే నరేంద్రమోదీ అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. వ్యాపార, పారిశ్రామిక సంస్థలకు, ఎంఎస్ఎంఈ రంగానికీ భారీ ఎత్తున చేయూత కల్పించారు. కాలం చెల్లిన చట్టాలను రద్దు చేశారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థను ప్రవేశపెట్టి జనాన్ని బ్యాంకింగ్ వ్యవస్థలో భాగం చేశారు. ప్రజలకు ఆహారధాన్యాల సరఫరా చేసి ఆకలితో నిద్రించకుండా చూశారు. ప్రపంచ దేశాలన్నీ ఆర్థికంగా క్రుంగిపోతున్న తరుణంలో మోదీ తీసుకున్న చర్యల వల్ల భారతదేశం చెక్కుచెదరకుండా ఆర్థిక సుస్థిరత సాధించింది. ప్రపంచంలో అయిదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. భారతదేశం గత పాలకుల మాదిరి బలహీనంగా వ్యవహరిస్తుందనుకున్న పొరుగుదేశాలు ఈ దేశానికి మోదీ లాంటి బలమైన నేత ప్రధానిగా ఉన్న విషయం మరిచిపోయాయి. పాకిస్థాన్ ఎప్పటిలాగే భారత దేశ సరిహద్దుల్లో చొరబాటుకు ప్రయత్నిస్తే మోదీ ఆ దేశానికి బుద్ధి చెప్పారు. ఆ దేశ సరిహద్దుల్లోకి వెళ్లి మన సేన గుణపాఠం చెప్పింది. చైనా కూడా భారత దేశం పట్ల దుస్సాహసానికి పాల్పడి చివరకు వెనుకంజ వేసింది. మోదీ హయాంలో క్వాడ్, బ్రిక్స్, జీ-20, షాంఘై కార్పొరేషన్, ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థల్లో భారతదేశ ప్రాధాన్యత పెరిగిన తీరు అనన్యసామాన్యం. పుతిన్, బైడెన్ వంటి అగ్రదేశాధినేతలు మోదీకి స్నేహహస్తం చాచి ఆయన దౌత్యనీతిని ప్రశంసించిన సందర్భాలు ఎన్నో. ఈ కారణాల వల్లే 2024 తర్వాత కూడా మళ్లీ మోదీయే రావాలని ప్రజలు అనుకుంటున్నారని ఎగ్జిట్‌పోల్స్ తేల్చాయి.



భగవంతుడు తనతో బృహత్తరమైన పనులు చేయించాలనుకుంటున్నారు కాబట్టే తాను ఈ స్థాయికి ఎదిగి బలమైన నిర్ణయాలు ధైర్యంగా తీసుకోగలుగుతున్నానని మోదీ సవినయంగా చెప్పుకున్నారు. ప్రతిపక్షాలు ఎంత అవహేళన చేసినా పుణ్యభూమి అయిన మన భారతదేశానికి మోదీ ప్రధానిగా లభించడం దైవేచ్ఛ తప్ప మరేమీ కాదు. ప్రతిపక్షాలకు వాటి స్థానం ఏమిటో చూపించడం కూడా దైవేచ్ఛే. అది ప్రజల సమష్టి నిర్ణయం.

ప్రజల నాడి మోదీకి తెలిసినందువల్లే ఆయన తనపై వారికున్న గౌరవాన్ని పార్టీకి ఉపయోగపడేలా చేసేందుకు మోదీ గ్యారంటీ పేరుతో జనంలోకి వెళ్లారు. ఇది పార్టీ నిర్ణయం. గత పది సంవత్సరాలుగా మోదీ పట్ల జనం చూపుతున్న ఆదరణ, ఆరునెలల క్రితం మోదీ ఉధృతంగా ప్రచారం చేసి మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో గెలిపించడంతో సార్వత్రిక ఎన్నికల్లో కూడా మోదీ పేరుతో ముందుకు వెళ్లాలని పార్టీ నిర్ణయించింది. ఈ వ్యూహం ఫలించినట్లు స్పష్టమవుతోంది. నిజానికి మోదీ కూడా తాను కేవలం ఒక వ్యక్తినని భావించడం లేదు. ఆయన ఎప్పుడూ కుటుంబ సభ్యులను ఏ విధంగానూ ప్రోత్సహించలేదు. చిన్నతనంలోనే భార్యను వీడి ప్రజా సేవకు తనను తాను అంకితం చేసుకున్నారు. శంకరాచార్య తన తల్లితో ఏర్పర్చుకున్నట్లే మోదీ కూడా తన తల్లితో భవబంధాలు ఏర్పర్చుకున్నారు కాని ఆయన ఎప్పుడూ కుటుంబ బంధాలకు లోనుకాలేదు ఏదో ఒక దైవిక ప్రోద్బలం లేకపోతే అతి సాధారణ కుటుంబంలో జన్మించిన నరేంద్ర మోదీ చిన్ననాటే సంసార బంధాలను వీడి హిమాలయాలకు ఎందుకు వెళతారు? ఆ తర్వాత రామకృష్ణ మిషన్‌లో లభించిన మార్గదర్శకత్వంతో సంఘ్ కార్యకలాపాలకు ఎందుకు అంకితం అవుతారు? ఆ తర్వాత రాజకీయాల్లో ప్రవేశించి అనూహ్యంగా అంచెలంచెలుగా ఎందుకు పైకి ఎదుగుతారు? ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి పదవులను సుదీర్ఘకాలం నిర్వహించడమే కాక అంతర్జాతీయంగా కూడా భారతదేశం తలెత్తుకునేలా ఎలా చేయగలుగుతారు?. తనతో భగవంతుడు బృహత్తరమైన పనులు చేయించాలనుకుంటున్నారు కాబట్టే తాను ఈ స్థాయికి ఎదిగి బలమైన నిర్ణయాలు ధైర్యంగా తీసుకోగలుగుతున్నానని మోదీ ఇటీవల ప్రకటించడం వెనుక ఉద్దేశం ఇదే. ప్రతిపక్షాలు ఎంత అవహేళన చేసినా పుణ్యభూమి అయిన మన భారతదేశానికి మోదీ ప్రధానిగా లభించడం దైవేచ్ఛ తప్ప మరేమీ కాదు. ప్రతిపక్షాలకు వాటి స్థానం ఏమిటో చూపించడం కూడా దైవేచ్ఛే. అది ప్రజల సమష్టి నిర్ణయం.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

కొత్త ప్రభుత్వం ముందున్న సవాళ్లు

ప్రచండ వేసవి, ఆ పై ఎన్నికల వేడి... ఆసేతు హిమాచలం సమస్త ఓటర్లకు ఎన్నడూ లేనిరీతిలో ఉక్కపోత కల్పించాయి. కేంద్రంలో తదుపరి ప్రభుత్వాన్ని ఏ పార్టీ / కూటమి ఏర్పాటు చేసినప్పటికీ వివిధ సమస్యలను (ఎన్నికల ప్రచారం వాటిని ప్రజల దృష్టి నుంచి నెట్టివేసింది మరి) ఎదుర్కోవలసి వుంటుంది. మన దేశ పాలన అనేక లోపాలు, లొసుగులతో భ్రష్ట స్థితిలో ఉన్నది. అన్నిటా అసమగ్రతలు. కళంకాలూ తక్కువేమీ కాదు. ఈ సమస్యలను దీక్షా దక్షతలతో పరిష్కరించని పక్షంలో మన రిపబ్లిక్ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది.

మొదటి లోపం అవినీతిమయమైన పార్టీ వ్యవస్థ. రాజకీయ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యముండాలి. నాయకులను స్వేచ్ఛగా ఎన్నుకోవాలి. ఎన్నికైన నేతలు తమ సహచరులకు జవాబుదారీగా ఉండాలి. మరి భారతీయ రాజకీయాలు ఈ సమున్నత ప్రమాణాలకు యోజనాల దూరంలో లేవా? మన రాజకీయ పక్షాలు వ్యక్తి ఆరాధనకు నెలవులుగా ఉన్నాయి. లేదంటే కుటుంబ సంస్థలుగా మారిపోయాయి. మొదటి రకం పార్టీలకు ప్రథమ ఉదాహరణ భారతీయ జనతా పార్టీ. ఒక దశాబ్ద కాలంగా పార్టీ యంత్రాంగమంతా – ప్రభుత్వంలోని అనేక విభాగాలు కూడా... నరేంద్ర మోదీని ఒక మహా నాయకుడుగా చూపేందుకు శతవిధాల పాటుపడుతున్నాయి. మోదీ మహాశయుడు దైవాంశ సంభూతుడని, దైవతుల్యుడని ప్రచారం చేస్తున్నాయి. దేశ పౌరులు అందరూ ఆయన్ని ఆరాధించాలని ఒత్తిడి చేస్తున్నాయి. మోదీని నిరాక్షేపణీయంగా అనుసరించాలని ప్రేరేపిస్తున్నాయి. కాగా వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వాధినేతలుగా ఉన్న పలువురు నాయకులు కూడా ఇటువంటి వ్యక్తి పూజకు కేంద్రంగా ఉన్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ, కేరళలో పినరాయి విజయన్, ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్, ఆంధ్రాలో జగన్‌మోహన్ రెడ్డి, ఒడిషాలో నవీన్ పట్నాయక్‌లు తమ మాటే వేదవాక్కుగా వ్యవహరిస్తున్నారు.

కుటుంబ జమీగా మారిపోయిన పార్టీలు ప్రజాస్వామిక సంస్థలుగా చెలామణికావడం మరింత భయంకరమైన వాస్తవం. ఇందుకు తొలుత భారత జాతీయ కాంగ్రెస్‌నే వేలెత్తి చూపాలి. కాకపోతే దశాబ్దాలుగా పార్టీకి సేవలు అందిస్తున్న వారిని పక్కన పెట్టి ప్రియాంక గాంధీని రాత్రికి రాత్రే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా చేయడమేమిటి? గాంధీలను అనుసరించే ఇతర నాయకులూ వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను చూడండి. తాను ఒకప్పుడు ప్రాతినిధ్యం వహించిన గుల్బర్గా నియోజక వర్గం నుంచి ఈ సారి సొంత అల్లుడిని నిలబెట్టారు. ఖర్గే కుమారుడు ఇప్పటికే కర్ణాటక మంత్రివర్గంలో సభ్యుడుగా ఉన్నారు. ఇదే విధంగా బిహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్, ఉత్తర ప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ, తమిళనాడులో డీఎంకే అధినేతలు రాజకీయ పెత్తందారులుగా వ్యవహరిస్తున్నారు. పార్టీపై తమ కుటుంబ పెత్తనం శాశ్వతంగా సాగేందుకు వారు సంకల్పించుకున్నారని మరి చెప్పనవసరం లేదు.

సరైన కారణాలు లేకుండా పౌరులను అరెస్ట్ చేసి, ఎలాంటి విచారణ లేకుండా వారిని సంవత్సరాల తరబడి జైళ్లలో నిర్బంధించడానికి వీలు కల్పిస్తున్న వివిధ చట్టాల మూలంగా భారత ప్రజాస్వామ్య ప్రమాణాలు మరింతగా దిగజారిపోతున్నాయి. రాజకీయ ప్రత్యర్థులను, ఆ మాటకొస్తే భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న వారినందరినీ బెదిరించేందుకు, మౌనం పాటించేలా చేసేందుకు ఈ చట్టాలను ఉపయోగిస్తున్నారు. పాలకులు చట్టాలను దుర్వినియోగ పరచడంలో న్యాయస్థానాలు సైతం భాగస్వాములు అవుతున్నాయి. బెయిల్ మంజూరు చేయడంలో న్యాయమూర్తులు గర్హనీయమైన మందకొడితనంతో వ్యవహరిస్తున్నారు. నాగరీక సమాజాలలో ఉండకూడని ఊపా లాంటి చట్టాలు అమల్లో ఉండేందుకు సైతం వారు అనుమతించడం విస్మయం కలిగిస్తోంది.



పార్టీ వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోవడం, భారత రాజ్య వ్యవస్థ అప్రజాస్వామిక స్వభావం, లోపభూయిష్టమైన ఆర్థికాభివృద్ధి నమూనా, పర్యావరణ విధ్వంసం... ఈ సమస్యలన్నిటికీ ప్రధాన బాధ్యత దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీదే అయినా 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తరువాత అవి మరింతగా విషమించాయి. జూన్ 4 అనంతరం కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ వాటిని సమర్థంగా ఎదుర్కోవాలి. పాలనలో లోపాలు, లొసుగులను పరిహరించి ప్రజలకు శ్రేయస్సు సమకూర్చాలి. మరి రాబోయే ప్రభుత్వం నిజంగా ఇలా వ్యవహరిస్తుందా అన్నది వేరే విషయం.

ఇవీ మన రాజకీయ, పాలనా వ్యవస్థలలోని లోపాలు, లొసుగులు. అయితే ప్రపంచ అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ, ప్రజాస్వామ్యాల మాతృమూర్తి మొదలైన శబ్దాడంబరంతో కూడుకున్న పాలకుల ప్రచార హోరులో అవి కన్పించడంలేదు, విన్పించడంలేదు. 'ప్రపంచపు అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ' అనే ఘనత పాలకుల అనేక పాపాలను మరుగు పరుస్తోంది. ఆర్థిక సంస్కరణలు పేదరికాన్ని తగ్గించిన మాట వాస్తవమే అయినా అవి అసమానతలను విపరీతంగా పెంచాయి.



■ రామచంద్ర గుహ

జాతీయ ఆదాయం పెరుగుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా ఉద్యోగాలు పెరగడంలేదు. కోటీశ్వరులను ఉత్పత్తి చేయడంలో ప్రపంచ అగ్రగామిగా ఉన్న భారత్‌లో విద్యావంతుల నిరుద్యోగిత కూడా చాలా హెచ్చుస్థాయిలో ఉన్నది. కార్మిక శ్రేణులలో మహిళల సంఖ్య ఇప్పటికీ చాలా తక్కువగా ఉండడం దేశానికి నిజంగా సిగ్గుచేటు. భారతదేశ ఆర్థికాభివృద్ధి చరిత్ర మిశ్రమమైనది. వర్తమాన భారత పర్యావరణ ఇతిహాసం విధ్వంసకరమైనది. భారత్ ఆర్థికోన్నతికి అద్దంగా ఉన్న బెంగళూరులో నీటి సంక్షోభం, న్యూఢిల్లీలో వాయు కాలుష్యం మన జీవితాలను నియంత్రించే జీవ భౌతిక వాస్తవాలను ఎంతగా నిర్లక్ష్యం చేస్తున్నమనడానికి ప్రత్యక్ష నిదర్శనాలు.

భారత్ పర్యావరణ ఆరోగ్యం దుర్బలమవుతోంది. మనం విషపూరిత గాలిని పీలుస్తున్నాం. భూగర్భ జలాలు తరిగిపోతున్నాయి. నదులలో నీటి మట్టాలు అడుగంటుతున్నాయి. నేలలు కలుషితమయిపోతున్నాయి. జీవవైవిధ్యం వేగంగా అంతరించిపోతున్నది. ఇవన్నీ కోట్లాది భారతీయుల ఆరోగ్యానికి, ఎనలేని హాని చేస్తున్నాయి. వారి జీవనాధారాలకు అపాయం కలిగిస్తున్నాయి. ఈ పరిణామాలు మన భవిష్యత్తు విషయమై ఆందోళనకర ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. వనరుల సాంద్ర, పెట్టుబడి సాంద్ర పారిశ్రామికీకరణ నమూనా సుస్థిరాభివృద్ధికి దోహదం చేసేది కాదని స్పష్టమయింది. ఈ సందర్భంగా నేను ఒక విషయాన్ని స్పష్టం చేయదలిచాను. భారతదేశ పర్యావరణ సంక్షోభం వాతావరణ మార్పుతో ప్రమేయం లేకుండా సంభవిస్తోంది. ఇదొక కఠోర వాస్తవం. వాతావరణ మార్పు పర్యావరణ సంక్షోభాన్ని విషమింపచేస్తుందనడంలో సందేహం లేదు. అయితే వాతావరణ మార్పు అనే సమస్య లేనప్పటికీ పర్యావరణ భద్రత, సమతుల్యత విషయమై మనం అనేక సవాళ్లు, సమస్యలను ఎదుర్కోవలసి ఉన్నది. అవన్నీ మన స్వయంకృతాలే అన్నది విస్మరించకూడని వాస్తవం.

పార్టీ వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోవడం, భారత రాజ్య వ్యవస్థ అప్రజాస్వామిక స్వభావం, లోపభూయిష్టమైన ఆర్థికాభివృద్ధి నమూనా, మన అస్తిత్వ ప్రాకృతిక ప్రాతిపదికల విధ్వంసం... ఈ సమస్యల మూలాలు మన రిపబ్లిక్ నిర్మాణ వ్యవస్థల్లో ఉన్నాయి. వాటికి ప్రధాన బాధ్యత దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీదే. అయితే 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తరువాత అవి మరింతగా విషమించాయి. పర్యవసానంగా దేశ పురోగతి బాగా కుంటుపడింది. మతతత్వ సమస్యనే చూడండి. అదేమీ కొత్త విపత్తు కాదు. పాకిస్థాన్ ఆవిర్భవించిన నాటి నుంచీ, భారత్‌లోనే ఉండిపోయిన ముస్లింల పరిస్థితి అభద్రతలో పడిందని చెప్పడం చాలా తక్కువగా చెప్పడమే అవుతుంది.

పాకిస్థాన్ తన మైనారిటీ వర్గాల పట్ల ఏ విధంగా వ్యవహరించినప్పటికీ భారత్‌లోని ముస్లింలకు హిందువులతో పాటు సమాన పౌరసత్వ హక్కులు ఉంటాయని భారతీయ ముస్లింలకు భరోసా కల్పించేందుకు జవహర్‌లాల్ నెహ్రూ చాలా కష్టపడ్డారు. అయినప్పటికీ దేశ విభజన కష్ట నష్టాలను ముస్లింలే భరించవలసివచ్చింది. తోటి భారతీయులు వారిని తరచు అనుమానంతోనూ, శత్రుభావంతోను చూశారు. రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిత్వ కాలంలో హిందువులు–ముస్లింల మధ్య సంబంధాలు క్షీణించాయి. హిందూ, ముస్లిం తీవ్రవాదులు ఇరువురినీ సంతృప్తిపరచడానికి రాజీవ్ ప్రభుత్వం వ్యవహరించిన తీరుతెన్నుల కారణంగానే మతతత్వ సమస్య మరింత తీవ్రమయింది.

నేను ప్రస్తావించదలుచుకున్న చివరి సమస్య కేంద్ర ప్రభుత్వం – రాష్ట్రాల మధ్య సంబంధాలు. 1959లో కేరళలో కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాన్ని నెహ్రూ బర్తరఫ్ చేయడం గురించి బీజేపీ మద్దతుదారులు తరచు మాట్లాడుతుంటారు. ఇందిరాగాంధీ హయాంలో అధికరణ 356ను తరచుగా ఉపయోగించడం జరిగిందని కూడా బీజేపీ శ్రేణులు ఫిర్యాదు చేస్తుంటాయి. అయితే బీజేపీయేతర పార్టీల ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాదాపుగా శత్రుత్వ భావంతో వ్యవహరించడం పరిపాటి అయింది. బీజేపీ పాలనలో లేని రాష్ట్రాల న్యాయబద్ధ హక్కులను ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పూర్తిగా ఉపేక్షిస్తున్నారు. ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులను అమర్యాదకర భాషలో పరిహసిస్తున్నారు. ఆ రాష్ట్రాలకు గవర్నర్లుగా నియమితులయిన పెద్ద మనుషులు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాల పాలనకు రాజ్యాంగ విహితంగా పాలించేందుకు చీటికీ మాటికీ అనేక అవరోధాలు కల్పిస్తున్నారు. న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొనేందుకు ఆ రాష్ట్రాలకు అనుమతి నిరాకరిస్తున్నారు దేశంలోని ప్రతి రాష్ట్రమూ బీజేపీ పాలనలోకివచ్చే దాకా కేంద్రంలోని బీజేపీ పాలకులు విశ్రమించబోరని వివిధ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యం స్థానంలో హిందూ గణతంత్ర రాజ్యం స్థాపన ఆకాంక్షతోనే హిందూ రాజ్య ఆకాంక్షలతోనే వారు ఇలా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారనేది కూడా మరింత స్పష్టమే.

సరే, కోట్లాది భారతీయులు 18వ సార్వత్రిక ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం వహించని రాజకీయ పార్టీల, రాజీపడి వివేక భ్రష్టత్వంతో వ్యవహరిస్తున్న ప్రభుత్వ సంస్థల, అప్రజాస్వామిక చట్టాల, బలహీనపడుతున్న ఆర్థిక వ్యవస్థ, ధ్వంసమవుతున్న పర్యావరణం, మతపరమైన మైనారిటీలలో తీవ్రమవుతున్న అభద్రతా భావం, సమాఖ్య పాలనా వ్యవస్థపై పెరుగుతున్న ఒత్తిళ్ల సందర్భంలో వారు ఓటు వేశారనే వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. జూన్ 4 అనంతరం కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ ప్రస్తావిత సవాళ్లు, సమస్యలను సమర్థంగా ఎదుర్కోవాలి. పాలనలో లోపాలు, లొసుగులను పరిహరించి ప్రజలకు శ్రేయస్సు సమకూర్చాలి. మరి రాబోయే ప్రభుత్వం నిజంగా ఇలా వ్యవహరిస్తుందా అన్నది వేరే విషయం.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

ఏ పార్టీ గెలిచినా ఓడేది ప్రజలే!

ఏ పార్టీ గెలుస్తుంది? ఏ పార్టీ పోతుంది? దేనికి ఎన్ని సీట్లు? ఎన్ని? ఇన్నా? అన్నా? అన్నేనా? చర్చలు! చర్చలు! వాదాలు! కాలక్షేపపు వాదాలు! ఎన్ని చేసినా పార్టీల సమర్థకులైతే పరవాలేదు! కానీ, మేధావులు! ఆలోచనాపరులు! పత్రికల్లో! టీవీల్లో! ఎన్నికల ఫలితాలకోసం రాత్రింబవళ్ళూ కబుర్లు! ఏ పార్టీ? ఏ పార్టీ? శ్రమ దోపిడీనే లక్ష్యంగా పెట్టుకున్న పార్టీల్లో ఏదో ఒక పార్టీ కోసం వెతుకులాటా, నిరీక్షణా!

ఇప్పుడున్న ఎన్నికల తంతునీ, అమలులో వున్న రాజ్యాంగాన్నీ, చలామణీలో వున్న ప్రజాస్వామ్యాన్నీ మేధావులు కూడా పసిపిల్లలకన్నా అమాయకంగా నమ్ముతూ అంచనాలు కడుతున్నారు. ఈ మేధావులు, ప్రజలకు మేలు చేసే పార్టీ ప్రభుత్వం వస్తే బాగుండునని కోరుకుంటారు. తక్షణ ఉపశమనం గురించి మాత్రమే ఆలోచించే అల్పసంతోషులైన వీరు, శ్రమ దోపిడీ విషయాలను కనీసంగా కూడా ఎత్తరు. ఉన్న పరిస్థితుల్లో, ఎప్పటికప్పుడు తక్షణ ఉపశమనాల గురించే ఆలోచిస్తే, దీర్ఘకాలిక పరిష్కారం గురించి ఎప్పుడు? 'శరీరంలో పెద్ద జబ్బు యేదో వున్నా, తలనొప్పిని పట్టించుకోకూడదా?' అంటారు. నిజమే. తాత్కాలిక సమస్యల్ని కూడా పట్టించుకుంటేనే ఒక అడుగు ముందుకు వెయ్యగలం. అయితే, అసలు జబ్బు సంగతి ఎప్పుడు? తల నొప్పీ, ఈ నొప్పీ, ఆ నొప్పీ రావడం అసలు జబ్బువల్లే అయితే, జబ్బుతో సంబంధం లేకుండా చిన్న నొప్పులు రాకుండా చూడడం సాధ్యమేనా? 'శ్రమ దోపిడీ' అనే జబ్బువేపు ఎప్పుడు చూస్తారు? అది సాధారణ ప్రజలకు తెలీదు. మేధావులకీ తెలీదా? దాని గురించి ప్రజలకు ఎప్పుడు తెలుపుతారు?

డబ్బూ, కులం, మతం, ఉచితాల పేరుతో పడేసే ముష్టి పథకాలూ ఉపయోగించి పార్టీలు అధికారంలోకి రావడానికే గదా ఈ ఎన్నికలు? ఎన్నికలకూ, పార్టీలకూ, వాటి విధానాలకూ సంబంధించిన నిజాల్ని ప్రజలకు వివరించే రాతలూ, చర్చలూ అవసరం. అంతేగానీ, ఈ పార్టీ గెలిస్తే ఏమి జరుగుతుందీ, ఆ పార్టీ వస్తే ఏమి జరుగుతుందీ అనే రాతలూ, చర్చలూ కాలక్షేపం కబుర్లుగా మిగిలిపోతాయి.

ప్రజానుకూల మేధావులకు దురుద్దేశాలను ఆపాదించలేము. కానీ, ఆ విషయాల్ని పైపైనే చూసే, రాసే రాతలూ, ఎన్నికల్లో సీట్ల సంఖ్యలూ, ప్రజల్ని భ్రమల్లోనే వుంచుతాయి. మేధావులు కూడా భ్రమల్లో ఉండడానికే అలవాటై పోతున్నారా? ఎన్నికల్లో నిలబడ్డ పార్టీల్ని, అధికారంలో వున్నా, లేకపోయినా, ప్రతీ ఒక్క పార్టీనీ వేరు వేరు స్వభావాలతో, వేరు వేరు లక్ష్యాలతో వున్నదాన్నిగా, ఈ మేధావులు భావిస్తారు. ఆ భావనలు నిజం కావని ఆ పార్టీలు అమలు చేసే విధానాల్ని బట్టి తెలిసిపోతుంది. 'ప్రైవేటీకరణ' విధానాన్ని ప్రతీ పార్టీ అమలు చేస్తుంది, కాకపోతే, కొన్ని హెచ్చు తగ్గులతో! ఉద్యోగ భద్రత పోయి, ప్రైవేటు యజమానుల దయాదాక్షిణ్యాల మీద బతికే జీవితాన్నే ఇస్తాయి పార్టీలు. అలాగే, 'సరళీకరణ' పేరుతో ఏమి చేస్తారో చూడండి: వాతావరణ కాలుష్యం జరగరాదనే దృష్టి గానీ, పని పరిస్థితుల్లో కార్మికుల భద్రతకు అవసరమైన ఏర్పాట్లు వుండాలనే దృష్టిగానీ, ఏదీ లేకుండా, పరిశ్రమలకు తేలిగ్గా (సరళంగా) అనుమతులిచ్చేసే పార్టీలే కదా ఇవి! పైగా, దోపిడీదారులకే భూముల్ని అడ్డగోలుగా నామమాత్రపు ధరలకు ఇవ్వడాలూ, కరెంటూ–నీళ్ళూ ఉచితంగానో, చవగ్గానో ఇవ్వడాలూ! 'ప్రపంచీకరణ' పేరుతో, విదేశీ కంపెనీలకు ఇక్కడి తలుపులూ, కిటికీలూ తెరిచి పెట్టడం! ఈ విధానాల్ని తిరస్కరించే పార్టీ ఒక్కటైనా వుంటుందా?

'స్వతంత్రం! స్వతంత్రం వచ్చేసింది! పోరాడి సాధించాం!'– అంటారు! నిరుద్యోగ సమస్యకి పరిష్కారాన్ని సాధించారా? 75 ఏళ్ళగా వుంటూనే వుందే! ఏ సమస్యకైనా, ఏ దరిద్రానికైనా కారణం, శ్రమ దోపిడీని పెద్ద స్థాయిలో నడిపించే 'పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమే' అని గ్రహించలేరా మన ప్రజానుకూల మేధావులు? గ్రహించినా ప్రజలకు తెలపలేరా? ధరల పెరుగుదలకు కారణమేమిటో గ్రహించినా బైటపెట్టలేరా? తిండీ, బట్టా, నివాసమూ, విద్యా, వైద్యమూ అనే కనీస అవసరాల్ని తీర్చని విషయంలో పార్టీల మధ్య ఏమిటి తేడా? దేశంలో కలిమి అంతా ఒక వర్గం దగ్గిరా, లేమి అంతా ఇంకో వర్గం దగ్గిరా పోగుపడడానికి ఈ పార్టీలు కారణమని మేధావులకి తెలీదా? కోటి రూపాయలతో కార్లు కొనేవాళ్ళు ఒక వేపూ, పొట్టకూటి కోసం ప్రాణాలకి తెగించి డ్రయినేజీ గోతుల్ని శుభ్రం చేసేవాళ్ళు ఇంకోవేపూ వుండడానికి ఈ పార్టీలు కారణం కాదా?

'రాజ్యాంగాన్ని రక్షించాలి!' అంటారు. అసలు రాజ్యాంగమే అనేక అసమానతలకి మూలం. ఇతరుల శ్రమని దోచి, లాభాలూ, వడ్డీలూ, కౌళ్ళూ అనే ఆదాయాలకు వీలునిచ్చే ఆస్తి హక్కుల్ని ఇస్తుంది. కొందరు పౌరులు, జీవితాంతమూ అట్టడుగు శారీరక శ్రమలే చేసే వారిగానూ, కొందరు పౌరులు ఎప్పుడూ మేధా శ్రమలే చేసే వారిగానూ వుండే అసమాన శ్రమ విభజనను నిలిపివుంచుతుంది. ఇలాంటి రాజ్యాంగాన్ని రక్షించమని శ్రామిక ప్రజలకు బోధించి ప్రయోజనం లేదు. నామమాత్రమైన హక్కుల్ని కూడా లేకుండా చేసే పార్టీని గెలిపించవద్దంటారు మేధావులు. కానీ, ఉన్న అన్ని పార్టీలూ, అధికారంలో వున్నప్పుడు ఒక రకంగా, లేనప్పుడు ఒక రకంగా ప్రవర్తించేవే.

'ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది' అంటారు. అసలు ఉన్న ప్రజాస్వామ్యమే కొద్దిమంది అనుభవించే ప్రజాస్వామ్యం అని ఈ మేధావులకి తెలియదా? ఓటు హక్కు ఇచ్చి, ప్రజాస్వామ్యంలో ప్రజలే స్వాములు అని భ్రమింపజేస్తే ఎలా? జీవితావసరాలూ, వాటి తయారీకి కావలసిన ఉత్పత్తి సాధనాలూ ఒక వర్గానికి రిజర్వ్ అయివుండగా, మిగతా కోట్ల మంది మొహాన 'రిజర్వేషన్లు' అనే మెతుకులు విసిరితే, ఆర్థిక రంగంలో ప్రజాస్వామ్యం ఉన్నట్టా? దుర్మార్గమైన నిర్బంధ చట్టాల్ని దుర్వినియోగం చేసే ప్రభుత్వం వద్దంటారు. శత్రు వర్గాలున్న సమాజంలో, ఏ పార్టీ ప్రభుత్వం అయినా ఆ నిర్బంధ చట్టాలు లేకుండా పాలించలేదు. 75 ఏళ్ళ చరిత్రలో ఈ పార్టీలు, ఎన్నో నిర్బంధ చట్టాలను కొత్తగా తయారు చేయడమో, ఉన్నవాటిని మరింత కఠినం చేయడమో చూడవచ్చును.



అన్ని రంగాలలోనూ అసమానతలున్న ఈ సమాజంలో ఎన్నికలు అనేవి, "పాలకవర్గంలోని ఒక ముఠా చేతుల్లోనించీ ఇంకో ముఠా చేతుల్లోకి బదిలీ చేసే సాధనంగా వుంటున్నది" అని ఈ ప్రజానుకూల మేధావులు గుర్తించి, ప్రజలకు చెప్పకపోతే ఎలాగ? ఎప్పుడో 155 ఏళ్ళ కిందటే, మార్క్సు అనే మేధావి గుర్తించిన విషయాన్ని, మనం 75 ఏళ్ళ అనుభవంలో చూడలేదా? ("సార్వత్రిక ఓటింగు ఎటువంటిదిగా వుంటుందంటే, కొన్ని సంవత్సరాలకు ఒక మారు పార్లమెంటరీ వర్గ పాలన కోసం అనుమతిని మంజూరు చెయ్యడానికి మాత్రమే ఉపయోగపడుతూ వుంటుంది." –మార్క్సు.) ఎన్నికలు "పాలక వర్గాల చేతిలో ఒక ఆటబొమ్మగా దుర్వినియోగం" అవుతున్న విషయం, ఎన్నికలు జరుగుతున్న తీరులోనే కనపడుతున్నది గదా? డబ్బూ, కులం, మతం, ఉచితాల పేరుతో పడేసే ముష్టి పథకాలూ ఉపయోగించి పార్టీలు అధికారంలోకి రావడానికే గదా ఈ ఎన్నికలు? ఎన్నికలకూ, పార్టీలకూ, వాటి విధానాలకూ సంబంధించిన నిజాల్ని ప్రజలకు వివరించే రాతలూ, చర్చలూ అవసరం. అంతేగానీ, ఈ పార్టీ గెలిస్తే ఏమి జరుగుతుందీ, ఆ పార్టీ వస్తే ఏమి జరుగుతుందీ అనే రాతలూ, చర్చలూ కాలక్షేపం కబుర్లుగా మిగిలిపోతాయి.

సరైన రాజకీయ జ్ఞానం అందకపోతే, ప్రతీ ఎన్నికలోనూ ఓడిపోయేది ప్రజలే కదా?

■ రంగనాయకమ్మ

తిరగబడదాం

ప్రజాస్వామ్యమా నీ ఉనికెక్కడ
రౌడీ రాజ్యం పాలిస్తుంటే
తలలు పగిలి రోదిస్తుంటే
రక్తపుటేరులు ప్రవహిస్తుంటే
రక్షకభటులే రక్షణ కోసం వెనకడుగేస్తుంటే
దండించేవాళ్లే దండలు వేస్తుంటే
గడగడలాడుతూ భయపడదామా
దడదడలాడుతూ పరుగెడదామా
తలదించుకుని భరిద్దామా
ప్రజాస్వామ్య దేశమా ఇది?
మనం కోరిన సంఘమా ఇది?
ఇండ్లలో ఉన్న మహిళలపై దౌర్జన్యాలు
వీధులలో ఉన్న యువకులపై దాడులు
క్యూలో ఉన్న ఓటర్ని కొడతారొకరు
ఓటింగ్ యంత్రాన్ని పగలగొడతారింకొకరు
వీళ్ళా ప్రజాప్రతినిధులు
వీళ్ళా శాసనకర్తలు
మానవత్వమా – నీ మౌనం ప్రమాదకరం
ధైర్యమా – నీ వెనుకంజ హానికరం
తిరగబడదాం ప్రతిఘటిద్దాం
తరిమి తరిమి వెంబడిద్దాం
బంధించి బందిఖానాలో పెట్టేద్దాం.

–నన్నపనేని రాజకుమారి, మాజీ మంత్రి

ఎవరు గెలిచినా...!

ఎన్నికల్లో ఎవరు గెలిచినా... చెత్తపన్ను తీసెయ్యాలి, కరెంటు రేట్లు తగ్గించాలి, ఒకటో తేదీకి వృద్ధాప్య పెన్షన్లు ఇవ్వాలి, అన్న కాంటీన్లను తెరవాలి. ముఖ్యమంత్రి వస్తుంటే చెట్లు కొట్టెయ్యకూడదు. మంత్రుల ప్రయాణంలో ట్రాఫిక్ జాం చెయ్యకూడదు. ప్రశ్నిస్తే అరెస్టు చెయ్యరాదు. ఎవరు గెలిచినా... ప్రభుత్వ కార్యాలయాలలో పని త్వరగా జరిగేటట్లు, లంచం తీసుకోకుండా పనులు జరిగేటట్లు ఆదేశాలు ఇవ్వాలి. అలాగే వాస్తు పేరిట జరిగే డబ్బు దుర్వినియోగాన్ని ఆపాలి. దొంగబాబాల ఆశ్రమాల గుట్టు రట్టు చేయాలి. వారికి ఇచ్చిన భూముల జీవో రద్దు చెయ్యాలి. ఆ భూముల్ని స్వాధీనం చేసుకోవాలి. ఆశ్రమాల చుట్టూ మంత్రులు, ఐఏఎస్‌లు, ఐపీయస్‌లు తిరగకుండా, లౌకికవాదాన్ని రక్షించాలి. మూఢనమ్మకాల నిర్మూలనకు ఒక చట్టం తీసుకురావాలి.

– నార్నె వెంకటసుబ్బయ్య
అధ్యక్షుడు, ఏపీ హేతువాదసంఘం



కృష్ణా యూనివర్సిటీలో సిద్ధమైన కౌంటింగ్ కేంద్రం




నిమ్రా కాలేజీ కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటుచేసిన కంచె



జడ్జిమెంట్ డే

నేడే తీర్పు

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సర్వంసిద్ధం

ఎన్టీఆర్ జిల్లాకు ఇబ్రహీంపట్నంలోని నోవా, నిమ్రా కళాశాలల్లో..

కృష్ణాజిల్లాకు మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీలో..

- కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీస్ భద్రత
- ఉదయం 8 గంటల నుంచే ప్రారంభం
- సాయంత్రం 4 గంటలకల్లా ఫలితాలు వెల్లడయ్యే అవకాశం
- తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- ఆ తర్వాత ఈవీఎంలోని కంట్రోల్ యూనిట్ల కౌంటింగ్
- అనుమతి ఉన్నవారికే కౌంటింగ్ కేంద్రాల్లోకి ఎంట్రీ

విజయవాడ/మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి : ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు సంబంధించి రెండు పార్లమెంట్, 14 అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల ఫలితాల లెక్కింపు మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అరగంట తర్వాత 8.30 గంటలకు ఈవీఎం కంట్రోల్ యూనిట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా విజయవాడ పార్లమెంట్‌కు సంబంధించి 17 మంది, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 96 మంది అభ్యర్థుల ఓట్ల లెక్కింపు చేపడతారు. కృష్ణా జిల్లావ్యాప్తంగా మచిలీపట్నం పార్లమెంట్‌కు 15 మంది, ఏడు అసెంబ్లీ స్థానాలకు 79 మంది, అభ్యర్థుల ఓట్లను లెక్కిస్తారు.

ఇలా మొదలవుతుంది

మంగళవారం ఉదయం 6 గంటలకల్లా పోస్టల్ కౌంటింగ్ సిబ్బంది, 7 గంటల కల్లా ఈవీఎం కౌంటింగ్ సిబ్బంది విధులకు హాజరవుతారు. ఉదయం 6 గంటల నాటికే జనరల్ అబ్జర్వర్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లకు వేసిన సీళ్లను తొలగిస్తారు. ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేస్తారు. ఇబ్రహీంపట్నంలోని నోవా, నిమ్రా ఇంజనీరింగ్ కాలేజీలు, మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీల్లో పటిష్ట బారికేడింగ్ ఏర్పాటు చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పార్లమెంట్ లెక్కింపునకు 14 టేబుళ్లు, అసెంబ్లీల లెక్కింపునకు 14 టేబుళ్ల ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలు కలిపితే 196 టేబుళ్లపై లెక్కింపు జరుగుతుంది. ఇందులో పార్లమెంట్‌కు 98 టేబుళ్ల, అసెంబ్లీలకు 98 టేబుళ్ల ఉంటాయి. పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 3 గంటలకు, ఈవీఎంల ఓట్ల లెక్కింపు సాయంత్రం 4 గంటలకు పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు.

నోవా, నిమ్రా కళాశాలల్లో ఏర్పాట్లు

ఇబ్రహీంపట్నంలోని నోవా, నిమ్రా కళాశాలల కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేశారు. భారీ బందోబస్తు సిద్ధం చేశారు. గుర్తింపు కార్డులు కలిగిన కౌంటింగ్ సిబ్బంది, రిటర్నింగ్ అధికారులు, పోలీసులు, మీడియా ప్రతినిధులు, అభ్యర్థులు, పార్టీల ఏజెంట్లు తప్ప ఇంకెవరికీ అనుమతి లేదు. అధికారులు, కౌంటింగ్ సిబ్బంది వెళ్లడానికి వీలుగా బారికేడింగ్‌తో ఒక మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ మార్గం నుంచే వీరంతా వెళ్లాలి. మీడియా ప్రతినిధులు, కౌంటింగ్‌కు వచ్చే ఏజెంట్లకు ప్రత్యేకంగా రెండో బారికేడ్ మార్గాన్ని ఏర్పాటు చేశారు.

కృష్ణా వర్సిటీలో ప్రత్యేక చర్యలు

కృష్ణా యూనివర్సిటీ వద్ద కౌంటింగ్ ఏర్పాట్లను కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సోమవారం పరిశీలించారు. యూనివర్సిటీ వద్ద ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తీసుకున్న చర్యలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లు, వారంతా వెళ్లే మార్గాలను పరిశీలించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను నిర్మాణంలో ఉన్న ఫార్మసీ కళాశాల భవనంలోకి మార్చాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రౌండ్లవారీగా లెక్కింపు ఫలితాలను తెలియజేసేలా మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కౌంటింగ్ సిబ్బంది బస కోసం ఏర్పాటుచేసిన రుద్రవరం గురుకుల జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహం-2ను కలెక్టర్ పరిశీలించి వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని రెండు కిలోమీటర్ల మేర ప్రాంతాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. రుద్రవరం గురుకుల పాఠశాల సమీపంలో రెండు పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేశారు.

కౌంటింగ్ వివరాలు	ఎన్టీఆర్	కృష్ణా
మొత్తం కౌంటింగ్ సిబ్బంది	1,011	1,195
మొత్తం టేబుళ్లు	196	196
పార్లమెంట్ టేబుళ్లు	98	98
ఏడు అసెంబ్లీల మొత్తం టేబుళ్లు	98	98
కౌంటింగ్ సూపర్‌వైజర్లు	301	433
కౌంటింగ్ అసిస్టెంట్లు	402	496
మైక్రో అబ్జర్వర్లు	308	248
ఏడు అసెంబ్లీల మొత్తం రౌండ్లు	132	143

ఫలితాలు ఇలా..?

మధ్యాహ్నం 3.30 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఫలితం, సాయంత్రం 4 గంటల నాటికి ఈవీఎం కౌంటింగ్ ఫలితాలు వెల్లడిస్తారు. ముందుగా నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాలు, సాయంత్రం 5 గంటల నాటికి విజయవాడ తూర్పు, మైలవరం నియోజకవర్గాల ఫలితాలు వెల్లడి కానున్నాయి. సాయంత్రం 6 లేదా రాత్రి 7 గంటల కల్లా డిక్లరేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.

కౌంటింగ్.. ఎక్కడెక్కడ..?

- నోవా ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో.. విజయవాడ వెస్ట్, సెంట్రల్, తిరువూరు, నందిగామ నియోజకవర్గాలకు సంబంధించి పార్లమెంట్, అసెంబ్లీ ఓట్ల లెక్కింపు జరుగుతుంది.
- నిమ్రా ఇంజనీరింగ్ అండ్ మెడికల్ కళాశాలలో.. విజయవాడ తూర్పు, మైలవరం, జగ్గయ్యపేట నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుంది.
- కృష్ణా యూనివర్సిటీలో.. మచిలీపట్నం పార్లమెంట్ సహా పెనమలూరు, పామర్రు, అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన, గుడివాడ, గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

ఏ నియోజకవర్గం ఎన్ని రౌండ్లు..?

మచిలీపట్నం పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం 1,949 మంది సిబ్బందిని నియమించారు. 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. గన్నవరం నియోజకవర్గానికి 22 రౌండ్లలో లెక్కింపు ఉంటుంది. గుడివాడకు 17 రౌండ్లు, పెడనకు 16 రౌండ్లు, మచిలీపట్నానికి 15 రౌండ్లు, అవనిగడ్డకు 20 రౌండ్లు, పామర్రుకు 17 రౌండ్లు, పెనమలూరుకు 22 రౌండ్లలో లెక్కింపు జరుగుతుంది. ఇక మచిలీపట్నం పార్లమెంట్ స్థానానికి కేటాయించిన 14 టేబుళ్లకు నిర్దేశించిన రౌండ్ల ప్రకారం లెక్కింపు ఉంటుంది. తిరువూరు 17 రౌండ్లు, విజయవాడ పశ్చిమ 19 రౌండ్లు, సెంట్రల్ 20 రౌండ్లు, తూర్పు 22 రౌండ్లు, మైలవరం 22 రౌండ్లు, నందిగామ 16 రౌండ్లు, జగ్గయ్యపేట 16 రౌండ్లలో లెక్కింపు జరుగుతుంది. ఇక విజయవాడ పార్లమెంట్ స్థానానికి కేటాయించిన 14 టేబుళ్లకు నిర్దేశించిన రౌండ్ల ప్రకారం లెక్కింపు ఉంటుంది.



కృష్ణా వర్సిటీ కేంద్రం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

టిక్.. టిక్.. టిక్.. నరాలు తెగే ఉత్కంఠకు మరికొద్ది గంటల్లో తెరపడనుంది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల సార్వత్రిక ఎన్నికల ఫలితాల గంట నేడు మోగనుంది. ఓటర్ల నిర్ణయాత్మక తీర్పును మంగళవారం వెల్లడించేందుకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం 8 గంటలకు కౌంటింగ్‌ను ప్రారంభించి సాయంత్రం 4 గంటలకల్లా పూర్తిచేసేందుకు సన్నాహాలు చేశారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి ఇబ్రహీంపట్నంలోని నోవా ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, నిమ్రా ఇంజనీరింగ్, నిమ్రా మెడికల్ కాలేజీల్లో, కృష్ణాజిల్లాకు సంబంధించి మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీలో కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అటు అధికారులు కౌంటింగ్ ఏర్పాట్లలో నిమగ్నమై ఉండగా, ఇటు అభ్యర్థులు విజయావకాశాలపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తుండగా, ఓటర్ల నాడి ఎటువైపు ఉందో, ఎవరి భవితవ్యం ఏమిటో నేటి సాయంత్రానికి తేలనుంది.

పోస్టల్ బ్యాలెట్లే ఓ సవాల్..!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపే సిసలైన సవాల్‌గా మారనుంది. ఈ కౌంటింగ్‌లో పోస్టల్ బ్యాలెట్లను ప్రత్యేకంగా లెక్కించనుండటంతో కొంతమేర ఇబ్బందులు తగ్గినా లెక్కింపు విధానంలో కౌంటింగ్ సిబ్బంది చిన్న పొరపాటు చేసినా పెద్ద మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. అనవసర వివాదాలకు కూడా ఆస్కారవిచ్చినట్టు అవుతుంది. గతంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పెద్దగా వివాదాలు లేనప్పటికీ ఈసారి హోరాహోరీ సమరంలో ఎక్కువ సంఖ్యలో పోస్టల్ బ్యాలెట్లు ఉండటంతో ఎక్కడ ఏ చిన్న తప్పు జరిగినా సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉంటాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల ప్రక్రియలో చాలా ప్రక్రియలను కౌంటింగ్ సిబ్బంది చేపట్టాల్సి ఉంటుంది. ముందుగా ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ల (వీఎఫ్‌సీ) ద్వారా వచ్చిన పోస్టల్ బ్యాలెట్లను లెక్కించాలి. ఆ తర్వాత పోస్టల్ ఓటింగ్ సెంటర్ (పీవోసీ) ద్వారా వచ్చిన ఓట్లను లెక్కించాలి. ఆ తర్వాత హోం ఓటింగ్ పోస్టల్ బ్యాలెట్లను లెక్కించాలి. చివరిగా ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీపీబీఎస్) ద్వారా వచ్చిన పోస్టల్ బ్యాలెట్లను లెక్కించాలి. ఈ ప్రక్రియలన్నింటినీ ఎలాంటి పొరపాట్లు లేకుండా చేయాలి. సిబ్బందికి ఇప్పటికే రెండుసార్లు శిక్షణ ఇచ్చారు. ఫారం 13సీ, ఫారం 13ఏ (డిక్లరేషన్), ఫారం 13బీ స్థాయిలో రిజక్షన్ల డిక్లరేషన్‌లో సీరియల్ నెంబర్లు, ఓటరు సంతకం, అటెస్టెడ్ సంతకాలతో పాటు మార్కింగ్, టాబ్యులేషన్ తదితరాలకు సంబంధించిన అంశాలన్నింటినీ జాగ్రత్తగా పరిశీలిస్తేనే పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు సజావుగా సాగుతుంది.

మంగినపూడి బీచ్‌లో విషాదం

- సముద్ర స్నానం చేస్తుండగా యువకుడు గల్లంతు
- మరో యువకుడిని రక్షించిన జాలర్లు, మెరైన్ పోలీసులు


ప్రాణాలతో బయటపడిన ఉమాకాంత్

మచిలీపట్నం టౌన్, జూన్ 3 : విహారయాత్ర విషాదంగా మారింది. సరదాగా సముద్ర స్నానానికని వచ్చిన స్నేహితులకు తీరని శోకాన్ని మిగిల్చింది. మచిలీపట్నం సమీపంలోని మంగినపూడి బీచ్‌లో సోమవారం జరిగిన దుర్ఘటనలో ఓ యువకుడు సముద్రంలో గల్లంతు కాగా, మరో యువకుడు ప్రాణాలతో బయటపడ్డాడు.

వివరాల్లోకి వెళితే.. ఉంగుటూరు మండలం ఇందుపల్లి గ్రామానికి చెందిన మసిముక్కు భాను (19), ఉయ్యూరుకు చెందిన మామిడిపల్లి ఉమాకాంత్‌తో పాటు ఎం.సంతోష్, మామిడిపల్లి పవన్, ఎం.జగదీష్, అంబటిపూడి సాయిహర్షిత, నందిగామకు చెందిన మాగంటి వినయ్, హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన తేనెల భాస్కర్, మైనేని రాజు విజయవాడలో ఇంటర్ చదువుకుంటున్నారు. వీరంతా కలిసి సోమవారం సరదాగా మంగినపూడి సముద్రతీరానికి వచ్చారు. అందరూ కలిసి సరదాగా సముద్ర స్నానం చేస్తుండగా, అలలు ఉధృతంగా రావడంతో భాను, ఉమాకాంత్ నీటిలో కొట్టుకుపోయారు. ఆ సమయంలో అక్కడ ఉన్న ఏఎస్ఐ జీవీవీఎస్ ప్రసాద్, హోమ్‌గార్డులు నాంచారయ్య, ప్రసాద్.. ఉమాకాంత్‌ను రక్షించారు. కానీ, భాను జాడ మాత్రం తెలియలేదు. సోమవారం రాత్రి వరకూ భాను కోసం వెతుకుతూనే ఉన్నారు. ఉమాకాంత్ పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ ఆసుపత్రికి తీసుకెళ్లారు. రూరల్ పోలీసు స్టేషన్ ఏఎస్ఐ మురళీకృష్ణ ఉమాకాంత్‌ను వివరాలు అడిగి, కేసు నమోదు చేశారు.

ఇబ్రహీంపట్నం.. అష్టదిగ్బంధనం

కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భారీ బందోబస్తు

- జాతీయ రహదారి వెంబడి ఇనుప కంచె
- లెక్కింపు కేంద్రాల చుట్టూ నిఘా నేత్రాలు
- భారీగా మోహరించిన సీఆర్పీఎఫ్ బలగాలు
- 25 డ్రోన్లతో గగనతల నిఘా
- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- సామాజిక మాధ్యమాల పోస్టింగ్‌లపైనా నిఘా


ఇబ్రహీంపట్నంలో డాగ్‌స్క్వాడ్ తనిఖీలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామంలోని నిమ్రా ఇంజనీరింగ్ కళాశాల, నోవా ఇంజనీరింగ్ కళాశాలల్లో భారీ పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు. మొత్తం స్ట్రాంగ్‌రూమ్‌లన్నీ ఇబ్రహీంపట్నం మండలంలోనే ఉండటంతో పోలీసు అధికారులు ఇక్కడ ప్రత్యేక దృష్టి పెట్టారు. లెక్కింపు కేంద్రాలకు వెళ్లే మార్గం పొడవునా పోలీసు గస్తీని ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం రింగ్ వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నుంచి వచ్చే పోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. లెక్కింపు కేంద్రాలకు వెళ్లే మార్గంలో జాతీయ రహదారి వద్ద సీఆర్పీఎఫ్ జవాన్లతో పికెట్‌ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కేంద్రాల ప్రధాన ద్వారాల వద్ద మరో పికెట్‌ను ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మరో పికెట్‌ను ఏర్పాటు చేశారు. మొత్తంగా మూడు అంచెల్లో భద్రతను నియమించారు. లెక్కింపు కేంద్రాలకు వచ్చే అభ్యర్థులు, ఏజెంట్ల వాహనాల పార్కింగ్ కోసం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పొలాల్లో స్థలాన్ని చదును చేశారు. కౌంటింగ్ కేంద్రాలకు ఉన్న అన్ని మార్గాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఫాల్కాన్ వాహనంతో లెక్కింపు కేంద్రాల వద్ద నిఘా పెట్టారు. ఏజెంట్లుగా వచ్చే వారి సెల్‌ఫోన్లను భద్రపరచడానికి ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో సచివాలయ సిబ్బందిని నియమించారు. లెక్కింపు కేంద్రాల వద్ద టియర్ గ్యాస్ వాహనాలు సిద్ధం చేశారు. రబ్బరు బుల్లెట్లతో ఒక దళాన్ని నియమించారు. చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాల్లో గగనతల నిఘా కోసం 25 డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. ఇందులో ఐదు డ్రోన్లను లెక్కింపు కేంద్రాల వద్ద ఎగరవేస్తారు. ఇక.. కౌంటింగ్ సందర్భంగా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టారు. మరోపక్క సామాజిక మాధ్యమాల్లో జరిగే పోస్టింగ్‌ల నియంత్రణకు ప్రత్యేక బృందాలను నియమించారు.



దుర్గమ్మ హుండీల కానుకల లెక్కింపు

18 రోజులకు రూ.3.48 కోట్లు

వన్‌టౌన్, జూన్ 3 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం మహామండపంలో లెక్కించారు. 18 రోజుల వ్యవధికి మొత్తంగా రూ.3,48,33,515లు నగదు సమకూరింది. 535 గ్రాముల బంగారం, 7 కేజీల 540 గ్రాముల వెండి లభించింది. 601 యూఎస్‌ఏ డాలర్లు, 5 ఇంగ్లాండ్ పౌండ్లు, 100 ఓమన్ బైస్‌లు, 10 కెనడా డాలర్లు, 525 అరబ్ ఎమిరేట్స్ దిర్హమ్స్, 1 కువైట్ దినార్, 132 సౌదీ రియాల్స్, 9 ఖతార్ రియాల్స్, 10 యూరోలు, 2 సింగపూర్ డాలర్లు లభించాయి. ఆన్‌లైన్-ఈ హుండీ ద్వారా రూ.1,31,114లు లభించింది. ఈవో కేఎస్ రామారావు, దేవదాయశాఖ అధికారులు, ఆలయ అధికారులు, స్పెషల్ పోలీస్, సిబ్బంది, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది, భవానీ సేవాదారులు తదితరులు పాల్గొన్నారు.

అన్న వితరణకు విరాళం

దుర్గగుడిలో అన్నవితరణకు గుంటూరు అరండల్‌పేటకు చెందిన పప్పుల వెంకటేశ్వరరెడ్డి సోమవారం ఆలయానికి విచ్చేసి పప్పుల శ్రీధర్‌రెడ్డి పేరిట అన్నవితరణ నిర్వహించేందుకు రూ.1,00,116లు విరాళంగా సమర్పించారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారులు దాతకు అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

అభయాంజనేయునికి రూ.15.67 లక్షలు..



హనుమాన్‌జంక్షన్ : స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. గడిచిన 71 రోజులకుగాను రూ.15,67,716లు ఆదాయం కానుకల రూపంలో సమకూరినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. లెక్కింపును ఆగిరిపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు పర్యవేక్షించారు. ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, గొట్టిపాళ్ల శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



శివనాథ్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న టీడీపీ నేతలు

ద్వారకా తిరుమలేశుని సేవలో కేశినేని చిన్ని..

వన్‌టౌన్, జూన్ 3 : విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కూటమి టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) ఆయన సతీమణి జానకీలక్ష్మి, కుమారుడు వెంకట్‌లు సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమలలోని వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు శివనాథ్‌కు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్థానిక టీడీపీ నాయకులు ఆయనకు ద్వారకా తిరుమలేశుని చిత్రపటాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ, మంగళవారం రాష్ట్ర ప్రజలందరూ ఎదురు చూస్తున్న నూతన ఉషోదయం జరుగుతుందని, చంద్రబాబు నాయుడు సీఎం కావాలని ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని స్వామివారిని వేడుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరి క్షేమం కోరుతూ స్వామివారిని వేడుకున్నట్టు తెలిపారు. అనంతరం గోశాలలో గోపూజ చేశారు.



భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న మాదిగాని గురునాథం, లోకేశ్‌తో యార్లగడ్డ

ఎన్నికల్లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ నారా లోకేశ్

- ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం

విద్యాధరపురం, జూన్ 3 : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా యువగళ ఉద్యమనేత నారా లోకేశ్ నిలిచారని టీడీపీ రాష్ట్ర నాయకుడు, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం సోమవారం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరితో అన్నారు. గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న భువనేశ్వరికి ఆయన పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పక్కనే ఉన్న లోకేశ్ స్పందిస్తూ విజయవాడ పార్లమెంట్ నుంచి పోటీ చేసిన కేశినేని శివనాథ్‌కు ఎంత మెజారిటీ వస్తుందని ప్రశ్నించగా లక్ష ఓట్లమెజారిటీ దాటుతుందని గురునాథం పేర్కొన్నారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలలోని కూటమి అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో గెలవబోతున్నారని తెలిపారు. మంగళగిరిలో నారా లోకేశ్ రాష్ట్రంలోనే భారీ మెజారిటీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియ మొత్తంలో నారా లోకేశ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారని ప్రశంసించారు. పరిశపోగు రాజేశ్, నరసింహచౌదరి, సంకే విశ్వనాథ్, హబీద్ హుస్సేన్, సతీశ్‌తో పాటు దళిత సంఘ నేతలు పలువురు భువనేశ్వరికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

లోకేశ్‌కు యార్లగడ్డ ఘన స్వాగతం..

గన్నవరం : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి నారా లోకేశ్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరీ, బ్రాహ్మణి తదితరులు సోమవారం ఉదయం 11.10కి గన్నవరం విచ్చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో లోకేశ్ నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. పూలబొకేలు అందజేసి, దుశ్శాలువాలు కప్పారు. టీడీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, పెద్దకూరపాడు అభ్యర్థి భాష్యం ప్రవీణ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, జాస్తి వెంకటేశ్వరరావు, మూల్పూరి సాయి కళ్యాణి, వెలగపూడి శంకర్ బాబు, శ్రీరామ్ చినబాబు, మండవ అన్వేష్, షేక్ అబుల్యాజ్, మారుపూడి ధనకోటేశ్వరరావు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

11 నుంచి కాశీ-అయోధ్య రైలు యాత్ర

ధర్నాచౌక్, జూన్ 3 : భారత్ గౌరవ్ సౌత్ స్టార్ రైల్ ఆధ్వర్యంలో ప్రత్యేక కాశీ-అయోధ్య రైలు యాత్ర చేపడుతున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ విఘ్నేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 నుంచి జూలై 3వ తేదీ వరకు 13 రోజుల పాటు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. వారణాసి, గయా, ప్రయాగరాజ్, హరిద్వార్, మధుర, అయోధ్య, అమృత్‌సర్, ఢిల్లీ, ఆగ్రాలను ఈ యాత్రలో సందర్శించవచ్చన్నారు. భోజనం, బస, బస్సు, టూర్ మేనేజ్‌మెంట్, సెక్యూరిటీ వసతులతో కూడిన ప్యాకేజీ ఏసీ థర్డ్‌క్లాస్ కంఫర్ట్ రూ.37,300, స్లీపర్‌క్లాస్ రూ.25,200లకు నిర్ణయించబడిందన్నారు. మరిన్ని వివరాలు, బుకింగ్ కోసం 93550 21516, 93848 03557 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.



పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు



కౌంటింగ్ కేంద్రాల వద్ద ఇనుప కంచెలతో పోలీసుల పహారా



సెల్‌ఫోన్లు భద్రపరిచే కౌంటర్లు



కౌంటింగ్ కేంద్రాల్లో మోహరించిన సాయుధ బలగాలు

నిఘా నీడలో నిమ్రా

- కొద్ది గంటల్లో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు
- అభ్యర్థుల గెలుపోటములపై సర్వత్రా ఉత్కంఠ

కొద్ది గంటల్లో.. సార్వత్రిక ఎన్నికల టెన్షన్‌కు తెరపడనుంది. అభ్యర్థుల భవితవ్యం తేల్చేందుకు ఐదేళ్లు ఓపిక పట్టిన ఓటరు.. ఓటు ఆయుధంతో నేతల జాతకం తిరగరాసే రోజు వచ్చేసింది. పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామంలో ఉన్న నిమ్రా ఇంజనీరింగ్ కళాశాల, నోవా ఇంజనీరింగ్ కళాశాలల్లో ఓట్ల లెక్కింపు జరగనున్నది. గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్న పార్టీల అభ్యర్థులు చివరి క్షణం వరకు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఫలితాల అనంతరం ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర ప్రత్యేక బలగాలతో కౌంటింగ్ కేంద్రాల చుట్టూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ జిల్లా సీపీ పీహెచ్‌డీ రామకృష్ణ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)



కౌంటింగ్ కేంద్రంలో మీడియా సెంటర్



కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బ్యారికేడ్లు





విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- పోలీస్ అధికారులతో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

మచిలీపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కౌంటింగ్ రోజున జిల్లావ్యాప్తంగా పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. కృష్ణాయూనివర్సిటీలో సోమవారం పోలీస్ అధికారులతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. యూనివర్సిటీకి రెండు కిలోమీటర్లదూరంలో ప్రజలు గుమికూడకుండా, సభలు, సమావేశాలు నిర్వహించకుండా నిఘా ఉంచాలన్నారు. యూనివర్సిటీ పరిసరాల్లో, జిల్లాలోని పలు ప్రాంతాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా జిల్లా పోలీస్ కార్యాలయం కంట్రోల్ రూమ్ నుంచి నిఘా ఉంచినట్టు తెలిపారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే పై అధికారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. నేరప్రవృత్తి కలిగినవారు ఎవరైనా అల్లర్లకు పాల్పడితే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దాలన్నారు. అల్లర్లకు పాల్పడేవారిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. కృష్ణా యూనివర్సిటీలోని కౌంటింగ్ కేంద్రాలలోకి అధికారులు ధృవీకరించిన పాస్‌లు ఉన్న వారినే అనుమతించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి వచ్చేవారిని క్షుణ్ణంగా తనిఖీచేయాలని, పదునైన ఆయుధాలు, ప్రమాదకర వస్తువులు కలిగి ఉంటే వారిని వెంటనే అదుపులోకి తీసుకోవాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్‌లు కౌంటింగ్ కేంద్రాల్లోకి వచ్చే సమయంలో వారి వద్ద సెల్‌ఫోన్‌లను కౌంటింగ్ కేంద్రాల్లోకి తీసుకువెళ్లకముందే డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా స్పెషల్‌ఫోర్స్ గస్తీ తిరుగుతుందని, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే వెంటనే అదుపులోకి తీసుకోవాలన్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా భారీమూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని, అందరు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.



పోలీస్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

జగ్గయ్యపేటలో భారీ వర్షం

జగ్గయ్యపేట/పెనుగంచిప్రోలు, జూన్ 3 : జగ్గయ్యపేట పరిసర ప్రాంతాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కుండపోతగా వర్షం పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జనజీవనం స్తంభించగా పట్టణంలో పలుచోట్ల చెట్టుకొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాను సోమవారం ఉదయం ట్రాన్స్‌కో అధికారులు పునరుద్ధరించారు.



నెర్రలు కొట్టిన పొలాలు

ఆదివారం పెనుగంచిప్రోలు మండలంలో కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి 10గంటల తర్వాత ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. సోమవారం ఉదయం వరకు కురిసింది. ఇటీవలే మెట్ట పొలాలు రైతులు దుక్కులు దున్ని సిద్ధం చేశారు. రాత్రి కురిసిన వర్షంతో పత్తి వేయటానికి సిద్ధం చేస్తున్నట్టు పలువురు రైతులు పేర్కొన్నారు. చాలారోజుల తర్వాత మంచి వర్షం పడటంతో రైతులతోపాటు ప్రజలూ ఊరట చెందారు. తీవ్రమైన వేడి వడగాడ్పులకు అల్లాడిన ప్రజలు వర్షంతో చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు. రెండు రోజుల్లో జీలుగ, పిల్లిపెసర విత్తనాలను రైతులకు సగం ధరపై పంపిణీ చేయనున్నట్టు ఏవో రామసుబ్బారెడ్డి తెలిపారు.



చంద్రబాబును కలిసిన ఎన్నికల పర్యటనల సమన్వయ బృందం

ఎన్నికల పర్యటన కో-ఆర్డినేషన్ బృందానికి చంద్రబాబు అభినందన

వన్‌టౌన్, జూన్ 3 : ఎన్నికల పర్యటనల్లో తనకు ఎంతగానో సహకరించిన సమన్వయ బృందాన్ని సోమవారం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అభినందించారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో చంద్రబాబును సోమవారం సమన్వయ బృందం సభ్యులు పెందుర్తి వెంకటేష్, పరుచూరి కృష్ణ, బండారు హనుమంతరావు, గంటా గౌతమ్, రవి యాదవ్, రాజశేఖర్, శ్రీనివాస్ తదితరులు కలిసారు. సమన్వయ బృందం రోజుకు మూడు నుంచి ఐదు కార్యక్రమాలలో చంద్రబాబు పాల్గొనేలా చక్కటి ప్రణాళికను రూపొందించి విజయవంతం చేయడంపై వారిని చంద్రబాబు అభినందించారు. కష్టపడి బాగా పనిచేశారంటూ కొనియాడారు.

పెళ్లి వేడుకలో రాజకీయ ప్రత్యర్థులు

విస్సన్నపేట, జూన్ 3 : రాజకీయాల్లో నువ్వా నేనా అంటూ నిత్య విమర్శలు చేసుకున్న రెండు పార్టీల ప్రత్యర్థులు వివాహ వేడుకకు హాజరయ్యారు. సోమవారం మండల కేంద్రమైన విస్సన్నపేటలో విశ్రాంత ఉపాధ్యాయుడు మేసపాం ఆదాం కుమారుడి వివాహానికి తిరువూరు నియోజకవర్గం కూటమి అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు, వైసీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసులు హాజరయ్యారు. దీంతో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వేదిక వద్దకు చేరుకున్నారు. అప్రమత్తమైన పోలీస్ యంత్రాంగం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. కూటమి అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు వైసీపీ అభ్యర్థి స్వామిదాసును పలకరించి కరచాలనం చేయడంతో ప్రజలు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఇరువురు నూతన వధూవరులను ఆశీర్వదించి అక్కడి నుంచి నిష్క్రమించారు.



విస్సన్నపేటలో వివాహ వేడుకకు హాజరైన కొలికపూడి, నల్లగట్ల



విజేతగా నిలిచిన కృష్ణా టీమ్

సెంట్రల్ జోన్ వన్డే టోర్నీ విజేత కృష్ణా జట్టు

విజయవాడస్పోర్ట్స్, జూన్ 3 : నర్సరావుపేట పేరిచర్ల స్టేడియంలో ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న అండర్-19 పురుషుల సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల వన్డే టోర్నీలో కృష్ణా జట్టు విజేతగా నిలిచింది. సోమవారం పశ్చిమగోదావరి జట్టుపై కృష్ణా నాలుగు వికెట్లతో విజయం సాధించింది. తొలుత పశ్చిమ గోదావరి జట్టు 36 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేయగా, కృష్ణా జట్టు 28 ఓవర్లలో ఆరు వికెట్లను నష్టపోయి 162 పరుగులతో జయకేతనం ఎగుర వేసింది. మూడు మ్యాచ్‌ల్లో విజేతగా నిలిచి ఆరుపాయింట్లతో సెంట్రల్ జోన్ చాంపియన్‌షిప్‌ను వశం చేసుకుంది. కృష్ణా జట్టును కేడీసీఏ అడహాక్ కమిటీ ఛైర్మన్ టి.త్రినాథ్‌రాజు అభినందించారు.

ప్రకాశంపై కృష్ణా ఘన విజయం

విజయవాడ స్పోర్ట్స్ : మూలపాడు ట్విన్ స్టేడియంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సెంట్రల్ జోన్ సీనియర్ పురుషుల వన్డే క్రికెట్ టోర్నీలో ప్రకాశంపై కృష్ణా రెండు వికెట్ల తేడాతో నెగ్గింది. సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షం కారణంగా మ్యాచ్‌ను 31 ఓవర్లకు కుదించారు. తొలుత ప్రకాశం 31 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 232 పరుగులు చేసింది. కె.క్రాంతి కిరణ్ 84 బంతుల్లో 12 ఫోర్లుతో 100 పరుగులు చేయగా, సీహెచ్ క్రాంతికుమార్ 50 బంతుల్లో 6 ఫోర్లు, మూడు సిక్స్‌లతో 69 పరుగులు చేశాడు. కృష్ణా బౌలర్లలో ఎ.బ్రహ్మతేజ 2 వికెట్లను తీశాడు. అనంతరం కృష్ణా జట్టు 31 ఓవర్లలో 8 వికెట్ల కోల్పోయి 233 పరుగులు చేసి విజయం సాధించింది. బ్యాటర్స్ ఎం.నిఖిల్ నాయుడు 95 పరుగులతో రాణించి జట్టును విజయ పథంలో నిలిపాడు.

లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు..

- నల్లగొండ జిల్లా చిట్యాలలో రోడ్డు ప్రమాదం
- ఒకరి మృతి, మరొకరికి గాయాలు
- మృతుడు ఏలూరు జిల్లావాసి



చిట్యాలరూరల్, జూన్ 3 : జాతీయ రహదారిపై వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు లారీని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. చిట్యాల ఎస్‌ఐ-2 లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా కైకలూరు మండలం భుజబలపట్నం గ్రామానికి చెందిన ఆగు సోమల కుటుంబరావు (42) హైదరాబాద్‌లోని కోమలి ట్రావెల్స్‌లో బస్సు క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా ఈ నెల 2వ తేదీన రాత్రి హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్ నుంచి విజయవాడకు ప్రయాణికులతో వెళ్తున్న కోమలి ట్రావెల్స్ బస్సులో డ్రైవర్ అరిగిల మణికంఠతో పాటుగా బయలుదేరాడు. మార్గమధ్యలో బస్సు అర్ధరాత్రి దాటాక చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి శివారులోకి చేరుకోగానే పెట్రోల్ బంకు నుంచి లారీ వేగంగా రోడ్డు మీదకు వచ్చింది. బస్సు అదుపుతప్పి లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న కుటుంబరావుతో పాటు డ్రైవర్ మణికంఠకు గాయాలయ్యాయి. బస్సులోనే ఉన్న మరో డ్రైవర్ నాగేంద్రవరప్రసాద్ ఇద్దరిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కుటుంబరావు మృతి చెందాడు. కుటుంబరావు భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ లింగయ్య పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.50

కౌలు రైతులందరికీ సబ్సిడీతో విత్తనాలివ్వాలి

గవర్నర్‌పేట, జూన్ 3: కౌలు గుర్తింపు కార్డులు లేకున్నా కౌలు రైతులందరికీ 90 శాతం సబ్సిడీతో పంటల విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేయాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ. కాటమయ్య, పి. జమలయ్యలు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. మారిన వ్యవసాయ పరిస్థితుల్లో 80 శాతం భూముల్లో కౌలు రైతులే పంటలు పండిస్తున్నారని, సాగుదారుల్లో 70 శాతం కౌలు రైతులే ఉన్నారని, వీరిలో కౌలు గుర్తింపు కార్డులు లేని వారిని కూడా కలుపుకుని సబ్సిడీపై పంట విత్తనాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 14.80 లక్షల ఎకరాల్లో వేరుశెనగ పంట సాగవుతోందని, దానిలో 25 శాతానికి కూడా విత్తనాలు అందించలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్ర పరికరాలు, పురుగుమందులు 90 శాతం సబ్సిడీపై అందించి ఆదుకోవాలని కోరారు.



ధర్మపథం వేదికపై అలరించిన నృత్య ప్రదర్శన

వన్‌టౌన్, జూన్ 3: దుర్గగుడి ధర్మపథం వేదికపై సోమవారం కే సోమశేఖర్ ఆధ్వర్యంలో కళాకారిణుల బృందం చేసిన నృత్య ప్రదర్శన ఆహూతులను అలరించింది. కళాకారిణులు తమదైన అభినయ కౌశల్యంతో పలు కీర్తనలకు నాట్య ప్రదర్శన చేసి అభినందనలు అందుకున్నారు.

సోనికకు అభినందన

చిట్టినగర్, జూన్ 3: కేఎల్ రావు నగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న డి.సోనిక ఫిడే టోర్నమెంట్‌లో మూడో ర్యాంకును సాధించింది. స్పార్క్ చెస్ అకాడమీ నిర్వహించిన మొదటి ఇంటర్నేషనల్ ఓపెన్ ఫిడే టోర్నమెంట్‌లో అంతర్జాతీయ క్లాసిక్ చెస్ స్కోర్‌లో 1445వ ర్యాంకును సాధించింది. దేశంలో చెస్ క్రీడాకారుల జాబితాలో స్థానం దక్కించుకున్న సోనికను రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రావు, ఉపాధ్యాయులు రమేష్, సాధిక, ప్రదీప్, జోజి, మెహరాజ్‌లు సోమవారం స్కూల్‌లో ఘనంగా సత్కరించారు. శాలువా కప్పి బాలికను అభినందించారు.

టీ స్టాల్స్, పాన్ షాపులు మూసేయాలి

● నిత్యావసర, ఆహార పదార్థాల షాపులకు వెసులుబాటు ● ప్రజలు సంయమనం పాటించాలి

రాణిగారితోట, జూన్ 3: ఆంధ్రప్రదేశ్ శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మంగళవారం కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో 144సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో జనసమూహం అధికంగా వచ్చే వ్యాపారాలు నిర్వహించరాదని కృష్ణలంక సీఐ.మురళీకృష్ణ తెలిపారు. స్టేషన్ పరిధిలో కొన్ని ప్రాంతాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించామన్నారు.

కృష్ణలంక సీఐ మురళీకృష్ణ

కృష్ణలంకలోని సత్యం హోటల్, ఎం హోటల్, రాణిగారితోటలో ప్రధాన సెంటర్‌తో పాటు పలు చోట్ల టీ స్టాల్స్, పాన్‌షాపులు గుర్తించడం జరిగిందన్నారు. బెంజిసర్కిల్, వైవీ రావ్ హాస్పటల్ రోడ్డులోని టీ స్టాల్స్, పాన్ షాపులు తెరిచేందుకు అనుమతి లేదని తెలిపారు. ఇటువంటి వ్యాపారాలు నిర్వహించే షాపుల వద్ద యువత, అధికంగా జనాభా చేరి పిచ్చాపాటి మాట్లాడుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ఆ షాపులు కచ్చితంగా మూసివేయాలని తెలిపారు. రోడ్లపై, ప్రధాన సెంటర్లలో, ఫీడర్ రోడ్డులో పలు చోట్ల కూర్చునేందుకు ఉన్న బల్లల వద్ద కూడా అధికంగా ఉండరాదని తెలిపారు. మిగిలిన షాపులు మూసివేయాలనే ఆంక్షలు లేవని, అయితే ఆయా షాపుల వద్ద ఎక్కువగా ప్రజలు ఉండరాదని, అవాంఛనీయ సంఘటనలు జరిగితే అందుకు ఆయా షాపుల నిర్వాహకులు బాధ్యత వహించాలని తెలిపారు. ప్రజలకు అవసరమైన నిత్యావసరాలు, ఆహారపదార్థాలకు సంబంధించిన కిరాణాషాపులు, చికెన్, కూరగాయలు, మందుల షాపులు, హోటల్స్‌పై ఆంక్షలు లేవన్నారు. ప్రజలు ఎన్నికల ఫలితాలను ప్రసార మాధ్యమాల ద్వారా ఇళ్లలోనే ఉండి తెలుసుకోవాలని, ఎటువంటి భావోద్వేగాలకు లోను కాకుండా సంయమనం పాటించాలని అన్నారు. ప్రజలు వారి పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కృష్ణలంక, రాణిగారితోట, లబ్బీపేటలతో పాటు పలు చోట్ల పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రోడ్లపై అనవసరంగా తిరగొద్దు : సీఐ దుర్గారావు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సూర్యారావుపేట సీఐ దుర్గారావు

వన్‌టౌన్, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మంగళవారం 144వ సెక్షన్ అమలులో ఉన్నందున ఎవరూ అనవసరంగా రోడ్లపై తిరగకూడదని, ఆంక్షలను అమలు చేస్తున్న పోలీసుల విధులకు ఎవరూ ఆటంకం కలిగించకూడదని సూర్యారావుపేట సీఐ దుర్గారావు అన్నారు. సోమవారం సూర్యారావుపేటలోని శ్రీధర్స్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కోచింగ్ సెంటర్‌లో విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎవరూ అనవసరంగా రోడ్లపైకి రావొద్దని గుంపులు, గుంపులుగా చేరవద్దని, 144వ సెక్షన్ గట్టిగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సీసీ శ్రీధర్, ప్యాకల్టీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ప్రత్యేక పూజలు



పాయకాపురం, జూన్ 3 : రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అత్యధిక మెజారిటీతో విజయం సాధించాలని, చంద్రబాబునాయుడు మరోసారి ముఖ్యమంత్రి కావాలని కాంక్షిస్తూ పాయకాపురం ప్రజాశక్తినగర్‌లోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. జిల్లా నాయీ బ్రాహ్మణ సాధికార కన్వీనర్ సూరవరపు నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొని పూజలు నిర్వహించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా గెలిచి రాష్ట్రంలో సుపరిపాలన అందించాలని సూరవరపు నాగరాజు కోరారు. శ్రీను, రాజేష్, సత్యనారాయణ, శ్రీకాంత్, హేమంత్, కొండ, పాల్గొన్నారు.

గాలిబ్ షహీద్ దర్గాలో సుజనా చౌదరి ప్రార్థనలు



భవానీపురం, జూన్ 3: పశ్చిమ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యలమంచిలి సుజనా చౌదరీ భవానీపురంలోని ప్రఖ్యాతిగాంచిన హజ్రత్ సయ్యద్ గాలిబ్ షహీద్ దర్గాను సోమవారం దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంగళవారం జరిగే కౌంటింగ్ పర్యవేక్షణకు ఆయన విజయవాడకు చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గాన విచ్చేసిన సుజనా చౌదరికి భవానీపురం వద్ద టీడీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, జనసేన నేతలు ఘనస్వాగతం పలికారు. దర్గాలో సుజనా ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మాజీ కార్పొరేటర్లు ఖాదర్ ఖాన్, కరీముల్లా, జనసేన సెంట్రల్ ఆంధ్రా జోన్ కన్వీనర్ బాడిత శంకర్, సమ్మెట రాజానాయుడు, షేక్ సలీమ్, షేక్ తాజుద్దీన్‌లు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పోటీలు

గవర్నర్‌పేట, జూన్ 3: ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5న దేశభక్తి గీతాల ఆలాపన, కథ చెప్పడం, పుస్తక సమీక్ష పోటీలు, 6న క్యారమ్ బోర్డు, చదరంగం పోటీలు ఉంటాయని, 7న గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.

వీఎంసీ పార్కులో ఆటపరికరాలు ధ్వంసం





ధ్వంసమైన జారుడుబల్ల, ఊయల బల్ల

భారతీనగర్, జూన్ 3: నాలుగో డివిజన్ సీటీవో కాలనీలోని తంగెళ్ళమూడి భాస్కరరావు వీఎంసీ పార్కులోని ఆట పరికరాలు ధ్వంసమైపోయాయి. పార్కు నిర్మించి ఏళ్లు గడిచిపోవడంతో మరమ్మతులకు గురై ఆట పరికరాలు ధ్వంసం అయ్యాయి. కాలనీలోని చిన్నారులు సెలవు సమయంలో ఆటలు ఆడుకోవడానికి సమీప కాలనీ గురునానక్ కాలనీలోని వీఎంసీ పార్కుకు వెళ్లాల్సి వస్తుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేయించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బీజేపీ చేతిలో పావుగా మారిన ఎన్నికల కమిషన్

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు



మాట్లాడుతున్న బాబూరావు

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 3 : బీజేపీ చేతిలో కేంద్ర ఎన్నికల కమిషన్ పావుగా మారిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. సోమవారం అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతంలో సీపీఎం కార్యకర్తల అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా పని చేసిన కార్యకర్తలు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బాబూరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ, టీడీపీలు ధన రాజకీయాలు నడిపాయని ఆరోపించారు. ప్రజా సంక్షేమానికై నీతివంతమైన రాజకీయాలతో పోటీ చేసిన సీపీఎందే నైతిక విజయమని పేర్కొన్నారు. కె. శ్రీదేవి, కె. దుర్గారావు, శ్రీను, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న హజరత్తయ్య గుప్తా

వాసవీ క్లబ్ విజయవాడ పెరల్స్ 20 వసంతాల వేడుకలు

ధర్నాచౌక్, జూన్ 3: వాసవీ క్లబ్ విజయవాడ పెరల్స్ 20 వసంతాల వేడుకలు గాంధీనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో విశిష్ట అతిథిగా పాల్గొన్న వాసవీ క్లబ్‌ల మాజీ అంతర్జాతీయ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా 20 వసంతాల కేక్‌ను కట్ చేశారు. క్లబ్ అధ్యక్షుడు నేరేళ్ల సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి, మాజేటి హరిప్రసాద్, వీవీ.సంపత్‌కుమార్, మోటమర్రి గోపాలకృష్ణ, క్లబ్ కార్యదర్శి కిరణ్‌కుమార్, కోశాధికారి మాటూరి బసవయ్య, నందిపాటి శ్రీనివాసరావు, మాజేటి రామచంద్ర పాల్గొన్నారు. హజరత్తయ్య గుప్తాను సత్కరించారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

భారతీనగర్, జూన్ 3: టెన్త్ విద్యార్హతతో రెండేళ్ల కోర్సులు చేసేందుకు జిల్లా పరిధిలో ఒక ప్రభుత్వ ఐటీఐ కళాశాల, 11 ప్రైవేట్ కళాశాలలు అందుబాటులో ఉన్నాయని విజయవాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఐటీఐ కోర్సుల్లో ప్రవేశించడానికి 1508 సీట్లు భర్తీకి విద్యార్థులు ఈ నెల 10లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

రోడ్డుపైనే వ్యాపారాలు

● నూజివీడు రోడ్డులో నిలిచిపోతున్న ట్రాఫిక్
● పట్టించుకోని పోలీసులు

సత్యనారాయణపురం, జూన్ 3: లోటస్‌ల్యాండ్ మార్క్ నుంచి గంగానమ్మ గుడి వరకూ నూజివీడు రోడ్డులో ఆక్రమణలతో తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. నిత్యం వేలాది మంది నగరం నుంచి అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం, వాంబేకాలనీ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. మామిడికాయల సీజన్ కావడంతో చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి మామిడికాయల బుట్టలతో వచ్చిన మినీ వ్యాన్‌లను లోటస్‌ల్యాండ్ మార్క్ వద్ద నుంచి గంగానమ్మ గుడి వరకూ రోడ్డుపైనే పెట్టి దిగుమతి చేస్తున్నారు. ఇప్పటికే రోడ్డును హాకర్లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. వీరికోసం వచ్చిన వినియోగదారులు రోడ్డుపైన వాహనాలు నిలుపుతున్నారు. దీంతో పగలు తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుంది. చుట్టుప్రక్కల పాంతాల నుంచి సుమారు 30 నుంచి 40 మినీ వ్యాన్‌లలో బుట్టలతో మామిడి కాయలను తీసుకు వస్తున్నారు. వచ్చిన వారు వాహనాలను రోడ్డుపైనే పెట్టి దిగుమతి చేయడంతో పాటు, రోడ్డను ఆక్రమిస్తున్నారు.వీటిని కొనేందుకు వినియోగదారులతో పాటు, చిరువ్యాపారులు తరలి వస్తున్నారు. దీంతో సాయంత్రం 7నుంచి 10గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లడానికి ఖాళీ ఉండడం లేదు.



నూజివీడు రహదారిలో నిలిచిన ట్రాఫిక్

కనిపించని ట్రాఫిక్ పోలీసులు

నిత్యం ఈ ప్రాంతంతో ట్రాఫిక్ స్తంభించి పోతున్నా ట్రాఫిక్ పోలీసులు మాత్రం కన్నెత్తి చూడడం లేదు. దీంతో హాకర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్లను సైతం ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నా మాముళ్ల మత్తులో పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రత్యేక స్థలం కేటాయించండి

మినీ వ్యాన్‌లలో వచ్చే మామిడికాయలను దిగుమతి చేసేందుకు ఓ ప్రాంతాన్ని కేటాయించాలని వాహనదారులు కోరుతున్నారు. బుడమేరు వంతెన ముందు ఖాళీ స్థలంలో మామిడి కాయల వ్యాపారులకు ఖాళీ స్థలం ఉందని, వీరిని అక్కడకి తరలిస్తే మేలని స్థానికులు చెబుతున్నారు. లేని పక్షంలో రోడ్డుపైన దిగుమతి చేసే సమయంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులు చూడాలని కోరుతున్నారు.

అడ్డదిడ్డంగా పార్కింగ్



వన్‌టౌన్: గాంధీనగర్ ఐలాపురం హోటల్ వెనుక వైపు ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు వాహనాలతో కిక్కిరిసి ఉంటుంది. జనాల రాకపోకలకు ఇబ్బంది కనిపిస్తోంది. ఇటువైపుగా పోలీసులు వస్తున్నప్పటికీ చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు తప్ప చర్యలు తీసుకున్న సందర్భం లేదు. ఈ రోడ్డులో టిఫిన్ హోటల్ , పక్కనే బార్ ఉండడంతో మందుబాబులు, ఆహార ప్రియులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. అధికంగా వాహనాలపై వస్తూ అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసి ఇబ్బందులు కలిగిస్తున్నారు. కనీసం అటు బార్ నిర్వాహకులు కానీ, ఇటు టిఫిన్ హోటల్ నిర్వాహకులు గానీ వాహనాలను సరైన రీతిలో పెట్టుకోవాలని చెప్పకపోవడంతో రోడ్డుకు అడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. అటు ఐలాపురం హోటల్‌వైపు కూడా వాహనాలు నిలిపివేస్తుండడంతో పాటు రెండో వైపు వాహనాలు వెళుతుండడం చిన్న రోడ్డు కావడం అత్యంత ఇబ్బందికరంగా మారింది. పోలీసులు నామమాత్రంగా వచ్చి వెళుతున్నారు తప్ప అక్కడ ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేసిన దాఖలాలు లేవు. దీనికి కారణం వాళ్లకు నెలవారీ, రోజువారీ మామూళ్లు అందుతున్నాయన్న ఆరోపణలు లేకపోలేదు.

ఆదమరిస్తే అంతే...

● దావు బుచ్చయ్య కాలనీ రోడ్డు పక్కనే ఉన్న బోరుబావి
● రోడ్డుకు సమాంతరంగా ఉన్న వైనం
● దృష్టి సారించని అధికారులు

గుణదల, జూన్ 3: గుణదల బుడమేరు వంతెన దిగి ముత్యాలంపాడు...దేవీనగర్ వెళ్లే దారిలో ఉన్న దావు బుచ్చయ్య కాలనీ రోడ్డు పక్కనే ఉన్న బోరుబావి ప్రమాదకరంగా ఉంది. ఈ బావి రోడ్డుకు సమాంతరంగా ఉండడంతో దగ్గరకు వచ్చేంత వరకు బావి ఉందన్న సంగతి ఎవరికీ తెలియదు. దావు బుచ్చయ్య కాలనీ రోడ్డు పక్కనే ఒక బావిని తవ్వి అందులోకి బుడమేరు నీటిని మోటార్ల ద్వారా తోడి ఆ నీటిని పంటపొలాలకు వాడుతున్నారు. పంటపొలాలకు వాడగా మిగిలిన నీటిని పక్కనే ప్లాట్స్, కాలనీల్లోకి వదిలేస్తున్నారు. దీని ద్వారా భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా గుణదల నుంచి దేవినగర్ వైపు వచ్చే వాహనదారులు ఆదమరిచి వాహనం నడిపితే రోడ్డుపక్కనే తవ్విన బావిలో పడిపోవడం ఖాయం. ఇప్పటికే పలువురు బావిలోపడి గాయపడ్డ ఘటనలు లేకపోలేదు. ఉన్నతాధి కారులు దీనిపై తక్షణమే చర్యలు చేపట్టి బుడమేరు నుంచి నీరు మోటార్లు ద్వారా బావిలోకి తోడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరు తున్నారు. బావిచుట్టూ రక్షణగా ఏమీ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని స్థానికులు అంటున్నారు. నగరపాలక సంస్థ అధికారులు, నీటిపారుదలశాఖ వారు ఈవిషయమై దృష్టి సారించి ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



విద్యుత్ శాఖ ఉద్యోగికి ఐదున్నరేళ్ల జైలు

తిరువూరు, జూన్ 3: విద్యుత్ బిల్లులకు చెల్లించిన నగదును జమ చేయని విద్యుత్ శాఖ జూనియర్ అసిస్టెంట్‌కు ఐదున్నరేళ్ల జైలు, జరిమానా విధిస్తూ తిరువూరు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి మోతీలాల్ తీర్పు ఇచ్చారని ఎస్సై సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. విద్యుత్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తిరువూరు తోళ్లబజారుకు చెందిన షేక్ బాజీ రూ.70లక్షలు జమ చేయకుండా మోసం చేశాడని ఏఈవో చెరుకూరి వెంకటబ్రహ్మయ్యచారి 2013 మే ఒకటో తేదీన ఫిర్యాదు చేశారని, దీనిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపామని ఎస్సై తెలిపారు.

సాక్షుల విచారణ అనంతరం బాజీకి కోర్టు ఐదున్నర సంవత్సరాల జైలు, రూ.7 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చిందని ఆయన పేర్కొన్నారు.



క్లీంకారకు కల్కి టీమ్ గిఫ్ట్స్

విడుదల తేదీ దగ్గర పడడంతో 'కల్కి 2898 ఏ.డీ' చిత్ర బృందం ప్రచారం జోరు పెంచింది. ప్రమోషన్స్‌లో భాగంగా స్టార్ కిడ్స్‌కు గిఫ్ట్‌ను పంపిస్తోంది. ఇటీవలే ఈ గిఫ్ట్ రామ్‌చరణ్, ఉపాసనల కూతురు క్లీంకారకు చేరాయి. ఆ బహుమతుల్లో బుజ్జి-భైరవ స్టికర్స్, బుజ్జి క్యారెక్టర్ బొమ్మ, టీషర్ట్‌లు ఉన్నాయి. ఆ గిఫ్ట్‌తో ఆడుకుంటున్న క్లీంకార ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఉపాసన.. కల్కి టీమ్‌కు కృతజ్ఞతలతో పాటూ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ ప్రచారంలో భాగంగా త్వరలోనే మరింత మంది సెలబ్రిటీల పిల్లలకూ ఈ గిఫ్ట్ అందుతాయట. కాగా, అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్ ఇండియా మూవీ 'కల్కి 2898 ఏ.డీ' ఈ నెల 27న విడుదల కానుంది. ప్రభాస్ హీరోగా నటించిన ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌కు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనే, దిశా పటానీలతో కూడిన భారీ తారాగణం ఇందులో నటించారు. వైజయంతీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అశ్వనీదత్ నిర్మించిన ఈ చిత్రం మహా భారతంతో మొదలై క్రీస్తు శకం 2898లో పూర్తయ్యేలా, మొత్తం ఆరు వేల ఏళ్ల సంవత్సరాల వ్యవధిలో జరిగే కథగా తెరకెక్కింది.

అటు రజనీకాంత్.. ఇటు ఎన్టీఆర్



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రస్తుతం హిమాలయ పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. తన ఆధ్యాత్మిక యాత్రలో భాగంలో కేదార్‌నాథ్, బద్రీనాథ్ దేవాలయాలను సందర్శించిన రజనీకాంత్ ఇప్పుడు అక్కడున్న సాధువులను కలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఓ సాధువుతో ఆధ్యాత్మిక విషయాలు చర్చిస్తూనే తన సినిమాల ముచ్చట్లు కూడా వివరించారు. ప్రస్తుతం 'వెట్టియాన్‌లో నటిస్తున్నాను. నా వర్క్ పూర్తయింది. మిగిలిన నటీనటుల మీద చిత్రీకరణ జరుగుతోంది. విజయదశమి సందర్భంగా అక్టోబరు పదిన ఆ సినిమా విడుదల చేయాలనుకుంటున్నారు. నా కొత్త సినిమా 'కూలీ' షూటింగ్ ఈ నెల పదిన ప్రారంభమవుతుంది. ఈ సినిమాలకు లోకేశ్ కనకరాజ్ దర్శకత్వం వహిస్తారు' అని ఆ సాధువుకు చెప్పారు రజనీకాంత్.

జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న 'దేవర పార్ట్ 1' చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అదే రోజున రజనీకాంత్ సినిమా కూడా వస్తుండడంతో ఈ రెండు చిత్రాల మధ్య పోటీ తప్పదంటున్నారు సినీ పరిశీలకులు. అయితే రజనీకాంత్ చిత్రం విడుదల తేదీని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఈ రెండు చిత్రాల మధ్య పోటీ ఉంటుందా లేదా అని తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే!



ఇకపై... రెట్టింపు కష్టపడతా

నటిగా దక్షిణాదిలోని అగ్రతారల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్నారు సమంత. ఇటీవలే ఆమె మరో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ఐఎండీబీ (ఇంటర్నెట్ మూవీ డేటా బేస్) ఇటీవలే 'గత దశాబ్దంలో ఎక్కువ మంది చూసిన భారతీయ సెలబ్రిటీల జాబితా'పై సర్వే నిర్వహించింది. ఇందులో సమంతకు 13వ స్థానం లభించింది. ఈ విషయంపై ఆమె స్పందించారు. "నటిగా ఇలాంటి గుర్తింపు తెచ్చుకున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇది నా కృషికి, అదృష్టానికి తగిన ప్రతిఫలం. ఇండస్ట్రీలో ఇన్నేళ్లు ఎలా గడిచాయో తెలియట్లేదు. కెరీర్‌ను ఇప్పుడిప్పుడే మొదలుపెడుతున్నట్టు ఉంది. వరుస సినిమాల్లో నటించేందుకు అద్భుతమైన పాత్రలు వస్తున్నాయి. ఇకపై నేను నటించే ప్రతీ సినిమాలో అభిమానుల కోసం రెట్టింపు కష్టపడతా" అని చెప్పారు. కాగా, ఈ జాబితాలో బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణే అగ్రస్థానంలో నిలువగా.. షారుక్ ఖాన్, ఐశ్వర్య రాయ్ బచ్చన్, ఆలియా భట్ తర్వాతి స్థానాల్లో నిలిచారు. దక్షిణాది నుంచి తమన్నా, నయనతార 16, 18వ స్థానంలో నిలిచారు.

థ్రిల్లర్స్ ఇష్టపడే వారికి నచ్చేలా సత్యభామ



థ్రిల్లర్ చిత్రాల స్పెషలిస్ట్‌గా పేరు తెచ్చుకున్నారు సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల. సినిమాకు ఆయన ఇచ్చిన సంగీతం కంటే అందులోని నేపథ్య సంగీతంతోనే పాపులరైన శ్రీచరణ్.. తాజాగా మ్యూజిక్ అందించిన చిత్రం 'సత్యభామ'. కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించగా.. నవీన్‌చంద్ర కీలక పాత్ర పోషించారు. ఈ క్రైమ్ థ్రిల్లర్ చిత్రానికి సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు.

"నేను కేవలం థ్రిల్లర్ మూవీస్‌కే ఎక్కువ వర్క్ చేస్తానని అందరూ అభిప్రాయపడుతుంటారు. కానీ నాకు అన్ని రకాల సినిమాలకు సంగీతం అందించడం ఇష్టం. ఈ సినిమాలో మొత్తం ఐదు పాటలుంటాయి. అవి వేటికవే భిన్నంగా ఉంటూ.. అందరినీ ఆకట్టుకుంటాయి. థ్రిల్లర్ మూవీస్ ఇష్టపడే వారికి ఈ చిత్రం చాలా బాగా నచ్చుతుంది. ఇందులోని ట్విస్ట్‌లు అదిరిపోతాయి. ఒక పోలీసాఫీసర్ ఎమోషనల్ జర్నీ ఇది. కాజల్‌కు ఇది పర్ఫెక్ట్ కమ్‌బ్యాక్ సినిమా అవుతుంది. ఇందులోని యాక్షన్ ఎపిసోడ్స్ థియేటర్స్‌లో సినిమాను చూసే ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తాయి. పోరాట ఘట్టాల్లో ఆమె డూప్ లేకుండా చేశారు. కాజల్ కెరీర్‌లోనే ఈ సినిమా బిగ్గెస్ట్ హిట్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉంది. డైరెక్టర్ సుమన్ ఈ సినిమాను తన మేకింగ్‌తో మరో స్థాయికి తీసుకెళ్లారు" అని చెప్పారు.

హిలేరియస్ ఎంటర్‌టైనర్



అదితి, జాన్సన్, హరినాథ్ పొలిచెర్లా, సుస్మితా చటర్జీ, సత్య ముఖ్య పాత్రలు పోషించిన ఈచిత్రం 'వాట్ ది ఫిష్'. వరుణ్ కోరుకొండ దర్శకత్వంలో విశాల్ బెజవాడ, విశాల్ బెజవాడ నిర్మించారు. 'ఇదొక యూనిక్ యాక్షన్ థ్రిల్లర్, హిలేరియస్ ఎంటర్‌టైనర్. ఇటీవల విడుదల చేసిన నిహారిక కొణిదెల, వెన్నెల కిశోర్ ఫస్ట్ లుక్ పోస్టర్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.' అని దర్శక నిర్మాతలు చెప్పారు. వివిధ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి శక్తికాంత్ కార్తీక్ సంగీతం అందిస్తున్నారు.

తొలి ఎన్నికల చీఫ్ కమిషనర్ బయోపిక్



దేశప్రజలంతా టీవీల ముందు కూర్చుని ఎన్నికల ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్న తరుణం ఇది. ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది, ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి.. అని జోరుగా అంచనాలు, బెట్టింగ్స్ సాగుతున్న ఈ నేపథ్యంలో భారతదేశపు తొలి ఎన్నికల చీఫ్ కమిషనర్ సుకుమార్ సేన్ బయోపిక్ తీయనున్నట్లు చిత్ర నిర్మాత సిద్ధార్థ రాయ్ కపూర్ ప్రకటించారు. సివిల్ సర్వెంట్‌గా మారిన గణితశాస్త్ర వేత్త సుకుమార్ సేన్ 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికలకు పర్యవేక్షకుడిగా ఉన్నారు. 'మన జాతీయ కథానాయకుల్లో ఒకరైన సుకుమార్ జీవిత కథను తెరకు ఎక్కించే అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో ప్రకటిస్తాం' అని తెలిపారు. తన తాతగారి బయోపిక్‌ను తీసే ప్రయత్నం చేస్తున్నందుకు సుకుమార్ సేన్ మనవడు సంజీవ్ సేన్ కూడా ఆనందం వ్యక్తం చేశారు.

గుడిలా మార్చేశా



కొద్ది రోజులుగా దివంగత బాలీవుడ్ నటుడు సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ ఇంటిపై జరుగుతున్న చర్చపై నటి అదాశర్మ మీడియాకు క్లారిటీ ఇచ్చారు. ఆ ఇంటిని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. "సుశాంత్ నివసించిన ఇంట్లోనే ప్రస్తుతం ఉంటున్నాను. చుట్టూ పాజిటివ్‌గా ఉండే ఆహ్లాద వాతావరణం నన్నెంతగానో ఆకట్టుకుంది. ముంబై, కేరళలోని మా సొంతిళ్లను తలపించేలా ఉన్న ఈ ఇంటిని అందుకే కొన్నాను. ఇందులోని మొదటి అంతస్తును గుడిలా.. ఒక రూమ్‌ను మ్యూజిక్ రూమ్‌లా.. మరో గదిని డ్యాన్స్ స్టూడియోగా రీమోడలింగ్ చేయించాను. టెర్రస్‌ను గార్డెన్‌లా మార్చేశాను" అని చెప్పారు. కాగా, గతేడాది ఈ నటి, సుశాంత్ ఇంటి వద్ద కనిపించినప్పటి నుంచి ఆమె ఈ ఇంటిని కొనుగోలు చేశారని ఊహాగానాలు వినపడిన సంగతి తెలిసిందే.

యూత్‌ను ఆకట్టుకుంటుంది

యదార్థ సంఘటనల ఆధారంగా.. యూత్ ఆడియెన్స్‌కు మెప్పించేలా తెరకెక్కిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు-500143'. శ్రీనాథ్ పులకరం ఈ టీనేజ్ లవ్ డ్రామాకు దర్శకత్వం వహించగా, భువన్‌రెడ్డి కొవ్వూరి నిర్మించారు. ప్రణవ్ ప్రీతమ్, షాజ్ఞశ్రీ



వేణున్, రామ్ పటాస్, తేజగౌడ్ ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ నెల 21న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీనాథ్ పులకరం మాట్లాడుతూ "ఇందులోని లవ్‌స్టోరీ ప్రేక్షకుల మనసుకు హత్తుకునేలా ఉంటుంది" అని చెప్పారు. నిర్మాత భువన్‌రెడ్డి కొవ్వూరి మాట్లాడుతూ "ఈ సినిమా యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటుంది" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్:కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: నిఖిల్ సురేంద్రన్, సంగీతం: కార్తీక్ రోడ్రిగజ్.

విషపూరితాలు



మనందరికీ ఇల్లే పదిలమైన ప్రదేశం. కానీ మనం చేసే చిన్న చిన్న పొరపాట్లు, నిర్లక్ష్యాల వల్ల సురక్షితమైన ఇల్లే ప్రమాదకరమైన ప్రదేశంగా మారిపోతుంది. మరీ ముఖ్యంగా క్రిమికీటకాలు, ఎలుక మందులు, ఇంటిని శుభ్రపరిచే ఉత్పత్తులు లాంటివి పొరపాటున పొట్టలోకి చేరుకుంటే, ఆరోగ్యపరంగా తిరిగి సరిదిద్దలేని నష్టం జరగవచ్చు. కాబట్టి వీటితో తలెత్తే ప్రమాదాలు, ప్రత్యామ్నాయ పద్ధతులు గురించి తెలుసుకుందాం!

ఆ మందులు మనకు ప్రమాదకరం

చిట్టెలుకలు, ఎలుకలు, పందికొక్కులు లాంటివి గ్రామాలకే పరిమితం కాదు. నగరాల్లో కూడా అవి స్వేచ్ఛగా తిరుగుతూ ఉంటాయి. వాటితో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది కాబట్టి ఎన్నో రకాల ఎలుక మందులు తయారవుతున్నాయి. పొడి, పేస్ట్, పెల్లెట్స్, సిరీల్ బెయిట్స్ లేదా బ్లాక్స్ రూపంలో ఇవి మార్కెట్లో దొరుకుతూ ఉంటాయి. వీటిని ఇళ్లలో ఉపయోగించినప్పుడు, పొరపాటున లేదా ప్రమాదవశాత్తూ తినేయడం జరుగుతూ ఉంటుంది. మరీ ముఖ్యంగా పిల్లలున్న ఇళ్లలో ఇలాంటి ప్రమాదాలు ఎక్కువ. కొన్ని సందర్భాల్లో వీటి నుంచి వెలువడే విషపూరిత వాయువులు పీల్చుకోవడం వల్ల కూడా ప్రమాదాలు తలెత్తవచ్చు. ఎరువులు, బాణాసంచా, మందుగుళ్లు, ఎలుక మందుల తయారీల్లో పసుపు లేదా తెల్లగా ఉండే ఫాస్ఫరస్‌ను ఉపయోగిస్తూ ఉంటారు. వెల్లుల్లి వాసన వెదజల్లుతూ ఉండే ఈ పదార్థం అన్ని చోట్లా దొరుకుతూ ఉంటుంది.

ఫాస్ఫరస్ ప్రమాదం

ఎలుక మందుల తయారీలో ఉపయోగించే ఈ విషపూరిత పదార్థం పొట్టలోకి చేరుకున్న వెంటనే వేగంగా శోషణ చెంది, కాలేయం, మూత్రపిండాలు, జీర్ణకోశం, హృదయనాళ వ్యవస్థ పనితీరును దెబ్బతీస్తుంది. కేవలం 8 గ్రాముల ఎలుక మందు, ప్రాణాంతక పరిస్థితికి దారి తీసేటంత ప్రభావాన్ని కలిగి ఉంటుంది. ఈ విషం బారిన పడిన 24 గంటల్లోగా వాంతులు, తలతిరుగుడు, డయేరియా, పొట్టలో నొప్పి మొదలైన లక్షణాలు తలెత్తుతాయి. రెండవ దశలో ఒకటి నుంచి నాలుగు రోజుల పాటు ఎలాంటి లక్షణాలు కనిపించకపోవచ్చు. మూడవ దశలో, బహుళ అవయవాలు విఫలమవుతూ పరిస్థితి ప్రాణాంతకంగా పరిణమిస్తుంది. ఈ దశలో మానసిక స్థితి కూడా దెబ్బతింటుంది. అయోమయం, సైకోసిస్, చిత్రభ్రమలు మొదలై, కోమాలోకి జారిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. అయితే ఈ ఎల్లో ఫాస్ఫరస్ విషానికి ఎలాంటి విరుగుడూ లేకపోయినప్పటికీ, డీకంటామినేషన్, సపోర్టివ్ థెరపీలతో చికిత్స చేయవచ్చు. దాన్లో భాగంగా విషం మరింతగా శోషణ చెందకుండా ఉండడం కోసం పొట్టలోని విషాలను బయటకు రప్పించే గ్యాస్ట్రిక్ లావేజ్ పద్ధతిని అనుసరిస్తారు. అందుకోసం పొటాషియం పర్మాంగనేట్ ద్రావణం లేదా సెలైన్‌ను పొట్టలోకి పంపిస్తారు. ఈ చికిత్సతో కోలుకున్న తర్వాత, రోగిని ఐసియులో ఉంచి, ప్రతిరోజూ కాలేయం, మూత్రపిండాల పనితీరులను పర్యవేక్షించవలసి ఉంటుంది.

పారాసిటమాల్‌తో...

ఈ మాత్రలను ఎక్కువ పరిమాణాల్లో తీసుకోవడం వల్ల కాలేయం తీవ్రంగా విషపూరితం అయ్యే ప్రమాదం ఉంటుంది. పెద్దలకు 7.5 నుంచి 10 గ్రాములు, ఒకటి నుంచి ఆరేళ్లలోపు పిల్లలైతే ఒక కిలో శరీర బరువుకు 150 మి.గ్రా నుంచి 200 మి.గ్రా పారాసిటమాల్ ప్రమాదకరం. ఈ మోతాదుల్లో పారాసిటమాల్ తీసుకున్న 24 గంటల్లోగా ఆకలి తగ్గిపోవడం, వాంతులు, తల తిరుగుడు లాంటి లక్షణాలు కనిపిస్తాయి. 48 గంటల్లోగా పొట్టలో నొప్పి, ఆకలి లేకపోవడం, వాంతులు, 48 నుంచి 96 గంటల్లోగా కామెర్లు, హైపోగ్లైసీమియా, కాలేయం, మూత్రపిండాలు దెబ్బతింటాయి. ఇలాంటి సందర్భాల్లో కూడా పొట్టలోని మాత్రలను బయటకు రప్పించే చికిత్సనే వైద్యులు అనుసరిస్తారు.

నెయిల్ పాలిష్, హార్పిక్‌లతో...

వీటిలోని విషపూరిత రసాయనాలైన టోలీన్, ఫార్మాల్డిహైడ్, డైబ్యుటైల్ ఫ్థలేట్‌లు, పారాసిటమాల్ పాయిజనింగ్ మాదిరిగానే కాలేయం, మూత్రపిండాలను దెబ్బ తీస్తాయి. పిల్లలు ప్రమాదవశాత్తూ బాత్రూమ్ శుభ్రం చేసే హార్పిక్ తాగేస్తూ ఉంటారు. హార్పిక్ పొట్టలోకి చేరుకుంటే జీర్ణ వ్యవస్థ దెబ్బతిని, వాంతులు, డయేరియా వేధిస్తాయి. కాలేయం ఇస్కీమిక్ షాక్‌కు గురవుతుంది. వీటితో పాటు, బాత్రూమ్ శుభ్రం చేసే యాసిడ్లు, ఫినాయిల్, పొడి, చాక్‌పీస్ రూపంలో ఉండే చీమల మందులు కూడా ప్రమాదకరమే!

నివారణ ఇలా...

- **అగ్గిపుల్లలు:** వీటిని పిల్లలకు దూరంగా ఉంచాలి. వాడకాన్ని తగ్గించాలి. స్టవ్ వెలిగించడం కోసం వీటికి బదులుగా ఎలక్ట్రానిక్ లైటర్లను ఉపయోగించాలి.
- **బాణాసంచా:** వీటి నుంచి వెలువడే పొగను పీల్చే అవకాశం లేకుండా చూసుకోవాలి. ఎక్కువ పొగను వెలువరించే మతాబులు, చిచ్చుబుడ్లు లాంటి బాణాసంచాలకు దూరంగా ఉండాలి. బాణాసంచా కాల్చేటప్పుడు రెండు పొరల మాస్క్ ధరించాలి.
- **ఎరువులు:** ప్రమాదవశాత్తూ పిల్లలకూ, మానసిక కుంగుబాటుతో ఆత్మహత్య చేసుకొనే పెద్దలకు ఎరువులు ప్రాణాంతకంగా మారుతూ ఉంటాయి. కాబట్టి వీటిని తాళం వేసిన గదుల్లో భద్రపరచాలి.
- **ఎలుక మందులు:** వీటిని కూడా పిల్లలు, పెద్దలు ఇద్దరికీ దూరంగా ఉంచాలి. వీటిని ఉంచిన గదికి తాళం వేసి ఉంచాలి. వీటిని నిల్వ చేసుకోకూడదు. తక్కువ మోతాదుల్లో కొని, కొన్న వెంటనే పూర్తిగా ఉపయోగించాలి. ఖాళీ అయిన డబ్బా లేదా ట్యూబ్‌లను వెంటనే పారేయాలి. మిగిలిపోయిన మందులను నేల మీద పారేయకూడదు.
- ఎలుక మందులకు బదులుగా బోన్లు, జిగురుతో కూడిన ర్యాట్ ట్రాప్స్ వాడుకోవాలి.





డాక్టర్ గొలమారి శ్రీనివాస్ రెడ్డి
కన్సల్టెంట్ హెపటాలజీ అండ్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్,
స్టార్ హాస్పిటల్స్, హైదరాబాద్.



ఎల్లో ఫాస్ఫరస్ విషానికి ఎలాంటి విరుగుడూ లేకపోయినప్పటికీ, డీకంటామినేషన్, సపోర్టివ్ థెరపీలతో చికిత్స చేయవచ్చు. దాన్లో భాగంగా విషం మరింతగా శోషణ చెందకుండా ఉండడం కోసం పొట్టలోని విషాలను బయటకు రప్పించే గ్యాస్ట్రిక్ లావేజ్ పద్ధతిని అనుసరిస్తారు. అందుకోసం పొటాషియం పర్మాంగనేట్ ద్రావణం లేదా సెలైన్‌ను పొట్టలోకి పంపిస్తారు.



మీకు తెలుసా?

తన కోపమే తన శత్రువు

మనకు కోపమొస్తే ఎదుటివాళ్లకే నష్టం అనుకుంటాం. కానీ నిజానికి మన కోపం మనల్నే నష్టపరుస్తుంది. కోపం వల్ల మెదడుతో పాటు శరీరంలోని జీవ వ్యవస్థలన్నిటికీ ఆరోగ్యపరమైన నష్టం జరుగుతుంది.

కోపం పెల్లుబిగడాని కంటే ముందే, మెదడులోని అమిగ్డాలా యాక్టివేట్ అవుతుంది. అమిగ్డాలా హైపోథలామస్‌ను యాక్టివేట్ చేస్తుంది. హైపోథలామస్ కార్టికోట్రోపిన్ రిలీజింగ్ హార్మోన్ స్రవించేలా చేసి, పిట్యూటరీ గ్రంథిని ప్రేరేపిస్తుంది. పిట్యూటరీ గ్రంథి అడ్రినోకార్టికోట్రాపిక్ హార్మోన్‌ను స్రవించి, అడ్రినలిన్ గ్రంథుల్ని ప్రేరేపిస్తుంది. అడ్రినల్ గ్రంథులు కార్టిసాల్, అడ్రినలిన్, నోర్అడ్రినాలిన్ అనే స్ట్రెస్ హార్మోన్లను విడుదల చేస్తాయి. ఇదంతా ఒక సైకిల్‌లా ఒకదాని తర్వాత ఒకటిగా క్షణాల్లో జరిగిపోతుంది. కోపం కారణంగా పెరిగిపోయే కార్టిజాల్ హార్మోన్ వల్ల నాడీ కణాలు అవసరానికి మించి క్యాల్షియంను శోషించుకుంటాయి. ఈ క్యాల్షియం ఓవర్‌లోడ్ ఫలితంగా నాడీ కణాలు తరచుగా ఫైర్ అవుతూ చివరకు చనిపోతాయి. మరీ ముఖ్యంగా మెదడులోని హిప్పోక్యాంపస్, ప్రిఫ్రాంటల్ కార్టెక్స్‌లు కార్టిసాల్, దాని దుష్ప్రభావాలకు గురవుతూ ఉంటాయి.



స్ట్రెస్ హార్మోన్ల ప్రభావం

కోపంతో మెదడులో ఉత్పత్తయ్యే స్ట్రెస్ హార్మోన్ శరీరంలోని వేర్వేరు జీవ వ్యవస్థల మీద ప్రభావం చూపిస్తుంది.

- **కార్డియోవ్యాస్క్యులర్ వ్యవస్థ:** గుండె వేగం, రక్తపోటు, రక్తంలో గ్లూకోజ్ మోతాదు, రక్తంలో ఫ్యాటీ యాసిడ్ల మోతాదులు పెరుగుతాయి. ఈ లక్షణాలు తీవ్రమైతే, రక్తనాళాల్లో పూడికలు ఏర్పడి, దెబ్బతింటాయి. ఫలితంగా స్ట్రోక్, హార్ట్ అటాక్ ముప్పు తలెత్తుతుంది.
- **రోగనిరోధక వ్యవస్థ:** కంటి చూపు, థైరాయిడ్ పనితీరు, సహజసిద్ధ కిల్లర్ సెల్స్ తగ్గుతాయి. కళ్లలో ఒత్తిడి, వైరస్ సోకిన కణాలు, కేన్సర్ అవకాశాలు పెరుగుతాయి.
- **జీర్ణ వ్యవస్థ:** రక్తప్రసరణ, మెటబాలిజం, ఎముకల సాంద్రత తగ్గుతుంది. మైగ్రెయిన్లు, ఇతరత్రా తలనొప్పులు, నోరు పొడిబారడం లాంటి లక్షణాలు పెరుగుతాయి.

గుడ్ కార్బ్స

కార్బ్స తింటున్నారా?

పిండిపదార్థాలతో బరువు పెరుగుతామనే భయంతో వాటిని ఆహారంలో పూర్తిగా తగ్గించేస్తున్నాం. కానీ నిజానికి పిండిపదార్థాలన్నిటినీ తగ్గించడం శ్రేయస్కరం కాదు. వాటిలో ఏవి మంచివో, ఏవి చెడ్డవో తెలుసుకుని, అవగాహనతో నడుచుకోవాలి.

పిండిపదార్థాలు శక్తిని సమకూర్చే ప్రధాన పోషకాలు. మనం తీసుకునే ఆహారంలోని పిండిపదార్థాలను జీర్ణ వ్యవస్థ గ్లూకోజ్‌గా మారుస్తుంది. శరీరం ఈ గ్లూకోజ్‌ను కణజాలం, కణాలు, అవయవాల శక్తి కోసం వినియోగిస్తూ ఉంటుంది.

పిండిపదార్థాలు లోపిస్తే?

శక్తికి మూలాలైన పిండిపదార్థాలు లోపిస్తే శరీరం పలు లక్షణాల రూపంలో ఆ లోపాన్ని బహిర్గతపరిచే ప్రయత్నం చేస్తుంది. అవేంటంటే...

- నీరసం- నోటి దుర్వాసన
- మలబద్ధకం
- వాంతులు
- తలనొప్పి
- పోషకలోపం


డి - గ్లూకోజ్

అత్యంత ముఖ్యమైన, కీలకమైన పిండిపదార్థం గ్లూకోజ్. అన్ని జీవరాశులూ శక్తి కోసం వాడుకునే సులువైన చక్కెర (మోనోశాఖరైడ్) ఇది. అయితే పిండిపదార్థాలు శరీర బరువును కచ్చితంగా పెంచుతాయి. అవసరం లేని చెడు పిండిపదార్థాలు ఎక్కువగా తీసుకుంటూ, అవసరం ఉన్న మంచి పిండిపదార్థాలను పరిమితంగా తీసుకునేవారికి ఈ సమస్య సహజం. కాబట్టి వాటిలో ఏవి మంచి, ఏవి చెడు? అనే విషయం మీద అవగాహన ఏర్పరుచుకోవాలి.

మంచి పిండిపదార్థాలు (కాంప్లెక్స్ కార్బ్స్)

వీటిలోని రసాయన రూపం, పీచులను జీర్ణం చేసుకోవడానికి శరీరం ఎక్కువ శక్తిని ఖర్చుచేయవలసివస్తుంది. వీటి నుంచి అందే శక్తి శరీరానికి ఎక్కువ సమయంపాటు ఉపయోగపడుతుంది. మంచి పిండిపదార్థాలలో....

- పోషకాలు, పీచు ఎక్కువ
- గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ
- తక్కువ క్యాలరీలతోనే కడుపు నిండుతుంది
- శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం (మెటబాలిజం) పెరుగుతుంది.
- పొట్టు తీయని గోధుమలతో తయారైన బ్రెడ్, రొట్టెలు, తృణధాన్యాలు, ఆకుపచ్చని కూరగాయలు, చిలకడదుంపలు, తాజా పళ్లు ఈ కోవకు చెందినవి.



చెడు పిండిపదార్థాలు (సింపుల్ కార్బొహైడ్రేట్స్)

ఇవన్నీ పొట్టు తీసి, పాలిష్ చేసిన పదార్థాలు. వీటిలో సహజసిద్ధ పోషకాలు, పీచు తక్కువ. చెడు పిండిపదార్థాల్లో....

- పీచు, పోషకాలు అతి స్వల్పం
- గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువ
- క్యాలరీలు కొవ్వుగా మారతాయి
- అత్యధిక గ్లూకోజ్ స్థాయులు (నీరసం తెప్పిస్తాయి)
- చాక్లెట్లు, తీపి పదార్థాలు, తీపి జోడించిన తృణధాన్యాలు, సోడాలు, శీతల పానీయాలు, పొట్టు తీసిన పిండ్లు ఈ కోవకు చెందినవి.

మేలురకం పిండిపదార్థాలు వీటిలో...

ఓట్స్‌తో తయారైన బిస్కెట్లు, నారింజ రసం, యాపిల్, కేరట్లు, టమేటాలు, ఎండుద్రాక్ష, ద్రాక్ష, అరటిపళ్లు.

- **ఓట్‌మీల్:** ఎక్కువ సమయంపాటు శక్తినిచ్చే నిలకడైన పిండిపదార్థం ఇది. నీళ్లు కలిపి తయారుచేసిన ఒక కప్పు ఓట్‌మీల్‌లో 159 క్యాలరీలు ఉంటాయి. 4 గ్రాములు పీచు, 6 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి.
- **యాపిల్:** భోజనానికి, భోజనానికి మధ్య తీసుకోవలసిన ఈ అల్పాహార ఫలంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించే 4 గ్రాముల పీచు, పెక్టిన్‌లు ఉంటాయి. మాంసకృత్తులు పుష్కలంగా ఉండే వేరుసెనగపప్పుతో తయారయ్యే వెన్నతో కలిపి తీసుకుంటే ప్రయోజనకరం.
- **చిలకడదుంపలు:** ఇది నిజమైన 'సూపర్ ఫుడ్'. కప్పు చిలకడదుంప ముక్కల్లో 7 గ్రాముల పీచు, అత్యధిక విటమిన్ ఎ, సిలు, 4 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి.
- **మినుములు:** ఒక కప్పు ఉడకబెట్టిన పొట్టు తీయని మినుముల్లో 15 గ్రాముల పీచు, అంతే పరిమాణంలో మాంసకృత్తులు ఉంటాయి. ఇంత పరిమాణంలో పోషకాలు మరే పదార్థంలోనూ ఉండవు.
- **టమేటాలు:** వీటిలో విటమిన్లు, ఖనిజలవణాలు పుష్కలం. పీచుతో పాటు లైకోపీన్ అనే యాంటీఆక్సిడెంటు కూడా వీటిలో ఉంటాయి.

ఇలా చేద్దాం

మెదడు చురుగ్గా...

మెదడు శరవేగంతో పరుగులు తీయాలన్నా, పదునుగా పని చేయాలన్నా, అందుకు తోడ్పడే జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకోసం...

మన తెలివితేటలు, మేథస్సు జన్యువుల మీదే ఆధారపడి ఉంటాయి. అయినప్పటికీ మన మెదడు ఆరోగ్యం, తెలివితేటలు మన దైనందిన అలవాట్ల మీదే ఆధారపడి ఉంటాయి. ఆరోగ్యకరమైన జీవనశైలి మన ఏకాగ్రత, చురుకుదనాలకు పదును పెట్టి, తెలివైన నిర్ణయాలు తీసుకోడానికి, క్లిష్టమైన సందర్భాల్లో చురుగ్గా ఆలోచించడానికీ తగ్గట్టుగా మెదడును పదునుగా మారుస్తుంది. ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా ఎలాంటి అలవాట్లను అలవరుచుకోవాలంటే..

శారీరక వ్యాయామం: వ్యాయామంతో మెదడుకు రక్తప్రసరణ పెరిగి, మెదడు కణాలైన న్యూరాన్ల సంఖ్య పెరుగుతుంది. ఈత, జాగింగ్, బ్రిస్క్ వాక్ మొదలైన వ్యాయామాలు కూడా మెదడును ఆరోగ్యంగా ఉంచుతాయి.

ఆహారం: ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్లు, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు మెదడు ఆరోగ్యానికి దోహదపడతాయి. చేపలు, నట్స్, బెర్రీలు, ఆకుకూరలు మెదడు పోషణకు అవసరమైన పోషకాలను సమకూరుస్తాయి.

బ్రెయిన్ గేమ్స్: చెస్, సుడొకు, పజిల్స్, కొత్త భాష నేర్చుకోవడం లాంటివి మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. తెలివితేటలను పెంచుతాయి. నాడీ కణాల మధ్య కనెక్షన్లు పెరిగి, సమస్యను పరిష్కరించే మెలకువలు అలవడతాయి.

నిద్ర: కంటి నిండా నిద్ర జ్ఞాపకశక్తిని చురుగ్గా ఉంచుతుంది. కాబట్టి రోజుకు ఆరు నుంచి ఎనిమిది గంటలకు తగ్గకుండా నిద్రపోవాలి.

ధ్యానం: ప్రాణాయామం ఒత్తిడిని తగ్గించి, మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. ప్రాణాయామంతో మెదడుకు సరిపడా ఆక్సిజన్ దొరికి, నాడీ కణాలు చురుగ్గా పని చేస్తాయి. కొత్త విషయాలను నేర్చుకోవడం, జ్ఞాపకశక్తిలకు సంబంధించిన మెదడులోని గ్రే మ్యాటర్ మెరుగ్గా ఉండడానికి ధ్యానం తోడ్పడుతుంది.

చదవడం: పుస్తకాలు చదవడం వల్ల నాడీ కణాల యాక్టివిటీ పెరిగి, మెదడులోని పాత్‌వేస్ బలపడతాయి. సమాచారాన్ని చటుక్కున సంగ్రహించే శక్తి కూడా పెరుగుతుంది.

హైడ్రేషన్: డీహైడ్రేషన్ ఏకాగ్రతను, దీర్ఘకాల జ్ఞాపకశక్తిని కుంటుపరుస్తుంది. కాబట్టి రోజుకు నాలుగు లీటర్ల నీళ్లు తాగాలి.



డయాగ్నొసిస్

రక్తపరీక్ష మతలబులు

రక్తపరీక్ష ఫలితాల్లో మనకు అంతుపట్టని అంశాలెన్నో ఉంటాయి. కొన్ని విలువలు పెరిగిపోయి కనిపిస్తే, కొన్నిటి విలువలు తగ్గిపోయి ఉంటాయి. ఆ విలువలు, వాటిలో హెచ్చుతగ్గులకు కారణాల గురించి తెలుసుకుందాం!

టిపి (టోటల్ ప్రొటీన్)

పెరగడానికి కారణం: డీహైడ్రేషన్, ఇన్‌ఫ్లమేషన్
తరగడానికి కారణం: రక్తస్రావం, కాలేయ వ్యాధి, మూత్రపిండాల వ్యాధి, పేగుల వ్యాధి, కంజెస్టివ్ హార్ట్ ఫెయిల్యూర్

ఎఎల్‌బి (ఆల్బ్యుమిన్)


పెరగడానికి కారణం: డీహైడ్రేషన్
తరగడానికి కారణం: రక్తస్రావం, కాలేయ వ్యాధి, మూత్రపిండాల వ్యాధి, జీర్ణకోశ వ్యాధి, కంజెస్టివ్ హార్ట్ ఫెయిల్యూర్

బియుఎన్ (బ్లడ్ యూరియా నైట్రోజన్)

పెరగడానికి కారణం: డీహైడ్రేషన్, మూత్రపిండాల వ్యాధి, మూత్రంలో అడ్డంకి, గుండెజబ్బు, షాక్, అధిక ప్రొటీన్ డైట్
తరగడానికి కారణం: కాలేయ వ్యాధి, ప్రొటీన్ లోపం, ఓవర్ హైడ్రేషన్

జిఎల్‌ఒబి (గ్లోబ్యులిన్)

పెరగడానికి కారణం: క్రానిక్ ఇన్‌ఫ్లమేషన్, క్రానిక్ ఇన్‌ఫెక్షన్
తరగడానికి కారణం: రక్త నష్టం, గ్యాస్ట్రోఇంటెస్టైనల్ డిసీజ్, ఇమ్యునోడెఫిసియన్సీస్



సిఆర్‌ఇఎటి (క్రియాటినిన్)

పెరగడానికి కారణం: మూత్రపిండాల వ్యాధి, డీహైడ్రేషన్, కండరాలు దెబ్బతినడం, మూత్రంలో అడ్డంకి
తరగడానికి కారణం: ఓవర్ హైడ్రేషన్

జిఎల్‌యు (గ్లూకోజ్)

పెరగడానికి కారణం: డయాబెటిస్ మెల్లిటస్, అక్యూట్ స్ట్రెస్ రెస్పాన్స్
తరగడానికి కారణం: సెప్సిస్, పోషకలోపం, నాడీ సంబంధ వ్యాధి

సిహెచ్‌ఒఎల్ (కొలెస్ట్రాల్)

పెరగడానికి కారణం: డయాబెటిస్ మెల్లిటస్, హైపోథైరాయిడిజం, పాంక్రియటైటిస్, మూత్రపిండాల వ్యాధులు
తరగడానికి కారణం: లివర్ ఇన్‌సఫిసియన్సీ, పేగుల వ్యాధులు



మార్కెట్లకు ఎగ్జిట్ పోల్స్ కిక్

బుల్స్ స్వైర విహారం

- సరికొత్త శిఖరాలకు సూచీలు
- సెన్సెక్స్ 2,507 పాయింట్లు అప్.. 76,469 వద్ద ముగింపు
- 733 పాయింట్ల వృద్ధితో 23,264 స్థాయికి నిఫ్టీ
- సూచీలకు మూడేళ్లలో ఇదే అతిపెద్ద లాభం
- 14 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద
- రూ.425.91 లక్షల కోట్లు దాటిన బీఎస్ఈ మార్కెట్ క్యాప్

ముంబై: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ముచ్చటగా మూడోసారి భారీ మెజారిటీతో అధికారం చేపట్టనుందన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో స్టాక్ మార్కెట్ వర్గాల్లో ఉత్సాహం ఉప్పొంగింది. ఇన్వెస్టర్లు కొనుగోళ్ల సునామీ సృష్టించారు. దాంతో ప్రామాణిక ఈక్విటీ సూచీలు మూడేళ్లలో అతిపెద్ద లాభాన్ని నమోదు చేసుకోవడంతో పాటు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సోమవారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 2,507.47 పాయింట్ల (3.39 శాతం) లాభంతో 76,468.78 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు స్థాయిని నమోదు చేసింది. ఒక దశలో సూచీ 2,777.58 పాయింట్ల వరకు ఎగబాకి 76,738.89 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డునూ నమోదు చేసింది. నిఫ్టీ విషయానికొస్తే, ఒక దశలో 808 పాయింట్లు ఎగబాకి 23,338.70 వద్ద సరికొత్త ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 733.20 పాయింట్ల (3.25శాతం)లాభంతో 23,263.90 వద్ద స్థిరపడింది. 2021 ఫిబ్రవరి 1తర్వాత సెన్సెక్స్, నిఫ్టీకి ఇదే అతిపెద్ద ఒక్క రోజు లాభం. ఆసక్తికర విషయం ఏమిటంటే, 2019 మే 20న కూడా ఎన్డీఏ రెండోసారి అధికారంలోకి రానుందన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాతో సూచీలు 3శాతానికి పైగా పుంజుకున్నాయి. మార్కెట్ భారీ ర్యాలీతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులోనే రూ.13.78 లక్షల కోట్లకు పైగా పెరిగి సరికొత్త రికార్డు గరిష్ఠ స్థాయి రూ.425.91 లక్షల కోట్లకు (5.13 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. మరిన్ని ముఖ్యాంశాలు..

- ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంక్‌లు, అదానీ గ్రూప్ షేర్లు టాప్ పెర్ఫార్మర్లుగా నిలిచాయి. వీటితో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ల ర్యాలీ మార్కెట్లకు భారీ లాభాలు పంచాయి.
- సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 25 లాభపడ్డాయి. ప్రభుత్వ రంగ ఎన్‌టీపీసీ షేరు 9.21 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఎస్‌బీఐ 9 శాతం, పవర్‌గ్రిడ్ 8 శాతానికి పైగా పెరిగాయి. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 5.65 శాతం బలపడింది. కాగా, హెచ్‌సీఎల్ టెక్, సన్‌ఫార్మా, ఏషియన్ పెయింట్స్, నెస్లే, ఇన్ఫోసిస్ షేర్లు స్వల్ప నష్టాల్లో ముగిశాయి.
- బ్లూచిప్‌లతో పాటు చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లలోనూ ఇన్వెస్టర్లు కొనుగోళ్లను కదం తొక్కించారు. దాంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 3.54 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.05 శాతం పుంజుకున్నాయి. ఈ రెండు సూచీలూ ఇంట్రాడేలో సరికొత్త జీవితకాల గరిష్ఠాలను తాకాయి. బీఎస్ఈలోని అన్ని రంగాల సూచీలూ లాభపడ్డాయి.

ర్యాలీకి దోహదపడిన అంశాలు

- మోదీ సర్కారు మరోసారి అధికారంలోకి వస్తే ప్రస్తుత ఆర్థిక విధానాలు కొనసాగడంతో పాటు వికసిత్ భారత్ లక్ష్యాలకు దోహదపడేలా ఈ టర్మ్‌లో మరిన్ని కీలక సంస్కరణలు చేపట్టవచ్చన్న అంచనాలతో సూచీలు అద్భుతమైన ర్యాలీతో దూసుకుపోయాయి.
- గత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు 8.2 శాతానికి ఎగబాకడం, 2024-25లోనూ వృద్ధి రేటు 7శాతంగా నమోదుకావచ్చన్న అంచనాలు కూడా ఉత్సాహం నింపాయి.
- మే నెల జీఎస్‌టీ వసూళ్లు ఆశాజనకంగా నమోదవడం, నైరుతి రుతుపవనాలు చురుకుగా ముందుకు సాగుతుండటం, ప్యాసింజర్ వాహన విక్రయాలు కాస్త నెమ్మదించినప్పటికీ మార్కెట్ అంచనాలకు అనుగుణంగానే ఉండటమూ కలిసివచ్చింది.

ర్యాలీ కొనసాగితే 77,000 ఎగువకు సెన్సెక్స్

లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు అనుగుణంగా ఉన్నట్లయితే, ఈ నెల 4న (మంగళవారం) కూడా మార్కెట్లో ర్యాలీ కొనసాగనుంది. సెన్సెక్స్ 77,000, నిఫ్టీ 23,500 స్థాయిలను దాటవచ్చు.

\- సంతోశ్ మీనా, రీసెర్చ్ హెడ్, స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ లిమిటెడ్

రూ.20 లక్షల కోట్లకు చేరువలో అదానీ గ్రూప్ సంపద

ఎగ్జిట్ పోల్స్ ర్యాలీలో అదానీ గ్రూప్ షేర్లు మరింత పుంజుకున్నాయి. గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీల షేర్లూ లాభపడగా.. అదానీ పవర్ ఏకంగా 16 శాతం ఎగబాకింది. అదానీ పోర్ట్స్ 10.25 శాతం, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 8.84 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 7.77 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 6.86 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 6.39 శాతం, ఎన్‌డీటీవీ 6.15 శాతం, అంబుజా సిమెంట్స్ 5.72 శాతం, ఏసీసీ 5.16 శాతం, అదానీ విల్మర్ 3.51 శాతం పెరిగాయి. చాలా కంపెనీలు ఇంట్రాడేలో సరికొత్త గరిష్ఠాలను తాకాయి. కాగా, గ్రూప్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.లక్షన్నర కోట్ల మేర పెరిగి రూ.19.42 లక్షల కోట్లకు చేరుకుంది.

పీఎస్‌యూ షేర్లు జిగేల్

ప్రభుత్వ రంగ కంపెనీలు (పీఎస్‌యూ), ప్రభుత్వ రంగ బ్యాంక్ (పీఎస్‌బీ)ల షేర్లకు సోమవారం భారీ డిమాండ్ కన్పించింది. దాంతో ఈ రంగ షేర్లు 12 శాతం వరకు లాభపడ్డాయి. ఒక దశలో నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 8.72 శాతం మేర పెరిగి 8,030.15 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. సూచీలోని అన్ని పీఎస్‌బీల షేర్లూ భారీగా పుంజుకోగా.. బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎస్‌బీఐ, కెనరా బ్యాంక్ షేర్లు ఇంట్రాడేలో సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని తాకాయి. నిఫ్టీ సీపీఎస్ఈ ఇండెక్స్ సైతం 7 శాతానికి పైగా వృద్ధి చెంది 7,075 పాయింట్ల వద్ద సరికొత్త రికార్డు గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఈ సూచీలోని పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, ఓఎన్‌జీసీ, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు 10 శాతం వరకు పెరిగాయి. పవర్ గ్రిడ్, ఎన్‌టీపీసీ, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు సరికొత్త ఏడాది గరిష్ఠాన్నీ తాకాయి.

ఎస్‌బీఐ @ 8 లక్షల కోట్లు

దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) షేరు తొలిసారిగా రూ.900 మైలురాయిని దాటింది. ఒక దశలో రూ.912.10 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసిన ఎస్‌బీఐ షేరు.. చివరికి 9.12 శాతం లాభంతో రూ.905.80 వద్ద ముగిసింది. దాంతో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.8 లక్షల కోట్లు దాటింది. తద్వారా స్టాక్ మార్కెట్లో ఈ స్థాయి మార్కెట్ సంపదను సాధించిన ఏడో లిస్టెడ్ కంపెనీగా అవతరించింది.

50,000 ఎగువకు బ్యాంక్ నిఫ్టీ

ప్రభుత్వ రంగ బ్యాంక్‌లతో పాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి ప్రైవేట్ బ్యాంక్ షేర్లలోనూ భారీగా కొనుగోళ్లు జరగడంతో బ్యాంక్ నిఫ్టీ సూచీ 4 శాతానికి పైగా ఎగబాకి 50,979.95 పాయింట్లకు చేరుకుంది. ఇంట్రాడేలో 51,100 స్థాయిని తాకింది.

లక్ష కోట్లు పెరిగిన రిలయన్స్ సంపద

మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ షేరు దాదాపు 6 శాతం పెరిగి రూ.3,000 మైలురాయిని దాటేసింది. ఒక దశలో షేరు ధర రూ.3,029.90 వద్ద సరికొత్త ఆల్‌టైం గరిష్ఠాన్ని నమోదు చేసుకుంది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1.09 లక్షల కోట్లకు పైగా పెరిగి రూ.20.44 లక్షల కోట్లకు చేరుకుంది.

అరబిందో ఫార్మా నుంచి క్యాన్సర్ ఔషధం

హైదరాబాద్: అరబిందో ఫార్మా త్వరలో దేశీయ మార్కెట్లోకి సరికొత్త క్యాన్సర్ ఔషధాన్ని విడుదల చేయనుంది. ట్రాస్టుజుమాబ్ పేరుతో ఈ బయోసిమిలర్ ఔషధాన్ని మార్కెట్లోకి తీసుకురానుంది. కొన్ని రకాల రొమ్ము క్యాన్సర్ల చికిత్సలో ఈ ఔషధాన్ని వినియోగిస్తారు. అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ క్యూరాటెక్ బయోలాజిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఔషధాన్ని అభివృద్ధి చేసింది. అనుమతులు లభించిన వెంటనే ఉత్పత్తి ప్రారంభించి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో భాగంలో ఈ బయోసిమిలర్ క్యాన్సర్ ఔషధాన్ని దేశీయ మార్కెట్లోకి విడుదల చేయాలని భావిస్తున్నట్లు అరబిందో ఫార్మా బయోసిమిలర్స్ విభాగం సీఈఓ మక్కపాటి శాతకర్ణి తెలిపారు. అమెరికా, యూరోపియన్ దేశాల మార్కెట్లలోనూ ఈ బయోసిమిలర్ ఔషధాన్ని విడుదల చేసేందుకు కంపెనీ ప్రయత్నిస్తోంది.

జీనోమ్ వ్యాలీలో ఆరిజీన్ ఫార్మా యూనిట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ తన బయోలాజిక్స్ వ్యాపారాన్ని మరింతగా విస్తరించింది. ఇందులో భాగంగా కంపెనీ అనుబంధ సంస్థ ఆరిజీన్ ఫార్మాస్యూటికల్ సర్వీసెస్ లిమిటెడ్.. హైదరాబాద్ సమీపంలోని జీనోమ్ వ్యాలీలో కొత్త బయోలాజిక్స్ యూనిట్ ప్రారంభించింది. 70,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో ప్రాసెస్, అనలిటికల్ డెవలప్‌మెంట్ ల్యాబ్స్ ఇప్పటికే సిద్ధమయ్యాయి. ఉత్పత్తి యూనిట్ ఈ ఏడాది చివరికల్లా పూర్తవుతుందని కంపెనీ తెలిపింది.

సెబీ నుంచి సాథీ 2.0 యాప్

ముంబై: పెట్టుబడులపై మదుపరుల అవగాహన కోసం మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరో కీలక చర్య తీసుకుంది. 'సాథీ 2.0' పేరుతో ప్రత్యేక యాప్ విడుదల చేసింది. గూగుల్ ప్లే స్టోర్, ఐఓఎస్ యాప్‌స్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పెట్టుబడులకు సంబంధించిన సమస్త సమాచారం ఈ యాప్ ద్వారా పొందవచ్చు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,110 ▼	66,100 ▼	97,300 ▼
ముంబై	71,776 ▼	65,747 ▼	90,217 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	505	విజయవాడ	450
వరంగల్	507	గోదావరి	450
చిత్తూరు	563	విశాఖపట్నం	450
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	147	గోదావరి	149
వరంగల్	147	విజయవాడ	149
కరీంనగర్	147	గుంటూరు	149
మహబూబ్‌నగర్	147	ఒంగోలు	149
కర్నూలు	147	చిత్తూరు	140
విశాఖపట్నం	135		

హైదరాబాద్‌లో క్యాష్ఈ ఎక్సలెన్స్ సెంటర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఏఐ ఆధారిత ఫిన్‌టెక్ కంపెనీ క్యాష్ఈ హైదరాబాద్‌లో కొత్తగా టెక్నాలజీ ఎక్సలెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. డిజిటల్ ఇంజనీరింగ్ సామర్థ్యాలను విస్తరించటంలో భాగంగా ఈ సెంటర్‌ను నెలకొల్పుతున్నట్లు వెల్లడించింది. కాగా ప్రస్తుతం కంపెనీలో మొత్తం 550 ఉద్యోగులుండగా ఈ ఏడాది చివరి నాటికి కొత్తగా 300 మంది ఉద్యోగులను నియమించుకోనున్నట్లు క్యాష్ఈ తెలిపింది. ఇందులో 150 మంది ఉద్యోగులను హైదరాబాద్ కేంద్రం కోసం తీసుకోనుండగా మిగిలిన వారిని ముంబై కేంద్రంలో నియమించుకోనున్నట్లు పేర్కొంది.

బెటర్ న్యూట్రిషన్ బ్రాండ్‌లో పీవీ సింధు పెట్టుబడి

న్యూఢిల్లీ: రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత, షట్లర్‌లో ప్రపంచ చాంపియన్ పీవీ సింధు గ్రీన్‌డేకు చెందిన "బెటర్ న్యూట్రిషన్" బ్రాండ్‌లో ఇన్వెస్ట్ చేశారు. ఆ బ్రాండ్‌కు ప్రచారకర్తగా కూడా వ్యవహరించనున్నారు. సింధు సోమవారం ఈ విషయం ప్రకటించారు. అయితే ఎంత మేరకు పెట్టుబడులు పెట్టారనే విషయం మాత్రం వెల్లడించలేదు. గ్రీన్‌డే సంస్థ బయోఫోర్టిఫైడ్ ఆహారాల ద్వారా పోషకాహార లోపాలపై పోరాటానికి ఈ బ్రాండ్‌ను ప్రారంభించింది. దేశంలో పోషకాహార లోపాన్ని ఎదుర్కొనేందుకు కృషి చేస్తున్న బ్రాండ్‌లో తాను భాగస్వామి కావడం ఆనందకరమైన అంశమని సింధు తెలిపారు. అహ్మదాబాద్ ఐఐఎం పూర్వ విద్యార్థులైన రస్తోగి, ఐశ్వర్య భట్నాగర్ గ్రీన్‌డే సంస్థను ఏర్పాటు చేశారు.

ఏఎం గ్రీన్‌లో నాగార్జున ఫెర్టిలైజర్స్ విలీనం

సర్పవరం జంక్షన్: కాకినాడలోని నాగార్జున ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్‌సీఎల్) కర్మాగారం యాజమాన్యం మారింది. రాష్ట్రంలోనే యూరియా ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన ఎన్ఎఫ్‌సీఎల్ గత కొన్నేళ్లుగా నష్టాల బారిన పడడంతో పలుమార్లు మూతపడింది. 1985లో కాకినాడలో ఎన్ఎఫ్‌సీఎల్ ఎరువుల కర్మాగారాన్ని కేవీకే రాజు ఏర్పాటు చేశారు. గాలి, నీరు సహజవాయువుతో యూరియాను ఉత్పత్తి చేసే ప్లాంట్‌గా ఎన్ఎఫ్‌సీఎల్‌కు గుర్తింపు ఉంది. మరోవైపు యూరియా ఉత్పత్తికి కేంద్రం రాయితీలు ఇచ్చినప్పటికీ కంపెనీ నష్టాల నుంచి బయటపడలేకపోయింది. దీంతో ఎన్ఎఫ్‌సీఎల్‌ను అమెరికాకు చెందిన ఏఎం గ్రీన్ అమ్మోనియా (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ చేజిక్కించుకుంది. తాజాగా కొనుగోలు ప్రక్రియ అంతా పూర్తి కావటంతో ఏఎం గ్రీన్‌లో ఎన్ఎఫ్‌సీఎల్ విలీనమైంది. ఈ నెల 1 నుంచి ఈ విలీనం అధికారికంగా అమల్లోకి వచ్చింది.

లంక విలవిల

77 పరుగులకే ఆలౌట్

నోకియా అద్భుత స్పెల్
దక్షిణాఫ్రికా బోణీ



నోకియా (4-0-7-4)

1 టీ20 ప్రపంచకప్‌ల్లో అత్యల్ప ఎకానమీ రేట్ (1.75) నమోదు చేసిన నోకియా

న్యూయార్క్: రెండు టెస్టు దేశాల మధ్య జరిగిన ఈ మ్యాచ్ మొత్తంలో నమోదైన పరుగులు 157 మాత్రమే.. కానీ నేలకూలిన వికెట్లు 14. ఇలా బౌలర్లు రాజ్యమేలిన పోరులో చివరకు దక్షిణాఫ్రికాదే పైచేయి అయ్యింది. పేసర్లు నోకియా (4-0-7-4), బార్ట్‌మన్ (4-1-9-1) అద్భుత బౌలింగ్‌కు శ్రీలంక తమ అత్యల్ప స్కోరుకే దాసోహమైంది. అటు ఛేదన ఆరంభంలో తడబడినా 6 వికెట్ల తేడాతో గెలిచిన సఫారీలు తాజా టీ20 వరల్డ్‌కప్‌లో బోణీ చేశారు. సోమవారం జరిగిన ఈ గ్రూప్ 'డి' మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 19.1 ఓవర్లలో 77 పరుగులకు కుప్పకూలింది. ఓపెనర్ కుశాల్ మెండిస్ (19), మాథ్యూస్ (16), కమిందు (11) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించడం గమనార్హం. రబాడ, మహరాజ్ రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత ఛేదనలో దక్షిణాఫ్రికా 16.2 ఓవర్లలో 4 వికెట్లకు 80 పరుగులు చేసి గెలిచింది. డికాక్ (20), క్లాసెన్ (19 నాటౌట్) రాణించారు. కెప్టెన్ వనిందు హసరంగకు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నోకియా నిలిచాడు.

ఆచితూచి..

78 పరుగుల స్వల్ప ఛేదనలో సఫారీల ఇన్నింగ్స్ కూడా కష్టంగానే సాగింది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించకపోవడంతో ఆచితూచి ఆడాల్సి వచ్చింది. పవర్‌ప్లేలోనే ఓపెనర్ హెన్‌డ్రిక్స్ (4), కెప్టెన్ మార్‌క్రమ్ (12) వెనుదిరగ్గా 27/2 స్కోరుతో నిలిచింది. స్పిన్నర్లు కట్టడి చేయడంతో పరుగులు మందగించాయి. దీనికితోడు హసరంగ వరుస ఓవర్లలో డికాక్, స్టబ్స్ (13)ల వికెట్లు తీసి తీవ్ర ఒత్తిడిలోకి నెట్టాడు. అప్పటికి స్కోరు 58/4. అయితే లక్ష్యం తక్కువగానే ఉండడంతో సౌతాఫ్రికా పెద్దగా ఇబ్బందిపడలేదు. క్లాసెన్ 15వ ఓవర్‌లో 6,4తో ఒత్తిడి తగ్గించి జట్టు విజయాన్ని సునాయాసం చేశాడు. దీంతో మరో 22 బాల్స్ ఉండగానే మ్యాచ్ ముగిసింది.

నోకియా కట్టడి..

టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న లంక.. సఫారీ బౌలర్ల ధాటికి అటు పరుగులు చేయలేక, ఇటు పేలవ షాట్లతో వికెట్లనూ కాపాడుకోలేక విలవిల్లాడింది. ముఖ్యంగా నోకియా, బార్ట్‌మన్‌ల ధాటికి లంకేయులు ఒక్కో పరుగు కోసం చెమటోడ్చాల్సి వచ్చింది. పవర్‌ప్లేలో 24/1 స్కోరు చేసిన లంక ఆ తర్వాత మరింతగా ఇబ్బంది పడింది. స్పిన్నర్ కేశవ్ మహరాజ్ తొమ్మిదో ఓవర్‌లో హసరంగ, సమరవిక్రమలను వరుస బంతుల్లో డకౌట్‌గా పంపాడు. అటు నోకియా వరుస ఓవర్లలో వికెట్లను తీస్తూ ప్రత్యర్థిపై ఉచ్చు బిగించాడు. ఈ దశలో రెండు సిక్సర్లతో మాథ్యూస్ కాస్త జోరు చూపినా, ఎక్కువ సేపు నిలువలేకపోయాడు. మరోవైపు 9 పరుగుల వ్యవధిలోనే ఆఖరి 4 వికెట్లు నేలకూలడంతో లంక కనీసం వంద పరుగులు చేయలేకపోయింది.

టీ20ల్లో శ్రీలంక జట్టుకు ఇదే అత్యల్ప స్కోరు (77) **1**

శ్రీలంక: 19.1 ఓవర్లలో 77 ఆలౌట్ (మెండిస్ 19, మాథ్యూస్ 16; నోకియా 7/4, రబాడ 2/21, కేశవ్ 2/22). **దక్షిణాఫ్రికా:** 16.2 ఓవర్లలో 80/4 (డికాక్ 20, క్లాసెన్ 19 నాటౌట్; హసరంగ 2/22).

స్పోర్ట్స్

చాంపియన్‌కు రూ. 20.35 కోట్లు

• రన్నరప్‌నకు రూ. 10.65 కోట్లు • మొత్తం ప్రైజ్‌మనీ రూ. 93.50 కోట్లు • గతం కంటే రెట్టింపు

న్యూయార్క్: ఈసారి టీ20 ప్రపంచ కప్ విజేతలకు ఇచ్చే ప్రైజ్‌మనీని ఐసీసీ ఎట్టకేలకు ప్రకటించింది. అంతేకాదు.. గత వరల్డ్ కప్ కంటే ఈసారి మొత్తం ప్రైజ్‌మనీని భారీగా పెంచింది. ఈ వరల్డ్‌కప్ మొత్తం ప్రైజ్‌మనీ రూ. 93.52 కోట్లుగా సోమవారం వెల్లడించింది. 2022 ప్రపంచ కప్ మొత్తం ప్రైజ్‌మనీ రూ. 46.55 కోట్లు కాగా.. ఈసారి ఆ మొత్తాన్ని రెట్టింపు చేసింది. ఇక తాజా కప్పులో చాంపియన్‌గా నిలిచే జట్టు రూ. 20.36 కోట్లు అందుకోనుంది. గత టోర్నీలో విజేత ఇంగ్లండ్ జట్టుకు రూ. 13.30 కోట్లు దక్కాయి. ఇక ఈసారి రన్నరప్‌కు రూ. 10.65 కోట్లు లభిస్తాయి. క్రితంసారి ఫైనల్లో ఓడిన పాకిస్థాన్ రూ. 6.65 కోట్లతో సరిపెట్టుకుంది.

టీ20 ప్రపంచ కప్ ప్రైజ్‌మనీ వివరాలివి..

- సెమీఫైనల్స్‌లో ఓడిన రెండు జట్లకు: చెరి 6.55 కోట్లు
- సూపర్-8లో ఓడిన జట్లకు: తలో రూ. 3.18 కోట్లు
- 9 నుంచి 12 స్థానాల్లో నిలిచే ప్రతీ జట్టుకు: రూ. 2.05 కోట్లు
- 13 నుంచి 20 స్థానాలు: ఒక్కో జట్టుకు రూ. 1.87 కోట్లు
- సెమీఫైనల్స్, ఫైనల్ మినహా ఇతర మ్యాచ్‌ల్లో ఒక్కో విజయానికి తలో రూ. 26 లక్షలు అదనం.

నేటి మ్యాచ్‌లు (స్టార్ స్పోర్ట్స్‌లో..)

మ్యాచ్	వేదిక	సమయం
అఫ్ఘానిస్థాన్ x ఉగాండ	వేదిక: గయానా	ఉ. 6 నుంచి
ఇంగ్లండ్ x స్కాట్లాండ్	వేదిక: బార్బడోస్	రా. 8 నుంచి
నెదర్లాండ్స్ x నేపాల్	వేదిక: డాలస్	రా. 9 నుంచి

నమీబియా 'సూపర్'

ఒమన్‌కు నిరాశ
వీజ్ ఆల్‌రౌండ్‌షో



డేవిడ్ వీజ్ (3/28, 9 నాటౌట్)

బ్రిడ్జ్‌టౌన్: పేరుకు పసికూనలే అయినా తాజా టీ20 వరల్డ్‌కప్‌లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాయి. టోర్నీ తొలి రోజు కెనడాపై అమెరికా భారీ స్కోరును ఛేదించగా.. ఆదివారం పటిష్ఠ వెస్టిండీస్‌ను పపువా న్యూగినీ ముప్పుతిప్పలు పెట్టిన విషయం తెలిసిందే. ఇక సోమవారం ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన నమీబియా-ఒమన్ మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీసింది. అయితే నమీబియా ఆల్‌రౌండర్ డేవిడ్ వీజ్ అంతా తానై (3/28, 9 నాటౌట్; సూపర్ ఓవర్‌లో 13 నాటౌట్, 1/10) జట్టుకు విజయాన్నందించాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఒమన్ 19.4 ఓవర్లలో 109 పరుగులకు ఆలౌటైంది. పేసర్ ట్రంపెల్‌మన్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత స్వల్ప ఛేదనలో నమీబియా కూడా తడబడి 20 ఓవర్లలో 6 వికెట్లకు సరిగ్గా 109 పరుగులే చేసింది. ఫ్రిలింక్ (45) టాప్‌స్కోరర్. పేసర్ మెహ్రాన్ ఖాన్ (3-1-7-3) వణికించాడు. దీంతో సూపర్ ఓవర్ అనివార్యం కాగా వీజ్ 4,6 ఎరాస్మస్ 4,4తో నమీబియా 21 పరుగులు చేసింది. ఆ తర్వాత వీజ్ బౌలింగ్‌కు దిగి 10 పరుగులే ఇచ్చి వికెట్ తీయడంతో ఒమన్‌కు ఓటమి తప్పలేదు.

1 అంతర్జాతీయ టీ20ల్లో తొలి ఓవర్ మొదటి రెండు బంతుల్లో వికెట్లు తీసిన ఏకైక బౌలర్‌గా ట్రంపెల్‌మన్.

టీ20 వరల్డ్‌కప్‌లో సూపర్ ఓవర్‌లో ఫలితం రావడం ఇది మూడోసారి. 2012లోనే రెండుసార్లు జరిగింది. **3**

సంక్షిప్త స్కోర్లు

ఒమన్: 19.4 ఓవర్లలో 109 ఆలౌట్ (ఖాలిద్ 34, జీషన్ 22; ట్రంపెల్‌మన్ 4/21, వీజ్ 3/28);
నమీబియా: 20 ఓవర్లలో 109/6 (ఫ్రిలింక్ 45, డావిన్ 24; మెహ్రాన్ 3/7).

సాత్విక్ జోడీ టైటిల్ నిలబెట్టుకునేనా..?

నేటినుంచి ఇండోనేసియా ఓపెన్

జకార్తా: వచ్చే నెలలో ఒలింపిక్స్..ఈనేపథ్యంలో భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి నిలకడైన ఫామ్‌ను కొనసాగించడమే లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ క్రమంలో మంగళవారం ఇక్కడ మొదలయ్యే ఇండోనేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో టైటిల్ నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో ఉంది. నిరుడు ఇక్కడ విజేతగా నిలిచిన సాత్విక్/చిరాగ్ సూపర్ 1000 టైటిల్ అందుకున్న తొలి భారత డబుల్స్ జోడీగా చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. ఈసారి ఆరంభ మ్యాచ్‌లో వీ చాంగ్/కీ వున్ (మలేసియా) ద్వయంతో సాత్విక్ జంట తలపడనుంది. సింగిల్స్‌లో తైపీకి చెందిన వెన్ చీ స్యూతో సింధు, కెంటా సునయామాతో లక్ష్యసేన్, రజావత్‌తో ప్రణయ్ తొలి రౌండ్ ఆడనున్నారు. కిడాంబి శ్రీకాంత్, కిరణ్ జార్జ్ కూడా బరిలో ఉన్నారు. డబుల్స్‌లో తనీషా/అశ్విని, గాయత్రి/ట్రీసా కూడా అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

కేదార్ జాదవ్ రిటైర్మెంట్



న్యూఢిల్లీ: భారత ఆల్‌రౌండర్ కేదార్ జాదవ్ అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేసే కేదార్ ఆఫ్‌స్పిన్నర్‌గానూ రాణించాడు. 2014-2020 మధ్య జాదవ్ ఆడిన 73 వన్డేల్లో 1,389 రన్స్, 27 వికెట్లు తీయగా.. 9 టీ20ల్లో 122 పరుగులు సాధించాడు. 'కెరీర్ ఆసాంతం నాకు మద్దతుగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు. మధ్యాహ్నం 3 గంటల నుంచి నన్ను అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఆటగాడిగా భావించండి' అని 39 ఏళ్ల కేదార్ సోమవారం ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. మహారాష్ట్ర తరఫున రంజీల్లో ఆడిన కేదార్ 87 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో తలపడ్డాడు.

అప్పటిదాకా.. బజ్‌రంగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేత



న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్ బజ్‌రంగ్ పూనియాపై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) విధించిన సస్పెన్షన్‌ను తాత్కాలికంగా ఎత్తివేస్తున్నట్టు నాడా క్రమశిక్షణ కమిటీ (ఏడీడీపీ) సోమవారం ప్రకటించింది. మార్చిలో జరిగిన సెలెక్షన్ ట్రయల్స్ సందర్భంగా డోప్ పరీక్షకు తన శాంపిల్ ఇవ్వకుండా వెళ్లడంతో బజ్‌రంగ్‌పై నాడా సస్పెన్షన్ విధించిన సంగతి తెలిసిందే. అయితే, పరీక్షల కోసం నాడా అధికారులు గడువు దాటిన కిట్‌లను వాడడంతో తాను యూరిన్ శాంపిల్ ఇచ్చేందుకు నిరాకరించానంటూ ఏడీడీపీ ముందు హాజరై బజ్‌రంగ్ వివరణ ఇచ్చుకున్నాడు. అంతేకాదు.. గడువు ముగిసిన కిట్‌లను ఎందుకు వాడుతున్నారన్న తన ప్రశ్నకు నాడా ఇప్పటికీ బదులివ్వలేదని, ఈ విషయంలో న్యాయ పోరాటం చేస్తున్నానని రెజ్లర్ కమిటీకి వివరించాడు. దీంతో నాడా తదుపరి నోటీసులు ఇచ్చేదాకా బజ్‌రంగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్టు ఏడీడీపీ తెలిపింది.

డీడీలోనూ వరల్డ్‌కప్ మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: భారత జట్టు ఆడే టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారాన్ని దూరదర్శన్‌లోనూ వీక్షించవచ్చు. ఈ విషయాన్ని ప్రసారభారతి సీఈవో గౌరవ్ ద్వివేది సోమవారం వెల్లడించారు. టీ20 వరల్డ్‌కప్‌తో పాటు త్వరలో జరిగే పారిస్ ఒలింపిక్స్, పారాలింపిక్స్, వింబుల్డన్ ఈవెంట్లను కూడా డీడీ స్పోర్ట్స్ చానెల్‌లో ప్రసారం చేయనున్నట్టు ద్వివేది తెలిపారు. అలాగే జూలై 6 నుంచి జింబాబ్వేతో భారత్ ఆడే 5 టీ20ల సిరీస్, వచ్చేనెల 27 నుంచి శ్రీలంకతో భారత్ తలపడే పరిమిత ఓవర్ల సిరీస్‌లను కూడా డీడీ ప్రసారం చేయనుంది.

మెద్వెదెవ్‌కు షాక్

ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో ఐదో సీడ్ మెద్వెదెవ్‌కు షాక్ తగిలింది. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ నాలుగో రౌండ్‌లో 11వ సీడ్ అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా) 4-6, 6-2, 6-1, 6-3తో రష్యా స్టార్ మెద్వెదెవ్‌ను కంగుతినిపించగా.. రెండో సీడ్ సిన్నర్ 2-6, 6-3, 6-2, 6-1తో మౌటెట్‌పై నెగ్గి క్వార్టర్స్ చేరాడు. మహిళల సింగిల్స్‌లో 2వ సీడ్ సబలెంకా 6-2, 6-3తో ఎమ్మా నవారోను, 4వ సీడ్ రిబకినా 6-4, 6-3తో 15వ సీడ్ స్విటోలినాను చిత్తు చేసి క్వార్టర్స్‌లో ప్రవేశించారు.

బోపన్న జోరు: భారత డబుల్స్ స్టార్ రోహన్ బోపన్న క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. మూడో రౌండ్‌లో రెండో సీడ్ బోపన్న/మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 6-7 (2), 6-3, 7-6 (10-8)తో భారత్‌కే చెందిన శ్రీరామ్ బాలాజీ/మార్టినెజ్ (మెక్సికో)జోడీపై సూపర్ టై బ్రేకర్‌లో గెలిచింది.

తుపాకీ నీడన ఇండో-పాక్ మ్యాచ్?

న్యూయార్క్: ఇండో-పాక్ మ్యాచ్‌కు ఉగ్ర ముప్పు పొంచి ఉందనే వార్తలు రావడంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. 8 మ్యాచ్‌లకు వేదికైన ఐసెన్ హోవర్ పార్క్ స్టేడియంలో మ్యాచ్‌ల సమయంలో ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు పోలీసులు చర్యలు తీసుకొంటున్నారు. ఈ క్రమంలో స్పెషలిస్ట్ స్నైపర్లను కూడా మోహరించినట్టు సమాచారం. ప్రస్తుతం స్టేడియం వద్ద 24 గంటలూ గస్తీ కాస్తున్నారు. ఆదివారం ఇక్కడ జరిగే మ్యాచ్‌లో భారత్, పాక్ తలపడనున్నాయి.



కర్నూలులోని రాయలసీమ వర్సిటీలోని మంత్రాలయం కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసుల పహారా

హై అలర్ట్!

ఓట్ల లెక్కింపునకు భద్రత కట్టుదిట్టం

రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్, యాక్ట్ 30

అమరావతి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి హింసాత్మక ఘటనలకు అవకాశం ఇవ్వకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. కౌంటింగ్ కేంద్రాలు, ప్రధాన కూడళ్లు, రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద భారీ సంఖ్యలో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ సందర్భంగా హింసాత్మక ఘటనలు జరిగిన పల్నాడు ప్రాంతంలో పోలీసులు డ్రోన్లతో నిఘా పెట్టి శాంతి భద్రతల్ని పర్యవేక్షిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాలను రెడ్ జోన్లుగా ప్రకటించి మూడంచెల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్‌తోపాటు 30 పోలీసు యాక్టు అమలు చేస్తున్నారు. కేంద్రం నుంచి 57 కంపెనీల బలగాలను రాష్ట్రానికి రప్పించి అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో మోహరించారు. సీఆర్‌పీఎఫ్ ఐజీ చారు సిన్హా సోమవారం విజయవాడకు వచ్చి ఇక్కడి పరిస్థితులను ఏపీ పోలీసులతో సమన్వయం చేసుకుని సాయుధ బలగాలకు దిశా నిర్దేశం చేశారు. అల్లర్లకు పాల్పడే వారిని ముందుగా గుర్తించి స్థానిక పోలీసులు బైండోవర్ చేశారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా హెచ్చరించారు. "కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో ఇతరులను బెదిరించి సమాజంలో అశాంతి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. అలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోం. ఐటీ చట్టం కింద కేసులు నమోదు చేయడంతోపాటు రౌడీ షీట్లు తెరుస్తాం. పీడీ యాక్టు ప్రయోగించి ఉక్కుపాదంతో అణచి వేస్తాం" అని గట్టిగా హెచ్చరించారు. రెచ్చగొట్టే పోస్టులు ఎవరు పెడుతున్నారు? ఎవరు వ్యాప్తి చేస్తున్నారనే విషయంపై నిరంతర నిఘా పెట్టామన్నారు. పోలీసుల డేగ కన్ను నుంచి ఎవరూ తప్పించుకోలేరని డీజీపీ తెలిపారు.

మద్య షాపుల బంద్

రాష్ట్ర వ్యాప్తంగా కౌంటింగ్‌ను దృష్టిలో పెట్టుకుని మద్యం దుకాణాలను మూసి వేయించినట్టు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. అనధికార మద్యం విక్రయాలపైనా నిఘా పెట్టి చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. బాణాసంచా విక్రయాలపై నిషేధం విధించామన్నారు. అనధికార నిల్వలపై దృష్టి పెట్టినట్టు చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా కెమెరాలు ఏర్పాటు చేసి జిల్లా ఎస్పీ కార్యాలయాల నుంచి పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇతర ప్రాంతాల వ్యక్తులు ఎవరు వచ్చినా సహేతుక కారణం లేకుంటే చెక్ పోస్టుల వద్ద అనుమతించడం లేదని తెలిపారు. లాడ్జీలు, హోటళ్లు ఎక్కడికక్కడ తనిఖీ చేస్తూ కొత్త వ్యక్తులను సోమవారమే పంపించేశారు.

వజ్ర వాహనాలు సిద్ధం

హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు మొత్తం 1,985 సున్నిత, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించిన పోలీసు శాఖ ఆయా ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి డీఎస్పీ, సీఐ స్థాయి అధికారులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు సిబ్బందికి బాడీ వార్న్ కెమెరాలు అమర్చి వీడియోలు చిత్రీకరిస్తున్నారు. ప్రజలు గుంపులుగా ఏర్పడకుండా నియంత్రణ చర్యలకు పోలీసు బృందాలతో పాటు గ్యాస్ స్క్వాడ్‌లు, జల ఫిరంగులతో కూడిన వజ్ర వాహనాలను రంగంలోకి దింపారు. ప్రతి జిల్లా ఎస్పీ పరిధిలో క్విక్ రెస్పాన్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేసి, ఏ క్షణం ఎక్కడ అవసరమైనా అత్యంత వేగంగా చేరుకోవడానికి ప్రత్యేక వాహనాలు సిద్ధం చేశారు. పెట్రోలు బంకుల్లో లూజ్ విక్రయాలు జరపకుండా నిషేధాన్ని అమలు చేస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. గత కొన్ని రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించి అణువణువూ శోధించామని, ఎటువంటి అల్లర్లకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. కాగా, హింసకు పాల్పడే వ్యక్తులను ఏరిపారేసేందుకు కాల్చివేత ఆదేశాల కోసం పోలీసు శాఖ ఎన్నికల సంఘం అనుమతి కోరినట్లు తెలిసింది. అయితే, క్షేత్ర స్థాయిలో జిల్లాల కలెక్టర్లు నిరంతరం అందుబాటులో ఉంటారని, పరిస్థితి చేయి దాటితే కలెక్టర్లను సంప్రదించాలని పోలీసు శాఖకు ఎన్నికల సంఘం సూచించినట్టు సమాచారం. ఇదేసమయంలో జిల్లాల ఎస్పీల ఫోన్లకు తక్షణమే స్పందించాలంటూ కలెక్టర్లను ఆదేశించినట్లు తెలిసింది.

నేడే విడుదల

23 రోజుల పోల్ ఉత్కంఠకు తెర

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఓటు సునామీతో చరిత్ర సృష్టించిన రాష్ట్రం, పోలింగ్ ఫలితాల వెల్లువకు సిద్ధమైంది. 23 రోజులుగా ఈవీఎంల్లో నిక్షిప్తమైన ఓటరు తీర్పు వెలువడే సమయం వచ్చేసింది. దాదాపు 50 రోజులకుపైగా ప్రచారంలో గడిపిన అభ్యర్థుల భవితవ్యం మరికొన్ని గంటల్లోనే తేలిపోనుంది. ఫలితాల టెన్షన్‌తో గడుపుతున్న పార్టీల్లో, ఎగ్జిట్ పోల్స్ తీరుతో ఒక్కసారిగా హైటెన్షన్ మొదలైంది. ఏపీ చరిత్రలోనే రికార్డు స్థాయి ఓటు పడటం ఈ టెన్షన్‌ను తారస్థాయికి చేర్చింది. మహిళా ఓటు అత్యధికంగా నమోదైన ఎన్నికలు కూడా ఇవే. దీంతో వారిచ్చే తీర్పుపైనే సర్వత్రా ఉత్కంఠ నెలకుంది. పోస్టల్ బ్యాలెట్‌తో ఉద్యోగులు పోటెత్తారు. వారి అభిమతం ఏమిటనేదే అంతటా ఆసక్తి రేపుతోంది! మంగళవారం జరిగే కౌంటింగ్ కోసం పూర్తి ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా వెల్లడించారు.

ఈవీఎం ఓట్లు 3.33 కోట్లు...

రాష్ట్రంలో మొత్తం ఓటర్లు 4,13,33,702 మంది. వారిలో 3,33,40,560 మంది ఓటర్లు ఈవీఎంల్లో తమ తీర్పును భద్రపరిచారు. వీరిలో అత్యధికంగా మహిళలు 1,69,08684 మంది ఓటు వేయడం విశేషం. పురుషులు 1,64,30,359 మంది, థర్డ్‌జెండర్లు 1517 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోస్టల్ బ్యాలెట్ 5.15 లక్షలు

రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌తో ఓటెత్తారు. బ్యాలెట్ ద్వారా 5.15 లక్షలమంది (1.2 శాతం) ఓటు హక్కు వినియోగించుకోగా, ఇందులో 92 నుంచి 93 శాతం మంది ఉద్యోగులే ఉండటం గమనార్హం. ఉద్యోగులు, అత్యసవర సర్వీసుల్లో ఉన్న ఉద్యోగులు అత్యధికంగా 461,945 లక్షల మంది ఉన్నారు. ఇక..85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు 26,473 మంది (85శాతం), సర్వీసు ఓటర్లు 26,721 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కౌంటింగ్ కేంద్రాలివే...

రాష్ట్ర వ్యాప్తంగా 33 ప్రాంతాలు...401 హాళ్లలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు 2,446 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు 557 టేబుళ్లు సిద్ధం చేశారు. పార్లమెంటు నియోజకవర్గాలకు 2,443 ఈవీఎం టేబుళ్లు, 443 పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లు ఏర్పాటుచేశారు. 25,209 మంది ఉద్యోగులు కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొననున్నారు. 119 మంది అబ్జర్వర్లు, ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్, ఉంటారు.

కౌంటింగ్ ప్రక్రియ ఇలా...

మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ముందుగా

అసెంబ్లీ స్థానాలు	175
పార్లమెంటు నియోజకవర్గాలు	25
లెక్కించాల్సిన ఓట్లు	3,33,40,560
మహిళలు	1,69,08,684
పురుషులు	1,64,30,359
థర్డ్ జెండర్లు	1,517

పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తారు. ఆ ప్రక్రియ ఎనిమిది గంటలకు మొదలై అరగంట కొనసాగుతుంది. ఆ తర్వాత నుంచి ఈవీఎల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం అవుతుంది. అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్లకు, ఈవీఎంలకు హాళ్లు వేరుగా ఉండవు. కానీ, పార్లమెంటు నియోజకవర్గాల్లో వేర్వేరు హాళ్లు ఉండటంతో.. ఉదయం ఎనిమిది గంటల నుంచి అటు ఈవీఎంలు, ఇటు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఒకేసారి మొదలు పెడతారు.

ఒక్కో రౌండ్ 20, 25 నిమిషాలు..

మొదటి రౌండ్ ఫలితం వెల్లడికి 30,35 నిమిషాలు పడుతుంది. ఆ తర్వాత నుంచి ప్రతి 20,25 నిమిషాలకు ఒక రౌండ్ ఫలితం వెలువడుతుంది. ఇక.. పోస్టల్ బ్యాలెట్లు ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఒక రౌండ్ ఫలితం వెలువడానికి 2 గంటల నుంచి రెండున్న గంటల సమయం కూడా పట్టవచ్చు.

111 నియోజకవర్గాల్లో 5 గంటల్లో ఫలితాలు..

కౌంటింగ్ మొదలైన ఐదుగంటల్లోనే 111 అసెంబ్లీ నియోజకవర్గాల ఫలితం తేలిపోతుంది. 20 రౌండ్ల లోపే తీర్పు తెలిసిపోతుంది. ఇక.. 61 నియోజకవర్గాల్లో 21 నుంచి 24 రౌండ్లు, 3 నియోజకవర్గాల్లో 25 రౌండ్లకుపైగానే కౌంటింగ్ సాగనుంది. అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్ల విషయంలో 102 నియోజకవర్గాల్లో 1 నుంచి 2 రౌండ్లు, 48 నియోజకవర్గాల్లో 3 రౌండ్లు, 25 నియోజకవర్గాల్లో 4 రౌండ్ల కౌంటింగ్ ఉండనుంది.

తొలి ఫలితం కొవ్వూరు, నరసాపురం

111 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మధ్యాహ్నం ఒంటి గంట కల్లా తుది ఫలితాలు వెలువడతాయి. కొవ్వూరు, నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి తొలి విజేతల ప్రకటన ఉంటుంది. ఈ రెండు చోట్ల అత్యల్పంగా 13 రౌండ్లలోనే ఫలితం తెలిసిపోతుంది. ఇక...అత్యధికంగా భీమిలి, పాణ్యం నియోజకవర్గాల్లో 26 రౌండ్లు ఉండడంతో ఫలితాలు వెలువడడానికి 9 నుంచి 10 గంటలు పట్టే అవకాశం ఉంది. అదేవిధంగా రాజమహేంద్రవరం, నరసాపురం లోక్‌సభ నియోజకవర్గాల్లో 13 రౌండ్లు ఉన్నాయి. ఇక్కడ ఫలితాల వెల్లడికి ఐదు గంటల సమయం పడుతుంది. అదే విధంగా అమలాపురం పార్లమెంటులో లెక్కింపునకు 27 రౌండ్లు పడుతుంది., ఫలితాలు వచ్చేందుకు 9 గంటల సమయం పడుతుంది. సాయంత్రం 6 గంటలకు ఇక్కడ ఫలితం తేలుతుంది.


చిత్తూరులోని నగరి నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు

కౌంటింగ్ కేంద్రాల్లో

అల్లరి చేస్తే జైలుకే

- పదేపదే కోరితే రీకౌంటింగ్‌కు అనుమతించం
- ప్రతి రౌండ్‌కూ ఆక్షేపణ తెలపడం కుదరదు
- ఏజెంట్లు ఎన్నికల రూల్స్ పాటించాల్సిందే
- రెడ్‌జోన్‌లోకి కౌంటింగ్ కేంద్రాలు..144 సెక్షన్
- 42వేల పోలీసులు, 67కంపెనీల బలగాలతో భద్రత : మీనా

కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు అల్లరి సృష్టించాలని ప్రయత్నం చేస్తే బయటకు పంపుతామని, కేసు పెట్టి జైలుకు కూడా పంపుతామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్‌కుమార్ మీనా హెచ్చరించారు. ఏజెంట్లు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని స్పష్టం చేశారు. ఏదైనా అనుమానం ఉంటే నిర్దేశిత విధానంలో ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. సరైన కారణాలు ఉంటేనే రీ కౌంటింగ్‌కు అనుమతి ఇస్తామని, మళ్లీ మళ్లీ కోరితే లెక్కలోకి తీసుకోబోమన్నారు. ప్రతి రౌండ్‌లో రీకౌంటింగ్ అడగటానికి వీల్లేదని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత... కారణం సహేతుకమైనదే అయితే ఆర్వో స్పీకింగ్ ఆర్డర్ ఇస్తారన్నారు. అభ్యర్థులు కూడా ఏదైనా అనుమానం ఉంటే నిబంధనల ప్రకారం ఫిర్యాదు చేయవచ్చునని కోరారు. కౌంటింగ్ రోజు ఫలితాల వెల్లడి తర్వాత ఊరేగింపులకు అనుమతి ఉండబోదని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియలో అటెస్టేషన్ అధికారి సంతకంపై ఆక్షేపణ తెలపడానికి వీల్లేదన్నారు. కౌంటింగ్ రోజు తర్వాత కూడా 144 సెక్షన్



విలేకరులతో మాట్లాడుతున్న సీఈవో మీనా

కొనసాగించాలా వద్దా అనేది జిల్లాల కలెక్టర్లు పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటారన్నారు. 67 కంపెనీల సాయుధ భద్రతా బలగాలను కౌంటింగ్ కేంద్రాలు, శాంతిభద్రతల కోసం వినియోగిస్తున్నామని మీనా చెప్పారు. కౌంటింగ్ కేంద్రం రెడ్ జోన్ పరిధిలో ఉంటుందని, డ్రోన్ల ద్వారా నిఘా పెడతామని తెలిపారు. "ఎన్నికల రోజు, ఆ తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలపై ఈసీ సీరియస్‌గా ఉంది. ఆ ఘటనలపై తీవ్ర చర్యలు తీసుకున్నాం. అయితే, కౌంటింగ్ రోజు అలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశాం. రాష్ట్రంలో 1985 సున్నితమైన, సమస్యాతక ప్రాంతాలను గుర్తించాం. సమస్యలు సృష్టించే 12 వేల మందిని గుర్తించి బైండోవర్ చేశాం. పోలీస్ పికెట్లు పెట్టాం. క్యూఆర్టీ టీమ్‌లు రంగంలో ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 45 వేల మంది పోలీసు సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉంటారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 83 నియోజకవర్గాలను సున్నితమైన నియోజకవర్గాలుగా గుర్తించి, అక్కడ సీనియర్ పోలీస్ అధికారులను నియమించాం. జనవరి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో అక్రమంగా తరలిస్తున్న రూ.483 కోట్లు విలువైన నగదు, మద్యం తదితరాలను పట్టుకున్నాం. సీ-విజిల్ యాప్ ద్వారా భారీ ఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. ఏపీలో ఈస్థాయిలో పోలింగ్ ఎప్పుడూ జరగలేదు. క్లీనెస్ట్ లిస్ట్ తయారు చేశాం" అని తెలిపారు.

పోస్టల్ సునామీ...

పోలైన పోస్టల్ బ్యాలెట్లు	5.15 లక్షలు
ఉద్యోగులు, అత్యవసర సర్వీసు సిబ్బంది	4,61,945
సర్వీసు ఓటర్లు	26,721
వయోవృద్ధులు, దివ్యాంగులు	26,473

కౌంటింగ్ సైన్యం..

విధుల్లోని ఉద్యోగులు	25,209
అబ్జర్వర్లు	119
పోలీసులు	42,000
ప్రతి కౌంటింగ్ టేబుల్‌కు ఒక మైక్రో అబ్జర్వర్	
టేబుళ్లు (అసెంబ్లీ)	2,446
టేబుళ్లు (పార్లమెంటు)	2,443

టీడీపీ ఆఫీసులో సందడి

- హోరెత్తిన సీఎం, సీఎం నినాదాలు

టీడీపీ అధినేత చంద్రబాబు సోమవారం మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు అంటూ పెద్ద ఎత్తున శ్రేణులు నినాదాలు చేశారు. కార్యకర్తల ఉత్సాహం చూసిన చంద్రబాబు శక్తిని అప్పుడే ఖర్చు చేసుకోవద్దని శ్రేణులతో చమత్కరించారు. కౌంటింగ్‌కు సంబంధించి మానిటరింగ్ ఏర్పాట్లు పరిశీలించారు. ఆఫీస్‌లో ఉండి పనిచేసిన నేతలను చంద్రబాబు అభినందించారు. ఎన్నికల్లో తన పర్యటనలు కో-ఆర్డినేట్ చేసిన సభ్యులను అభినందించారు. పెందుర్తి వెంకటేశ్, పరుచూరి కృష్ణ, బండారు హనుమంతరావు, గంటా గౌతమ్, రవియాదవ్, రాజశేఖర్, శ్రీనివాస్‌లు చంద్రబాబు ఎన్నికల ప్రచారాన్ని సమన్వయం చేశారు.



జగన్ గూండా పాలనకు

చరమగీతం

- శ్రీలంక బౌద్ధ భిక్షువు బోధిహీన్



బర్కత్‌పుర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఏపీలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల గూండా పాలనకు ప్రజలు చరమగీతం పాడబోతున్నారని శ్రీలంక బౌద్ధ భిక్షువు బోధిహీన్ జోస్యం చెప్పారు. సీఎం జగన్ అమరావతి రైతులను.. నానా హింసలకు గురిచేశారని, ఆ పాపాన్ని అనుభవించక తప్పదని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం ఏపీ అసెంబ్లీ ఫలితాలు వెలువడబోతున్నాయని, జగన్ పాలన ముగుస్తుంది కాబట్టి.. ప్రజలతో పాటు అమరావతి రైతులు కూడా సంబరాలు జరుపుకోబోతున్నారని అన్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బాధిత రైతాంగ పోరాట వేదిక నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ పాలనలో గూండాగిరి పెరిగిపోయిందని, అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని అన్నారు. బాధి త రైతాంగ పోరాట వేదిక కన్వీనర్ వెంకటేశ్వర్లు మాట్లాడు తూ.. అమరావతి రైతులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణ మే రద్దు చేయాలని, కట్టడాలను నిలిపివేసిన పాలకులపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంమంత్రి తక్షణమే స్పందించి ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసి అమరావతి కట్టడాల నిలిపివేత, రైతులపై చేసిన దౌర్జన్యాలపై న్యాయ విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షుడు శివారెడ్డి, ప్రముఖ న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాడు అత్యల్ప మెజారిటీ

ఈ సారి సంగతేంటో!

- 2019 ఎన్నికల్లో 12 చోట్ల అతి తక్కువ మెజార్టీ
- విజయవాడ సెంట్రల్‌లో 25 ఓట్ల ఆధిక్యంతో వైసీపీ గెలుపు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

2019 ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు సందర్భంగా కొన్ని నియోజకవర్గాల్లో నరాలు తెగే ఉత్కంఠ ఏర్పడింది. దాదాపు 46 నియోజకవర్గాల్లో హోరాహోరీ కొనసాగింది. 12 నియోజకవర్గాల్లో అతి తక్కువ మెజారిటీ నమోదైంది. ప్రతి రౌండ్‌లోనూ ఉత్కంఠ కొనసాగింది. చివరికి ఉత్కంఠ ఏర్పడ్డ ఆ 12 నియోజకవర్గాల్లో ఆరు చోట్ల వైసీపీ, 5 చోట్ల టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. జనసేన గెలిచిన రాజోలు నియోజకవర్గంలోనూ స్వల్ప మెజార్టీనే నమోదైంది. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో టీడీపీ తరఫున బొండా ఉమా, వైసీపీ తరఫున మల్లాది విష్ణు పోటీ చేయగా..చివరికి 25 ఓట్ల ఆధిక్యంతో మల్లాది విష్ణు గెలుపొందారు. అలానే తిరుపతిలో కరుణాకరరెడ్డి(వైసీపీ), సుగుణమ్మ(టీడీపీ) మధ్య హోరాహోరీ నడిచి చివరికి 708 ఓట్ల ఆధిక్యంతో కరుణాకర్‌రెడ్డి బయటపడ్డారు. అక్కడ టీడీపీ, వైసీపీ మధ్య ఒప్పందాలు జరిగాయన్న విమర్శలు వచ్చాయి. రాజోలులో 814 ఓట్ల ఆధిక్యంతో జనసేన అభ్యర్థి రాపాక వరప్రసాద్ గెలిచారు. గన్నవరం నియోజకవర్గంలో టీడీపీ తరఫున వల్లభనేని వంశీ, వైసీపీ తరఫున యార్లగడ్డ వెంకట్రావ్ పోటీ చేయగా, చివరికి వంశీ 838 ఓట్ల ఆధిక్యంతో బయటపడ్డారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో ప్రస్తుతం వంశీ వైసీపీ నుంచి, వెంకట్రావ్ టీడీపీ నుంచి బరిలోకి దిగారు. ఈ నాలుగు నియోజకవర్గాల్లో వెయ్యి లోపు మెజార్టీతోనే గెలుపు వరించింది. ఇక కొండెపిలో టీడీపీ అభ్యర్థి బాలవీరాంజనేయ స్వామి 1,024, పొన్నూరులో వైసీపీ అభ్యర్థి కిలారి రోశయ్య 1,112, నెల్లూరు సిటీలో అనిల్‌కుమార్ యాదవ్ 1,988, తణుకులో కారుమూరి నాగేశ్వరరావు 2,195, నగరిలో రోజా 2,708, పర్చూరులో ఏలూరి సాంబశివరావు, విశాఖ నార్త్‌లో గంటా 1,944, ఉరవకొండలో పయ్యావుల కేశవ్(టీడీపీ) 2,132 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. నాడు స్వల్ప మెజార్టీతో బయటపడిన అభ్యర్థుల్లో ఈసారి ఏం జరుగుతుందోననే ఆందోళన నెలకొంది.

కౌంటింగ్ వేళ.. జిల్లా బహిష్కరణ

- ఉమ్మడి అనంతలో వంద మందికిపైగా నోటీసులు

అనంతపురం క్రైం, జూన్ 3: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా టీడీపీ, వైసీపీ వర్గీయులతోపాటు రౌడీషీట్లు ఉన్న పలువురిని పోలీసులు జిల్లా నుంచి బహిష్కరించారు. అయితే, జాబితాను వెల్లడించేందుకు వారు నిరాకరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం వంద మందికిపైగా నోటీసులు ఇచ్చిన పోలీసులు వారిని ఈ నెల 25 వరకు జిల్లాలోకి రాకూడదని ఆదేశించారు. తాడిపత్రి నియోజకవర్గంలో అత్యధికంగా 60 మందిని బహిష్కరించినట్టు సమాచారం. అనంతపురం నగరంలో ముగ్గురిని, అర్బన్ పరిధిలో రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, చంద్రదండు వ్యవస్థాపకుడు ప్రకాశ్‌నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురామ్‌తోపాటు, వైసీపీ నాయకుడు, తోపుదుర్తి ఎంపీటీసీ పాలచర్ల పోతులయ్య, తోపుదుర్తి ఓబిరెడ్డిని బహిష్కరించారు. గుంతకల్లు నియోజకవర్గంలో ఇద్దరిని, శ్రీసత్యసాయి జిల్లా నుంచి 33 మందిని బహిష్కరించారు. వైసీపీ కదిరి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి పూల శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకుడు అల్తాఫ్‌తోపాటు, టీడీపీ కదిరి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, మాజీ ఎంపీపీ విజయ్‌రెడ్డిని కూడా జిల్లా నుంచి బహిష్కరించారు.

అప్రమత్తంగా ఉండండి

- కౌంటింగ్‌లో ఏ అనుమానం వచ్చినా వెంటనే ఆర్వోకు ఫిర్యాదు చేయండి
- వైసీపీ హింసకు పాల్పడవచ్చు సంయమనంతో వ్యవహరించండి
- మరో 24 గంటలు ఇలాగే కష్టపడండి
- ప్రజల ఐదేళ్ల కష్టాలకు నేటితో తెర
- ఏజెంట్లతో టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు

అమరావతి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలని, లెక్కింపులో ఏ అనుమానం ఉన్నా వెంటనే ఆర్వోకు ఫిర్యాదు చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు సూచించారు. ఐదేళ్లు ఎంతో కష్టపడ్డారని, మరో 24 గంటలు అలాగే పనిచేయాలన్నారు. మంగళవారం ఓట్లను లెక్కించనున్న నేపథ్యంలో సోమవారం కౌంటింగ్ ఏజెంట్లతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలు ఐదేళ్ల పాటు పడ్డ కష్టాలకు మంగళవారం నాటితో అడ్డుకట్ట పడబోతుందన్నారు. "ఎన్నో విపత్కర పరిస్థితులను ఎదుర్కొని నిలబడ్డాం. పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై రాద్ధాంతం చేయాలనుకున్న వైసీపీకి సుప్రీంకోర్టులో మొట్టికాయలు తప్పలేదు. ఓటమిని జీర్ణించుకోలేని వైసీపీ కౌంటింగ్‌లో హింసకు పాల్పడేందుకు సిద్ధంగా ఉంది. కూటమి కౌంటింగ్ ఏజెంట్లు సంయమనం కోల్పోవద్దు. నిబంధనల కోసం పట్టుబట్టాలి. కౌంటింగ్ ఏజెంట్లు ఎలా వ్యవహరించాలో ఇప్పటికే శిక్షణ ఇచ్చాం. ఏజెంట్లు నిర్దేశిత సమయానికి కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లాలి. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అన్ని రౌండ్లు పూర్తయ్యే వరకు ఏజెంట్లు ఎవరూ బయటకు రావొద్దు. కంట్రోల్ యూనిట్ నంబర్ ప్రకారం సీల్‌ను ప్రతి ఏజెంట్ సరిచూసుకోవాలి. ప్రతి ఒక్కరూ 17-సీ ఫామ్ దగ్గర ఉంచుకుని పోలైన ఓట్లను, కౌంటింగ్‌లో వచ్చిన ఓట్లను సరిచూసుకోవాలి. అన్ని రౌండ్లు పూర్తయ్యాక పోలైన ఓట్లకు, కౌంటింగ్‌లో వచ్చిన ఓట్లకు తేడాలు ఉంటే వీవీప్యాట్‌లు లెక్కిస్తారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కౌంటింగ్‌కు వెళ్లిన ఏజెంట్లకు ఏమాత్రం అనుమానమున్నా ఆర్వోకు అభ్యంతరం తెలపవచ్చు. ఆర్వోలకు ఇచ్చిన ఫిర్యాదులపై అక్నాలెడ్జ్‌మెంట్ తప్పకుండా తీసుకోవాలి. మనకున్న అభ్యంతరాలపై నిబంధనలు పాటిస్తూనే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. డిక్లరేషన్ ఫామ్ తప్పకుండా తీసుకోవాలి. అనారోగ్య కారణాలతో ఏజెంట్ రాలేకపోతే కౌంటింగ్‌కు ముందే మరొకరిని నియమించుకునే వెసులుబాటు ఉంది. నిబంధనలు అమలయ్యేలా చూడటంలో ఎవరూ రాజీపడొద్దు. ప్రతి ఓటూ కీలకమేనని ఏజెంట్లు గుర్తుంచుకుని ప్రక్రియలో పాల్గొనాలి" అని చంద్రబాబు సూచించారు.

సైకిల్ దినోత్సవ శుభాకాంక్షలు

ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు ఎక్స్‌లో తాను సైకిల్ తొక్కుతున్న ఫొటోను పోస్టు చేసి శుభాకాంక్షలు తెలిపారు. సైక్లింగ్ వ్యక్తులకు, సమాజానికి మంచిదని తెలిపారు.



ఎన్టీఆర్ ఫౌండేషన్‌కు 2 కోట్ల విరాళం

- బాబుకు చెక్ అందజేసిన మన్నవ మోహన్‌కృష్ణ

అమరావతి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్టు అనుబంధ విభాగమైన ఎన్టీఆర్ ఫౌండేషన్‌కు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహన్‌కృష్ణ రూ.2 కోట్లను విరాళంగా అందజేశారు. టీడీపీ అధినేత చంద్రబాబును సోమవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసి చెక్ అందజేశారు. విరాళం అందించిన మోహన్‌కృష్ణను చంద్రబాబు అభినందించారు. ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడు వేమూరి రవి, ఎన్ఆర్ఐ గొట్టిపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ 25 లక్షల విరాళం

ఎన్ఆర్ఐ, వ్యాపారవేత్త బొద్దులూరి కృష్ణ టీడీపీకి రూ.25 లక్షల విరాళాన్ని అందించారు. చంద్రబాబును కలిసి చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత ఎల్‌వీఎస్ఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.



పార్టీ ఆఫీసు నుంచే పవన్ పర్యవేక్షణ

- నాగబాబు, ఇతర సీనియర్ నేతలూ రాక

అమరావతి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ మంగళగిరిలోని పార్టీ కార్యాలయం నుంచే ఓట్ల లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. గతనెల 13న పోలింగ్ అనంతరం హైదరాబాద్‌కు వెళ్లిన ఆయన అక్కడి నుంచి విదేశాలకు వెళ్లారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మంగళవారం మంగళగిరికి రానున్నారు. ఆయనతో పాటు పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు, ఇతర సీనియర్ నాయకులు చేరుకుంటారు. ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన టీడీపీ అధినేత చంద్రబాబును కలిసే అవకాశాలున్నాయి. కాగా, గత నెల 12వ తేదీ వరకూ అనేక నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటన చేశారు. జనసేన పోటీ చేస్తున్న 21 స్థానాలతో పాటు కూటమి అభ్యర్థుల కోసం ప్రచారం నిర్వహించారు. విజయవాడలో ప్రధాని మోదీ, చంద్రబాబుతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఫలితాలు కూటమికి అనుకూలంగా వస్తాయని ఆయన గట్టి నమ్మకంతో ఉన్నారు. పిఠాపురంలో ఆయన గెలుపు దాదాపు ఖాయమైనప్పటికీ, మెజార్టీపైనే చర్చ నడుస్తోంది. ఆయన కూడా మెజార్టీ పైనే దృష్టిపెట్టారు.

కూటమికి 106 సీట్లు

- 16 లోక్‌సభ స్థానాలు ఖాయం
- ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు

విజయవాడ(వన్‌టౌన్), జూన్ 3: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిదే విజయమని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ తెలిపారు. తాము చేయించిన సర్వేలో ఈ విషయం స్పష్టంగా తెలిసిందన్నారు. కూటమికి 98 నుంచి 106 అసెంబ్లీ స్థానాలు దక్కుతాయని చెప్పారు. అదేవిధంగా పార్లమెంటు స్థానాల్లో 16 చోట్ల కూటమి అభ్యర్థులు విజయం దక్కించుకుంటారని అంచనా వేసినట్టు హేమంత్ తెలిపారు. ఇదేసమయంలో వైసీపీకి 50 నుంచి 60 స్థానాలు దక్కే అవకాశం ఉందని పేర్కొన్నారు. పార్లమెంటు స్థానాల్లో వైసీపీ 9 దక్కనున్నట్టు తమ సర్వేలో తేలిందన్నారు. అయితే.. అధికార పార్టీ వైసీపీకి 94 నుంచి 104 స్థానాలు వస్తాయంటూ ఓ సర్వే చెప్పిందని.. ఇది నిజం కాదని వెల్లడించారు. అలా జరిగే అవకాశం కూడా లేదని హేమంత్ వివరించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

వైసీపీ ఎమ్మెల్సీ రఘురాజుపై అనర్హత వేటు

అమరావతి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అనర్హత వేటు వేశారు. వైసీపీ ఎమ్మెల్సీగా ఎన్నికైన రఘురాజు టీడీపీతో కలసి పనిచేస్తున్నారంటూ శాసన మండలిలో విప్ పాలవలస విక్రమ్ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును విచారించిన చైర్మన్... సోమవారం రఘురాజుపై అనర్హత వేటు వేస్తూ ఉత్తర్వు జారీ చేశారు. ఈ ఉత్తర్వు వెంటనే అమల్లోకి వస్తుందని ఆదేశించారు.

జడ్జి ఫోన్ ట్యాపింగ్‌పై టీ-హైకోర్టు సుమోటో విచారణ

- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం
- పత్రికల్లో కథనాల ఆధారంగా నిర్ణయం
- సుమోటో లిస్టుకు ఆదివారమే సీజే నిర్ణయం
- నేడు విచారణ చేపట్టనున్న సీజే ధర్మాసనం

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాక్షాత్తూ హైకోర్టు జడ్జి జస్టిస్ కాజా శరత్ ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని ఓ నిందితుడు (ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ భుజంగరావు) తన వాంగ్మూలంలో పేర్కొన్నట్లు వార్తలు గుప్పుమన్న నేపథ్యంలో హైకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. ఆంధ్రజ్యోతి సహా పలు పత్రికల్లో ఈ అంశంపై వచ్చిన కథనాలను సుమోటోగా విచారణకు స్వీకరించింది. సుమోటో పిటిషన్‌పై మంగళవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ టి.వినోద్ కుమార్‌ల ధర్మాసనం విచారణ చేపట్టనుంది. ఇందులో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్), తెలంగాణ డీజీపీ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ, హైదరాబాద్ పోలీస్ కమిషన్‌లను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతి సహా ఇతర పత్రికల కటింగ్‌లు ధర్మాసనం ఎదుట రిజిస్ట్రీ ఉంచింది. హైకోర్టు ఎదుట విచారణ జాబితాలో ఉన్న పిటిషన్‌లో వివరాలు ఇలా ఉన్నాయి. "చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే ఈ నెల 2న ఇచ్చిన ఆదేశాల ప్రకారం పలు పత్రికల్లో మే 29న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కాజా శరత్ ఫోన్ ట్యాపింగ్ అయిందని వచ్చిన వార్తా కథనాలను సుమోటోగా ఈ కేసు లిస్ట్ చేశారు. హైకోర్టు జడ్జి మొబైల్ ట్యాపింగ్ గురైనట్లు పత్రికల కథనాల ద్వారా వెలుగులోకి వచ్చింది. గత బీఆర్ఎస్ హయాంలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ చేశారని, అందులో భాగంగానే జస్టిస్ శరత్ కూడా టార్గెట్‌గా మారారని ఆ కథనాల్లో ఉంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విమర్శించిన వారి ఫోన్‌లు ట్యాపింగ్ చేసినట్లు భుజంగరావు స్టేట్‌మెంట్‌ను ఉటంకిస్తూ రాశారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై విమర్శలు చేసిన వారి ఫోన్లు ట్యాపింగ్ చేశారు. అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ ఆదేశాల మేరకు హైకోర్టు జడ్జిల ఫోన్‌లు సైతం ట్యాపింగ్ చేసినట్లు వార్తా కథనాల్లో ఉంది. సదరు ట్యాపింగ్ వ్యవహారాన్ని ప్రభాకర్‌రావే పర్యవేక్షించినట్లు భుజంగరావు స్టేట్‌మెంట్‌లో వెల్లడైంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇతర నిందితులు మేకల తిరుపతన్న, డి.ప్రణీత్‌రావు, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, భుజంగరావు తదితరులు ప్రభాకర్‌రావు నుంచి ఆదేశాలు రాగానే ప్రత్యేక దర్యాప్తు బృందంగా ఏర్పడి, ఉగ్రవాదుల జాడను పసిగట్టే పరికరాలతో అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫోన్‌లు ట్యాప్ చేశామని, ప్రణీత్‌రావు ఇచ్చే వివరాల ఆధారంగా జడ్జిలు, ప్రతిపక్ష నేతలు.. అలాగే బీఆర్ఎస్ సొంత నాయకులపై నిఘా పెట్టామని భుజంగరావు స్టేట్‌మెంట్‌ను ఉటంకిస్తూ పత్రికల్లో పేర్కొన్నారు. విద్యార్థి నాయకులు, జర్నలిస్టులు, ప్రతిపక్ష నేతల కుటుంబ సభ్యులు ఫోన్‌లు సైతం ట్యాప్ చేసినట్లు అందులో పేర్కొన్నారు. దుబ్బాక, హుజురాబాద్, మునుగోడు, జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా కూడా ట్యాపింగ్ చేసినట్లు పత్రికల కథనాల్లో ప్రస్తావించారు. మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో సివిల్ వివాదాలు పరిష్కరించేలా ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నామని భుజంగరావు ప్రకటనలో ఉంది. పెద్ద పెద్ద కంపెనీలు, పలుకుబడి కలిగిన వ్యక్తులకు సంబంధించిన వివాదాలను పరిష్కరించాలని ప్రణాళిక వేసుకున్నట్లు అందులో పేర్కొన్నారు. బీఆర్ఎస్ లీడర్ల ఆదేశాలతో పెద్ద మొత్తంలో డబ్బును టాస్క్‌ఫోర్స్ వాహనాల్లో రెండు ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించామని, సంధ్య శ్రీధర్‌రావు చేత రూ.13 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లు క్రిమినల్ కేసుల భయం చూపి కొనిపించామని స్టేట్‌మెంట్‌లో ఉంది. కేసీఆర్ పోటీ చేసిన కామారెడ్డిపై ప్రత్యేక దృష్టి పెట్టామని, బీజేపీ అభ్యర్థి వెంకట్రమణారెడ్డి, రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డిపై నిఘా పెట్టామని భుజంగరావు అంగీకార ప్రకటన చేసినట్లు పత్రికల కథనాల్లో పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్, జీపీఎస్ లోకేషన్ ఆధారంగా గాలి అనిల్ కుమార్, కె.వినయ్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల సన్నిహితుల వద్ద, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సన్నిహితుల వద్ద, యశస్వినిరెడ్డి అత్త ఝాన్సీరెడ్డి వద్ద డబ్బు పట్టుకున్నట్లు భుజంగరావు అంగీకరించారు. తిరుపతన్న నేరాంగీకార ప్రకటన ప్రకారం... కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కంప్యూటర్‌లలో డేటాతో పాటు డివైజ్‌లను నాశనం చేసినట్లు తేలింది. ఇందులో పేర్కొన్న అంశాలపై తగిన ఆదేశాలను జారీ చేయాలని హైకోర్టు రిజిస్ట్రీ ధర్మాసనాన్ని కోరింది.

తీర్పు నేడే!


టీడీపీ ఆఫీసులో ఫలితాలు చూసేందుకు ఏర్పాటు చేస్తున్న భారీ స్క్రీన్

కొద్ది గంటల్లోనే తేలనున్న పార్టీల భవితవ్యం
గెలుపు మాదంటే మాదంటూ నేతల ధీమా

- 3 వారాలుగా శ్రేణుల్లో నరాలు తెగే ఉత్కంఠ
- ప్రధాన పోటీ వైసీపీ, టీడీపీ కూటమి నడుమే
- ఎగ్జిట్ పోల్స్ అంచనాలు కూటమి వైపే
- కాదంటే కాదంటున్న పాలకపక్ష పెద్దలు
- హోరాహోరీ పోరులో భారీ పోలింగ్
- 81.8% ఓటింగ్‌తో దేశంలోనే తొలిస్థానం
- అధికార పార్టీతో అంటకాగిన అధికారులు పెద్దఎత్తున బదిలీ
- అల్లర్ల కట్టడిలో విఫలమైనవారు కూడా..

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో రోమాలు నిక్కబొడుచుకునేలా సాగిన ఎన్నికల సమరం ఫలితం మరికొద్ది గంటల్లోనే సాక్షాత్కరించనుంది. మంగళవారం జరగనున్న ఓట్ల లెక్కింపులో రాజకీయ పార్టీల భవితవ్యం తేలిపోనుంది. 175 అసెంబ్లీ సీట్లకు, 25 లోక్‌సభ స్థానాలకు గత నెల 13న హోరాహోరీగా సాగిన పోలింగ్‌లో జనం ఎవరి వైపు మొగ్గారోనన్న ఉత్కంఠ అన్ని పార్టీల శ్రేణులను ఊపేస్తోంది. ఈవీఎంలలో నిక్షిప్తమైన ప్రజల ఓట్లను మంగళవారం లెక్కించనున్నారు. అధికార పార్టీ వైసీపీ ఒకవైపు.. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఇంకోవైపు.. కాంగ్రెస్- వామపక్షాల కూటమి మరోవైపు బరిలోకి దిగినా.. ప్రధాన పోటీ వైసీపీ, టీడీపీ కూటమి మధ్యే కేంద్రీకృతమైందని విశ్లేషకులు అంటున్నారు. ఈ ఎన్నికలు అనేక విషయాల్లో ప్రత్యేకత చాటుకున్నాయి. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 81.8 శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్రంలో ఇంతవరకూ జరిగిన ఎన్నికల్లో ఇంత పోలింగ్ ఎప్పుడూ జరగలేదు. పైగా దేశవ్యాప్తంగా కూడా మన రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచింది. కొన్ని నగర ప్రాంతాలు మినహాయిస్తే గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ ఎన్నికల్లాగా భారీ ఓటింగ్ శాతం నమోదైంది. దర్శి నియోజకవర్గం 90 శాతం ఓటింగ్‌తో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. ప్రధాన పార్టీల నడుమ హోరాహోరీ పోరు ..పోలింగ్ బూత్‌ల వద్దకు ప్రజలను విశేషంగా ఆకర్షించింది. ఉద్యోగాలు, ఉపాధి, చదువు కోసం ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు వెళ్లిన యువత లక్షల సంఖ్యలో తమ స్వస్థలాలకు వచ్చి ఓట్లు వేయడం పెద్ద విశేషం. ఆ సమయంలో రోడ్లు జాతరను తలపించాయి.

బదిలీలు, హింసాత్మక ఘటనలు..

ఎన్నికల నిర్వహణ కూడా గతంలో ఎన్నడూ చూడని పరిణామాలతో సంచలనం రేకెత్తించింది. ఎప్పుడూ లేనంతగా ఎన్నికల కమిషన్ ఈసారి రాష్ట్రంలో భారీ ఎత్తున అధికారులను మార్చేసింది. అధికార పార్టీతో అంటకాగిన, హింస నివారణలో విఫలమైనవారిపైన వేటువేసింది. కొందరు కలెక్టర్లు, ఎస్పీలు బదిలీలతో పాటు సస్పెన్షన్ కూడా ఎదుర్కొన్నారు. ఏకంగా రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథరెడ్డినే ఈసీ సాగనంపింది. నిఘా విభాగం అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులును కూడా పక్కనపెట్టింది.

- ఇక పోలింగ్ రోజు, మర్నాడు.. పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లోని మాచర్ల, గురజాల నరసరావుపేట, తాడిపత్రి, చంద్రగిరి నియోజకవర్గాల్లో జరిగిన హింసాత్మక ఘటనలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించి ఈవీఎంను, వీవీప్యాట్‌ను ధ్వంసం చేసిన వీడియో కలకలం రేపింది. అధికార, పోలీసు యంత్రాంగాన్ని, ఈసీని ఇరుకున పెట్టాయి. వందల సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు ఇనుప రాడ్లు, కర్రలు, మారణాయుధాలు పట్టుకుని మాచర్ల నియోజకవర్గంలో రోడ్లపై స్వైరవిహారం చేసిన దృశ్యాలు యావద్దేశాన్నీ నివ్వెరపరిచాయి. ఈ సంఘటనలతో పల్నాడు జిల్లాకు దేశంలోనే చెడ్డపేరు వచ్చిందని ఆ జిల్లా కొత్త ఎస్పీ మల్లికా గార్గ్ స్వయంగా వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారం చివరకు సుప్రీంకోర్టు వరకూ వెళ్లడం విశేషం. ఎమ్మెల్యే పిన్నెల్లిని అరెస్టు చేయకుండా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సర్వోన్నత న్యాయస్థానం తప్పుబట్టడం రాష్ట్ర ఎన్నికల సంగ్రామంలో చోటు చేసుకున్న అనేక మలుపుల్లో ఒకటి. రాష్ట్రంలో మోహరించిన కేంద్ర బలగాలు మంగళవారం ఫలితాలు వచ్చిన తర్వాత కూడా 15 రోజుల వరకూ ఇక్కడే ఉంచాలని ఈసీ ఆదేశించడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది.

పార్టీల గెలుపు అవకాశాలపై పది వేల కోట్ల దాకా బెట్టింగులు
ఎగ్జిట్ పోల్స్ వచ్చాక మరింత ప్రవాహం
గత రెండ్రోజుల్లోనే వెయ్యి కోట్లు!

కాయ్ రాజా కాయ్..

రాష్ట్రంలో ఫలితాలపై ఉత్కంఠ నెలకొనడం బెట్టింగ్‌లను సైతం విపరీతంగా పెంచింది. రూ.10 వేల కోట్లకుపైగా బెట్టింగ్‌లు కాసినట్లు సంబంధిత రంగంలో ఉన్నవారు చెబుతున్నారు. శనివారం ఎగ్జిట్ పోల్స్ వెలువడిన తర్వాత పందేల ప్రవాహం మరోసారి పెరిగింది. ఆది, సోమవారాల్లో రాష్ట్రంలో కాసిన పందేల విలువ రూ.వెయ్యి కోట్లు వరకూ ఉంటుందని చెబుతున్నారు.



పార్టీల ఖర్చు మోపెడు..

ఖర్చు రీత్యా కూడా ఈసారి ఎన్నికలు గత రికార్డులను బద్దలు కొట్టాయి. వైసీపీ, టీడీపీ కూటమి కలిసి ఈసారి ఎన్నికల్లో పెట్టిన ఖర్చు రూ.10-12 వేల కోట్ల వరకూ ఉండవచ్చని అంచనా. కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఖర్చు ఈసారి రూ.వంద కోట్లు దాటిపోయింది. కనీసం డజను నియోజకవర్గాల్లో ఈ స్థాయిలో వ్యయం చేసినట్లు సమాచారం.

ఎవరి ధీమా వారిది..

ఫలితాలపై టీడీపీ కూటమిలోని పార్టీలు మొదటి నుంచీ బాగా ధీమాగా ఉన్నాయి. ఎగ్జిట్ పోల్స్ కూడా వాటికే అనుకూలంగా అంచనాలు వెలువరించాయి. గెలుపు గురించి ఢోకా లేదని.. సీట్ల స్కోరెంతో చూసుకోవడమే మిగిలిందని ఆ పార్టీల నేతలు అంటున్నారు. అయితే ఎగ్జిట్ పోల్స్‌ను వైసీపీ పెద్దలు విశ్వసించడం లేదు. జాతీయ స్థాయి సంస్థలు బీజేపీకి అనుకూలంగా ఇచ్చాయని.. కొన్ని స్థానిక సర్వే సంస్థలు తమదే గెలుపని అంటున్నాయని.. సైలెంట్ ఓటింగ్ తమకే అనుకూలంగా ఉందని వాదిస్తున్నారు. అయితే నేతలు, కేడర్ చేజారకుండా చూసుకోవడానికే వీరిలా మాట్లాడుతున్నారని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఆ పార్టీ నేతల్లో గెలుపుపై ధీమా కనిపించడం లేదని.. అదృష్టంపైనే భారం వేసినట్లు కనిపిస్తోందని చెబుతున్నాయి.

అమెరికాలో హైదరాబాద్ విద్యార్థిని అదృశ్యం

- వారం రోజులుగా తెలియని ఆచూకీ
- గత నెలలో మరో తెలంగాణ విద్యార్థి కూడా
- అంతకుముందు హైదరాబాద్ వాసి మృతి

హూస్టన్, జూన్ 3: అమెరికాలో తెలంగాణకు చెందిన మరో విద్యార్థిని అదృశ్యమైంది. కాలిఫోర్నియా రాష్ట్రంలో చదువుకుంటున్న హైదరాబాద్‌కు చెందిన కందుల నితీశ (23) వారం రోజుల నుంచి కనిపించడం లేదు. ఆమె ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులు స్థానిక ప్రజల సాయం కోరారు. కాలిఫోర్నియా స్టేట్ యూనివర్సిటీ, శాన్ బెర్నార్డినో (సీఎస్‌యూఎస్‌బీ) విద్యార్థిని కందుల నితీశ గత నెల 28వ తేదీ నుంచి కనిపించడం లేదని పోలీసులు వెల్లడించారు. ఆమె చివరిసారిగా లాస్‌ఏంజెల్స్‌లో కనిపించినట్టు తెలిపారు. గత నెల 30వ తేదీన నితీశ అదృశ్యమైనట్టు తమకు ఫిర్యాదు అందిందని సీఎస్‌యూఎస్‌బీ పోలీసులు 'ఎక్స్'లో వెల్లడించారు. కాలిఫోర్నియా నంబర్ ప్లేట్ ఉన్న టొయోటా కారులో ఆమె వెళ్లినట్లుగా తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఆమె గురించి సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని స్థానికులను కోరారు. ఆమె ఎత్తు, బరువు, ఇతర వివరాలను తెలియజేశారు. కాగా గత నెలలోనే తెలంగాణకు చెందిన విద్యార్థి రూపేశ్ చంద్ర చింతికింది (26) చికాగోలో అదృశ్యమయ్యాడు. అంతకుముందు మార్చిలో హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ అరాఫత్ కనిపించకుండా పోయాడు. అనంతరం క్లీవ్‌లాండ్‌లో అతడి మృతదేహాన్ని గుర్తించారు. క్లీవ్‌లాండ్ యూనివర్సిటీలో ఐటీలో మాస్టర్స్ చేసేందుకు గతేడాది మేలో అమెరికాకు వెళ్లాడు. దేశంలోని ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు, ఐటీ నిపుణులు కూడా ప్రమాదాల్లో చిక్కుకున్న సంఘటనలు ఉన్నాయి. ఇలా వరుస ఘటనలు జరగడం కలకలం రేపుతోంది.

వడగాడ్పులకు దేశం విలవిల

- ఒడిసాలో వడదెబ్బకు 99 మంది మృతి
- యూపీలో 33 మంది పోలింగ్ సిబ్బంది కూడా..
- వచ్చే మూడు రోజుల్లో ఉపశమనం: ఐఎండీ

న్యూఢిల్లీ, జూన్ 3: భగభగ మండిన ఎండలు, వడగాడ్పులతో ఈ ఏడాది భారతదేశం విలవిలలాడింది. వడదెబ్బకు ఒడిసా రాష్ట్రంలో 99 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో 33 మంది పోలింగ్ సిబ్బంది కూడా ఎండతీవ్రతకు మరణించారు. దేశ రాజధాని ఢిల్లీలో మే 29న రికార్డు స్థాయిలో 52.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ, సెన్సర్ లోపం అంటూ వాతావరణ విభాగం దానిని 49.3 డిగ్రీలకు సవరించింది. ఢిల్లీలో నీటి కొరత కూడా తోడవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడవుల నరికివేతకు అడ్డుకట్ట వేయకుంటే దేశ రాజధాని నగరం ఎడారిగా మారిపోతుందని ఢిల్లీ హైకోర్టు హెచ్చరించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అడవుల రక్షణను పర్యవేక్షించే కమిటీకి తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. గత 120 సంవత్సరాలలో ఇదే అత్యంత వేడి వేసవి అని ఐఐటీ-గాంధీనగర్ భూ విజ్ఞాన విభాగం ప్రొఫెసర్ విమల్ మిశ్రా వ్యాఖ్యానించారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది 47 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయన్నారు. దేశంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ రాజస్థాన్, గుజరాత్ మధ్యప్రదేశ్‌లలో ఇంకా వడగాడ్పులు కొనసాగుతున్నాయి. అయితే, రానున్న మూడు రోజుల్లో కొంత ఉపశమనం కలిగే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) తెలిపింది.

ఇదేమి తీర్పు?

(మొదటి పేజీ తరువాయి)

విచారణ చేపట్టింది. హైకోర్టు తీర్పుపై విస్మయం వ్యక్తం చేసింది. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎం, వీవీప్యాట్‌ను ధ్వంసం చేసినట్లు ఆధారాలున్నా అరెస్టు చేయొద్దంటూ ఆదేశాలు ఇవ్వడాన్ని తప్పు పట్టింది. హైకోర్టు తీరు వ్యవస్థలను అపహాస్యం చేసేలా ఉందని, ఇది ముమ్మాటికీ న్యాయాన్ని అవహేళన చేయడమేనని మండిపడింది. శేషగిరిరావు తరఫున సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు వాదనలు వినిపించారు. అందరూ చూస్తుండగానే పిన్నెల్లి విచక్షణరహితంగా వ్యవహరించారని, ఈవీఎం, వీవీప్యాట్ ధ్వంసాన్ని అడ్డుకునే ప్రయత్నం చేసిన వారిపైనా దాడికి పాల్పడ్డారని తెలిపారు. పిన్నెల్లి తరఫు సీనియర్ న్యాయవాది వికాస్‌సింగ్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. అది ఎన్నికల సంఘం అధికారికంగా విడుదల చేసిన వీడియో కాదన్నారు. ప్రస్తుతం ఎన్నో వీడియోలు సర్క్యులేట్ అవుతున్నాయని, వాటన్నింటినీ నిజమైనంగా భావించలేమని తెలిపారు. అయితే ఎన్నికల సంఘం విడుదల చేసిన వీడియోను ఆదినారాయణరావు ధర్మాసనం ముందు ప్రదర్శించారు. ఈవీఎం, వీవీప్యాట్‌ను ఎమ్మెల్యే ధ్వంసం చేసినట్లు వీడియో సాక్ష్యం ఉన్నప్పటికీ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేయలేదని.. గుర్తుతెలియని వ్యక్తులపై కేసు పెట్టారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

మేమూ మౌనంగా ఉండలేం...

"పోలింగ్ కేంద్రంలో పిన్నెల్లి ఏం చేశారో వీడియోను చూస్తే అర్థమవుతోంది. అక్కడ ఏం జరిగిందో వీడియో సాక్ష్యం ద్వారా స్పష్టంగా తెలుస్తోంది. రామకృష్ణారెడ్డిని అరెస్టు చేయొద్దంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు వ్యవస్థలను అపహాస్యం చేసేలా ఉంది. ఈ ఆదేశం అత్యంత లోపభూయిష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు మేం కూడా దీనిపై మౌనంగా ఉంటే సమాజానికి ఏం సందేశం ఇచ్చినట్లు? హైకోర్టు తీర్పుపై మేం స్టే ఇవ్వకుంటే అది న్యాయ వ్యవస్థను అపహాస్యం చేసినట్లే" అని జస్టిస్ అరవింద్ కుమార్ వ్యాఖ్యానించారు. ఇలాంటి కేసుల్లో మధ్యంతర రక్షణ ఎలా కల్పిస్తారని, ఇదో పెద్ద జోక్ అని ధర్మాసనం పేర్కొంది. 'అంత మంది పోలింగ్ బూత్‌లోకి ఎలా ప్రవేశిస్తారు? అది లైవ్ వెబ్ టెలికాస్ట్. అది మార్ఫింగ్ చేసిన వీడియో కాదు. 8 మంది పోలింగ్ బూత్‌లో ఉన్నారు. ఇక బెయిల్ ఇచ్చే అవకాశం ఎక్కడిది? పిన్నెల్లిపై ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలు కనిపిస్తున్నాయి' అని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టు మధ్యంతర రక్షణ ఆదేశాలిచ్చేదాకా దాక్కున్న వైసీపీ ఎమ్మెల్యేను, ఈ షాకింగ్ ఘటనపై పోలీసులు స్పందించిన తీరును తీవ్రంగా విమర్శించింది. సిటింగ్ ఎమ్మెల్యే పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఈవీఎం, వీవీప్యాట్‌ను ధ్వంసం చేస్తే 'గుర్తుతెలియని వ్యక్తిపై కేసు పెడతారా' అని పోలీసులపై మండిపడింది. ఆయన మంగళవారం తన నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రంలోకి అడుగుపెట్టడానికి వీల్లేదని స్పష్టం చేసింది. దాని పరిసర ప్రాంతాల్లో కూడా కనిపించకూడదని తేల్చిచెప్పింది. ఇందుకు అంగీకరిస్తున్నట్లు అఫిడవిట్ ఇవ్వాలని పిన్నెల్లిని ఆదేశించింది.

మార్ఫింగ్ కాదు...

జరిగిన ఘటనలతో తాను విభేదించడం లేదని.. బూత్‌లో ఎమ్మెల్యే ఉన్నారనడంతో మాత్రం ఏకీభవించడం లేదని పిన్నెల్లి తరఫు న్యాయవాది వికాస్‌సింగ్ తెలిపారు. వీడియోలు చూస్తే ఎమ్మెల్యేపై వచ్చిన ఆరోపణలు నిజమేననడానికి ప్రాథమిక ఆధారాలు కనిపిస్తున్నాయని.. వాటిని అంగీకరించాలని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'పోలింగ్ కేంద్రంలో ఎన్నికల కమిషన్ ఏర్పాటుచేసిన సీసీటీవీ కెమేరాల ద్వారా జరిగిన ప్రత్యక్ష ప్రసారం నుంచి తీసిన వీడియో ఇది. దీనిని మార్ఫింగ్ వీడియో అనడానికి వీల్లేదు' అని తేల్చిచెప్పింది. హైకోర్టు కొన్ని ఆంక్షలతో మధ్యంతర ఉత్తర్వులు మాత్రమే ఇచ్చిందని.. ఈ నెల 6న తుది విచారణ జరుపనుందని వికాస్‌సింగ్ తెలిపారు. మంగళవారం ఓట్ల లెక్కింపు ఉందని.. ముందస్తు బెయిల్ ఆదేశాలపై స్టే ఇవ్వొద్దని కోరారు. పిన్నెల్లికి ముందస్తు బెయిల్ ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరమే లేదని పేర్కొంది. వ్యవస్థను ఆయన కించపరిచారని.. సిటింగ్ ఎమ్మెల్యే అయినందున ఆ ప్రాంతంలో ఆయనకు ఎంతో పలుకుబడి ఉందని.. ఆయన మధ్యంతర ముందస్తు బెయిల్‌ను రద్దుచేయాలని ఆదినారాయణరావు కోరారు. కౌంటింగ్ రోజు నియోజకవర్గంలోకి అడుగుపెట్టనివ్వొద్దని అభ్యర్థించారు. నియోజకవర్గంలో అడుగుపెట్టకుండా ఆయనపై నిషేధం విధించడం మరీ పెద్ద ఆంక్ష అవుతుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పిన్నెల్లిపై ఉన్న కేసుల విచారణ హైకోర్టులో గురువారం జరుగనున్నందున.. ఆయనకు గత నెల 28న ఇచ్చిన మధ్యంతర ముందస్తు బెయిల్ ఆదేశాల ప్రభావానికి లోనుకాకుండా న్యాయస్థానం విచారించాలని నిర్దేశించింది. కౌంటింగ్ కేంద్రంలోకి ఆయన అడుగుపెట్టరని.. ఆయన తరఫు పోలింగ్ ఏజెంట్లు మాత్రమే వెళ్తారని వికాస్‌సింగ్ తెలిపారు. ఆయన ఇచ్చిన హామీని అంగీకరించిన ధర్మాసనం వ్యాజ్యాలను పరిష్కరించింది. పోలింగ్ రోజు, మర్నాడు జరిగిన హింసాత్మక దాడులకు గాను పిన్నెల్లిపై హత్యాయత్నం సహా పలు ఐపీసీ సెక్షన్లు, ప్రజాప్రాతినిధ్య చట్టం, ప్రజాఆస్తుల విధ్వంస నిరోధక చట్టం కింద కేసులు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసుల్లో దోషిగా నిర్ధారణ అయితే ఆయనకు గరిష్ఠంగా ఏడేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది.

చంద్రగిరిలో రీ పోలింగ్‌కు కారణాల్లేవు..!

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిటిషన్ కొట్టివేత

చంద్రగిరి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి కూడా నిరాశే మిగిలింది. చంద్రగిరిలో ఫాం-17ఏ, ఇతర డాక్యుమెంట్లు మరోసారి పరిశీలించాలని, 4 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరపాలన్న తన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చడాన్ని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పైనా జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన వెకేషన్ బెంచ్ సోమవారం విచారణ జరిపింది. చంద్రగిరిలో రీ పోలింగ్ జరపడానికి కారణాలేమీ కనిపించడం లేదని వ్యాఖ్యానించింది. ఈ అంశంలోనూ జోక్యం చేసుకోలేమంటూ మోహిత్‌రెడ్డి పిటిషన్‌ను కొట్టివేసింది.

రేవ్‌పార్టీ కేసులో సినీనటి హేమ అరెస్టు

బెంగళూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన రేవ్‌పార్టీ కేసులో తెలుగు సినీ నటి హేమను పోలీసులు అరెస్టు చేశారు. బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీలోని జీఆర్ ఫాంహౌస్‌లో జరిగిన రేవ్‌పార్టీలో పాల్గొని, డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ కావడంతో ఆమెను బెంగళూరు సీసీబీ పోలీసులు అరెస్టు చేశారు. గత నెలలో జరిగిన రేవ్‌పార్టీపై సీసీబీ పోలీసులు దాడి చేసి.. పార్టీలో పాల్గొన్నవారి రక్త నమూనాలు సేకరించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షల్లో మొత్తం 86 మంది డ్రగ్స్ తీసుకున్నట్టు నిర్ధారణ అయినట్టు పోలీసులు వెల్లడించారు. వారిలో హేమ కూడా ఉన్నారు. రేవ్‌పార్టీపై దాడి చేసిన రోజే ఐదుగురు మాదక ద్రవ్యాల వ్యాపారులు, పార్టీ నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో విచారణకు హాజరు కావాలని పోలీసులు హేమకు ఇప్పటికే రెండుసార్లు నోటీసులు ఇచ్చారు. వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నానని, హాజరు కాలేనని ఆమె సమాధానమిచ్చారు. అయితే హేమకు మూడోసారి నోటీసులు పంపించగా.. ఆమె సోమవారం విచారణకు హాజరయ్యారు. పక్కా ఆధారాలు చూపిన సీసీబీ అధికారులు, విచారణ అనంతరం ఆమెను అరెస్టు చేసినట్లు ప్రకటించారు. అనంతరం మల్లేశ్వరంలోని కేసీ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా.. న్యాయాధికారి ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. రేవ్‌పార్టీ వ్యవహారంలో ఆరంభం నుంచే హేమ తీరు విమర్శలకు తావిచ్చింది. పార్టీలో పట్టుబడిన విషయం బయటకు రాగానే ఆమె ఓ వీడియో విడుదల చేసి తాను హైదరాబాద్‌లో ఉన్నానని నమ్మించే ప్రయత్నం చేశారు. అరెస్టయ్యాక సోమవారం ఆస్పత్రికి తరలించిన సమయంలోనూ ఆమె బురఖా ధరించి కనిపించారు. ఆస్పత్రి నుంచి బయటకు వచ్చినప్పుడు పలువురిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె అరెస్టుకు ప్రధాన కారణం డ్రగ్స్ సేవించడం, రేవ్‌పార్టీలో లేనని నమ్మించేందుకు ఓ వీడియో పోస్టు చేసి తప్పుదారి పట్టించడమే కాకుండా.. తొలిరోజు పట్టుబడిన ఐదుగురు హేమ పేరును ప్రధానంగా ప్రస్తావించినట్టు తెలుస్తోంది.


పోలీసుల అదుపులో ఉన్న నటి హేమ

రేవ్ పార్టీలో నేను లేను: హేమ

రేవ్ పార్టీలో తాను లేనని, బర్త్‌డే కేక్ కట్ చేసిన వెంటనే హైదరాబాద్‌కు వెనుదిరిగానని సినీనటి హేమ అన్నారు. విచారణకు హాజరైన హేమను బెంగళూరు సీసీబీ పోలీసులు సోమవారం అరెస్టు చేసి న్యాయాధికారి ముందు హాజరు పరిచారు. కోర్టు నుంచి బయటకు వస్తున్న సమయంలో హేమ మీడియాతో మాట్లాడారు. తాను బెంగళూరు రేవ్‌పార్టీలో లేనని, కేక్ కట్ చేశాక వెళ్లిపోయానని అన్నారు. హైదరాబాద్ నుంచే ఆ రోజు వీడియో పెట్టానని చెప్పారు. మరుసటి రోజు బిరియానీ వండిన వీడియో కూడా హైదరాబాద్‌దేనని అన్నారు. పట్టుబడినట్లు చెబుతున్న రోజు ఎటువంటి టెస్ట్‌లు చేయలేదని, పాజిటివ్ లేదని అన్నారు. ఈ రోజే శాంపిల్స్ తీసుకున్నారని ఆమె తెలిపారు. అంతకుముందు వైద్య పరీక్షలకు తీసుకెళ్లిన సమయంలోనూ హేమ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు.

సార్వత్రిక పోరు..అభ్యర్థుల తీరు..

- 2,572 మందికి కోటికిపైగా ఆస్తులు
- 1,643 మందిపై నేరాభియోగాలు
- పోటీలో మహిళాఅభ్యర్థులు 797 మంది

ఏడు దశల్లో 8,360 మంది బరిలో

న్యూఢిల్లీ, జూన్ 3 : ఇంకొన్ని గంటల్లో ఈవీఎంల్లో దాగిన అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా సంపద సర్వే, ఆస్తుల పునఃపంపిణీ చుట్టూనే వాదం, వివాదం, సవాళ్ల పర్వం సాగింది. ఈ నేపథ్యంలో 18వ లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థుల ఆర్థిక బలం గురించిన వివరాలు ఆసక్తి రేపుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు ఏడు విడతల్లో జరిగిన ఎన్నికల్లో 8,360 మంది పోటీ చేశారు. 1996 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఈ స్థాయి పోటీ ఇదే మొదటిసారి. ఆ ఎన్నికల్లో 13,952 మంది అభ్యర్థులు తలపడ్డారు. మొత్తం అభ్యర్థుల్లో 2,572మందికి (31 శాతం) రూ. కోటికిపైగా ఆస్తులు ఉన్నాయి. వీరిలో ఒక్కొక్కరికి సగటున 6.23 కోట్ల ఆస్తులు ఉన్నాయి. మొత్తం అభ్యర్థుల్లో 1,643 మందిపై (20శాతం) క్రిమినల్ కేసులు ఉన్నాయి. 2019తో పోల్చితే ఒక శాతం, 2014తో పోల్చితే మూడు శాతం, 2014తో పోల్చితే ఇది ఐదు శాతం ఎక్కువ. ఇందులో 1,191 (14శాతం) మందిపై అత్యాచారం, హత్యలు, మహిళలపై నేరాలు వంటి తీవ్రమైన నేరాభియోగాలు ఉన్నాయి. అభ్యర్థులు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించిన నామినేషన్లలోని వివరాల ఆధారంగా స్వతంత్ర సంస్థలైన అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రిసెర్చ్.. ఈ వివరాలను అందించాయి. ఆ వివరాలను అనుసరించి.. ఆరు జాతీయ పార్టీలు సహా చిన్న, పెద్ద పార్టీలను కలుపుకొంటే 744 రాజకీయ పార్టీలు 543 స్థానాలకు తమ అభ్యర్థులు నిలిపాయి. అందులో 16 శాతం జాతీయ పార్టీల నుంచే ఉన్నారు. ఇందులో బీఎస్పీ అత్యధికంగా 488 మందిని నిలిపింది. ఇక బీజేపీ 441 మందిని, కాంగ్రెస్ 328 మందిని, సీపీఎం 52 మందిని, ఆప్ 22 మందిని, నేషనల్ పీపుల్స్ పార్టీ ముగ్గురిని బరిలో నిలిపాయి. ఇక ఆరుశాతం ప్రాంతీయ పార్టీల నుంచి అభ్యర్థులు ఉన్నారు. అత్యధికంగా ఎస్పీ 71 మందిని పోటీకి నిలపగా, తృణమూల్ కాంగ్రెస్ 48, ఏఐఏడీఎమ్‌కే 36, సీపీఐ 30, వైసీపీ 25, ఆర్‌జేడీ 24, డీఎంకే 22 మంది, టీడీపీ 17 మందిని నిలిపాయి. గుర్తింపు పొందని పార్టీల్లో అత్యధికంగా సోషల్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) అత్యధికంగా 150 మందిని, పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమోక్రటిక్) 79 మందిని నిలిపాయి. లోక్‌సభ నియోజకవర్గానికి సగటున 15 మంది ఈసారి బరిలో ఉన్నారు. తెలంగాణలో మాత్రం సగటున 31 మంది నిలవగా, అత్యల్పంగా లడక్, నాగాలాండ్‌ల్లో సగటున ముగ్గురు పోటీచేస్తున్నారు. తమిళనాడులోని కరూర్ నియోజకవర్గ స్థానానికి అత్యధికంగా 54 మంది పోటీ చేస్తున్నారు. ఇందులో 46 మంది స్వతంత్రులు. వయసులవారీగా చూస్తే.. అభ్యర్థి సగటు వయసు 48 ఏళ్లు. ఇక.. అభ్యర్థుల్లో 25 శాతం మంది మాజీ ఎంపీలుగా ఉండగా, 4 శాతం మంది మాజీ రాజ్యసభ సభ్యులు, రెండు శాతం మంది గతంలో ఉభయ సభలకు ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుత లోక్‌సభ సభ్యుల్లో 327 మంది తిరిగి బరిలో నిలవగా, వారిలో ఒకరు రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నారు. అలాగే, వీరిలో 34 మంది 2019లో ఒక పార్టీ తరఫున గెలిచి, ఇప్పుడు మరో పార్టీ టికెట్‌పై పోటీచేస్తున్నారు. మోదీ ప్రభుత్వంలోని మంత్రుల్లో 53 మంది పోటీలో ఉన్నారు. వీరిలో ముగ్గురు రాజ్యసభ సభ్యులుగా ఉండగా, మరో ఐదుగురి రాజ్యసభ సభ్యత్వం ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగిసింది. ఇక.. మొత్తం అభ్యర్థుల్లో 797 మంది (9.6 శాతం) మహిళలు పోటీలో ఉన్నారు. దేశ ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే, 1957 ఎన్నికల్లో మూడు శాతం మంది అభ్యర్థులు నిలిచారు. ఇక.. 2009లో ఏడుశాతం, 2014లో ఎనిమిది శాతం, 2019లో తొమ్మిది శాతం ఉంది మహిళా అభ్యర్థుల ఉన్నారు. బీజేపీ అత్యధికంగా 69 మంది మహిళలకు (19శాతం) టికెట్లు ఇవ్వగా, కాంగ్రెస్ 41 మందిని (13శాతం) నిలిపింది. నామ్ తమిళ్ కచ్చి పార్టీ సీట్లలో యాభై శాతం మహిళలకే కేటాయించడం విశేషం.



17 మంది ఐసిస్ సభ్యులపై ఎన్ఐఏ చార్జిషీటు

న్యూఢిల్లీ, జూన్ 3: అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ 'ఐసిస్'లో కరుడుగట్టిన సభ్యులుగా పనిచేస్తున్న 17 మందిపై ఎన్ఐఏ సోమవారం చార్జిషీటు దాఖలు చేసింది. బాంబులు తయారు చేయడం, యువతను ఉగ్రవాదంవైపు మళ్లించడం, నిధులు సేకరించడం వంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించింది. గత ఏడాది పటియాలా హౌస్‌లోని ప్రత్యేక కోర్టులో ముగ్గురు ఐసిస్ సభ్యులపై చార్జిషీటు దాఖలు చేసింది. వారిపై దర్యాప్తు చేస్తున్న క్రమంలో ఈ 17 మంది పేర్లు వెలుగులోకి వచ్చాయి. దాంతో వారిపై ఆరోపణలను నమోదు చేస్తూ అదనపు అభియోగపత్రాలను కోర్టులో సమర్పించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● మంగళవారం 4 జూన్ 2024

స్టూడెంట్స్ చాయిస్ సీఎస్ఈ

గ్లోబలైజేషన్ ప్రక్రియ ఊపందుకున్న తరవాత ముఖ్యంగా రెండు వేల సంవత్సరం నుంచి ఐటీ రంగం మూడు పూవులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. మధ్యలో రెండుసార్లు తలెత్తిన మాంద్యం ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ ఎక్కువ మందికి ఉపాధి కల్పించే రంగమే కాకుండా హై పెయిడ్‌గా ఉండడంతో సంబంధిత చదువులకు డిమాండ్ అధికంగా ఉంది. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) కొంతకాలంగా ఎదురులేని కోర్సుగా మారింది. ఈ నేపథ్యంలో సదరు కోర్సుకు తోడు ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతున్న ఐటీ రంగంపై ఎన్ఐటి రాయపూర్ డైరెక్టర్ ప్రొఫెసర్ **ఎన్.వి.రమణారావు** చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి.



కంప్యూటర్లు, అల్గోరిథమ్స్ నుంచి ప్రోగ్రామ్స్, సర్క్యూట్స్ అలాగే సాఫ్ట్ వేర్, హార్డ్‌వేర్‌కుతోడు అప్లికేషన్స్(అన్వయం) సహా యావత్తు అధ్యయనం కంప్యూటర్ సైన్స్‌లో ఉంటుంది. ప్రాథమికంగా కంప్యూటర్లు, సంబంధిత అప్లికేషన్స్ అధ్యయనమే కంప్యూటర్ సైన్స్. సాఫ్ట్‌వేర్, అప్లికేషన్స్‌తోనే మొత్తం ప్రపంచాన్ని తెలుసుకునే స్వేచ్ఛను విద్యార్థికి అది కలుగజేస్తోంది. కంప్యూటర్ అల్గోరిథమ్స్, లాంగ్వేజ్‌లు సదరు మెషీన్లకు ప్రోగ్రామ్‌ను సమకూరుస్తాయి. డేటా స్ట్రక్చర్స్, నెట్‌వర్కింగ్ అదేవిధంగా కంప్యూటర్లలో నెట్‌వర్క్స్ అధ్యయనం కూడా ఉంటుంది. కేవలం సాఫ్ట్‌వేర్ లాంగ్వేజెస్ స్టడీకే పరిమితం కాదు. సదరు రంగాలు అంటే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్ తదితరాలూ ఉన్నాయి.

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్: కంప్యూటర్స్‌కు సంబంధించి బేసిక్స్ నుంచి ఈ కోర్సులో నేర్చుకునే అవకాశం విద్యార్థులకు ఉంటుంది. సైన్స్ ఆఫ్ కంప్యూటర్స్ అంటే అందులోని ఆర్కిటెక్చర్ సహా కంప్యూటర్ సైన్స్ మెయిన్ ప్రోగ్రామ్ లాంగ్వేజెస్, కంప్యూటర్ సర్క్యూట్స్ పరిచయం, యావత్తు ప్రక్రియను రన్ చేసే అల్గోరిథమ్స్ ఈ కోర్సు అధ్యయనంలో భాగం. మేథమెటిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఈ సబ్జెక్టు మూలాలు ఉన్నాయి. దాంతో అటు సాఫ్ట్‌వేర్, ఇటు హార్డ్‌వేర్ తెలుసుకోవాల్సి ఉంటుంది.

కంప్యూటర్ ఇంజనీరింగ్: సీఎస్ఈ మాదిరిగానే ఉన్నప్పటికీ చిన్నపాటి తేడాతో ఈ కోర్సు ఉంటుంది. కొన్ని టాపిక్స్ విషయంలో ఈ రెంటి మధ్య తేడా కనిపిస్తుంది. హార్డ్‌వేర్ల డిజైనింగ్, అసెంబ్లింగ్‌కు తోడు మైక్రోప్రాసెసర్ల సర్క్యూట్ డిజైనింగ్, సూపర్ కంప్యూటర్స్ ఈ కోర్సులో ఉంటాయి. అంతిమంగా దేశాన్ని సాంకేతికంగా నడిపేందుకు అవసరమైన విద్య ఉంటుంది.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ: కంప్యూటర్స్ డేటా మేనేజ్‌మెంట్‌కు తోడు నెట్‌వర్క్స్, నెట్‌వర్క్ మేనేజ్‌మెంట్ ఈ కోర్సులో ఉంటాయి. డేటా స్టోరేజీ, మానిప్యులేషన్ అధ్యయనంగా ఉంటుంది. డేటా అంటే ఇక్కడ మెషిన్లలో ఉన్నదని అర్థం.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటి): మెషిన్ కోడ్స్, కంప్యూటర్ లేదంటే ఎలక్ట్రానిక్ డివైజ్‌ను డ్రైవ్ చేసే డేటా ఈ కోర్సులో చదవాలి. నెట్‌వర్కింగ్ స్టడీ అంటే ఒకే పని చేస్తున్న డివైజ్‌ల మధ్య నెట్‌వర్క్‌ను ఎస్టాబ్లిష్ చేయాలి. వాణిజ్యపరంగా బిజినెస్ ప్రపంచంలో ఇది కీలకం.

కొత్త బ్రాంచీలు

ఇటీవల కాలంలో ఐటి, సీఎస్ఈ సంబంధ బ్రాంచీలు చాలా అందుబాటులోకి వచ్చాయి. ఇవి అన్ని కాలేజీల్లో ఉండకపోవచ్చు. వారి డిమాండ్, ఇన్ఫ్రా ఆధారంగా బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. కంప్యూటర్ అప్లికేషన్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్ అండ్ ఐఓటీ, కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ మెయింటెనెన్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్, కంప్యూటర్ హార్డ్‌వేర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ నెట్‌వర్కింగ్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ, కంప్యూటర్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ సైన్స్, ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎనేబుల్డ్ సర్వీసెస్ అండ్ మేనేజ్‌మెంట్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా, కమ్యూనికేషన్ అండ్ కంప్యూటర్ నెట్‌వర్కింగ్, సైబర్ ఫోరెన్సిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ, సైబర్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, వర్చువల్ అండ్ ఆగ్మెంటెడ్ రియాల్టీ, కంప్యూటర్ ఇంజనీరింగ్ (సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్), కంప్యూటర్ ఇంజనీరింగ్ అండ్ అప్లికేషన్, కంప్యూటర్ నెట్‌వర్కింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లయిడ్ మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ బయోసైన్సెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్, కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సైబర్ సెక్యూరిటీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(డేటా సైన్స్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ ఇన్‌క్లూడింగ్ బ్లాక్ చైన్ టెక్నాలజీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(నెట్‌వర్క్స్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ అండ్ బిజినెస్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ మెడికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ సోషల్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ టెక్నాలజీ కంప్యూటింగ్ ఇన్ మల్టీమీడియా, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇందులో ఉన్నాయి.



గణాంకాలు

ఈ ఏడాది జనవరి చివరి నాటికి ఐటీ సెక్టార్‌లో ఓపెనింగ్స్ 50,000 ఉన్నాయి. మునుపటి సంవత్సరంతో పోల్చుకుంటే తగ్గుదల 21 శాతం. అంతకుముందు సంవత్సరం అంటే రెండేళ్ళ క్రితంతో బేరీజు వేసుకుంటే 60 శాతం తగ్గింది. లింక్డిన్, ఇతర జాబ్ బోర్డులను పరిగణనలోకి తీసుకుంటే ఈ లెక్క తేలుతోంది. డేటా శాంపిల్స్‌లో 80 శాతం ఒకే విషయాన్ని రూఢిపరుస్తున్నాయి. ఎంట్రీ లెవెల్‌లో స్లంప్ ఇంకా బాగా చెప్పాలంటే పిరమిడ్‌లోని అట్టడుగున రిక్రూట్‌మెంట్స్ దాదాపుగా స్తంభించాయని చెప్పవచ్చు. ఎనిమిది నుంచి తొమ్మిది శాతం మేర అట్రిషన్స్(ఒక కంపెనీని వదిలి ఇంకో చోటకు వెళ్లడం) ఉంటోంది. అయినప్పటికీ కొత్తగా హైరింగ్ ఉండటం లేదు. ఇంకో మాటలో చెప్పుకొంటే హైరింగ్ విషయంలో రిక్రూటర్లు అప్రమత్తంగా ఉంటున్నారు.

ఈ పరిణామాన్ని 'లో నుంచి నో హైరింగ్ యాక్షన్'గా 'ఎక్స్‌ఫెనో' కోఫౌండర్ అభివర్ణించారు. ఈ తగ్గుదల రెండేళ్ళుగా కొనసాగుతోంది. అన్ని పరిశ్రమలను లెక్కలోకి తీసుకుంటే అందులో ఉండే వైట్-కాలర్ జాబ్స్ స్పేస్ 2,10,000. కాగా జనవరి 2022ని ప్రామాణికంగా తీసుకుంటే తగ్గుదల 35 శాతంగా నమోదైంది. ఐటి సర్వీసెస్ సెక్టార్‌లో ప్రస్తుతం సిస్టమేటిక్ కరెక్షన్ చోటుచేసుకుంటోందని 'లాంగ్‌హౌస్ కన్సల్టింగ్ సీఈఓ తెలిపారు. ఎంట్రీ లెవెల్ గ్రాడ్యుయేట్లతో ఇప్పుడు క్యాంపస్‌లు నిండి ఉన్నాయి. నిజానికి వీరు ఇప్పుడు ఒకటి, రెండేళ్ళ అనుభవం ఉండి ఉద్యోగం పోగొట్టుకున్న వాళ్ళతో పోటీపడాల్సి వస్తోందంటూ పరిస్థితిని వివరించారు. అంతర్జాతీయంగా ఆర్థిక వ్యవస్థ మందగించిందని, ఆ ప్రభావం ఇండియన్ టెక్నాలజీపై కూడా పడిందని డెలాయిట్ ఇండియా డైరెక్టర్ తెలిపారు. స్థూల ఆర్థిక వ్యవస్థలోని అనిశ్చిత వాతావరణం ఫలితంగా క్లయింట్స్ చాలా అప్రమత్తంగా ఉంటున్నారని, ఇది రిక్రూట్‌మెంట్స్‌పై ప్రభావం చూపుతోందన్నారు. రాబోయే రెండు క్వార్టర్లలోనూ ఇదే పరిస్థితి ఉంటుదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనికితోడు సాంకేతికంగా మెరుగుదల ముఖ్యంగా ఏఐ కూడా నియామకాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని చెప్పారు. దరిమిలా మారుతున్న వాతావరణానికి తగ్గట్టు ఎదిగితేనే ఐటీరంగంలో కుదురుకోవడానికి వీలు ఉంటుందని, ఇది ఎప్పటికైనా రెండు వైపులా పదును ఉన్న కత్తే అని కూడా హితవు చెబుతున్నారు. మరో విషయం, ఐటీ రంగంలో గ్లోబల్ హబ్‌గా ఇండియా అలరారుతోంది. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీలో పెద్ద ఎత్తున స్కిల్డ్ ప్రొఫెషనల్స్‌ను తయారుచేస్తోంది. నాస్కామ్ ఇటీవలి నివేదిక ప్రకారం ఇండియన్ ఐటీ-బీపీఎం ఇండస్ట్రీ కేవలం 2022-23లో 45 లక్షల మందిని తీసుకుంది. అయితే సాఫ్ట్‌వేర్ కంపెనీలతో టైఅప్ అవుతున్న ఎస్ఆర్ఎం, బిట్స్ వంటి సంస్థలు ఇంటర్న్‌షిప్స్ నుంచి జాబ్స్ వరకు సింహభాగాన్ని తన్నుకు పోతున్నాయి. అది ఐటీ జాబ్ మార్కెట్‌పై విపరీతమైన ప్రభావం చూపుతోంది. అంటే తతిమా కాలేజీల నుంచి బైటకు వస్తున్న విద్యార్థులకు జాబ్ పొందడం ఇబ్బందికరంగా మారింది. ఏతావతా అది స్టార్టప్స్ నుంచి మొత్తం ఐటీ రంగంలో ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్స్ వరకు అంతటా ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది.

కెరీర్ అవకాశాలు

- ★ కంప్యూటర్ సైన్స్ లేదా ఐటీ లేదా సంబంధిత ఏరియాలో డిగ్రీ ఉన్న వ్యక్తులుగా సిస్టమ్ ప్రోగ్రామర్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, వెబ్ డెవలపర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, సాఫ్ట్‌వేర్ టెస్టర్, ప్రొడక్ట్ మేనేజర్, ఇంజనీరింగ్ మేనేజర్ వంటి ఉద్యోగాలు పొందవచ్చు. ఉదాహరణకు కంప్యూటర్ సైన్స్‌లో నిపుణుడు సీనియర్ ప్రోగ్రామర్, సిస్టమ్ అనలిస్ట్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, డేటాబేస్ మేనేజర్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, ఫైనాన్షియల్ అనలిస్ట్‌గా చేరవచ్చు.
- ★ కంప్యూటర్ ప్రోగ్రామ్‌లో ఎక్స్‌పర్ట్ - కంప్యూటర్ ప్రోగ్రామర్, వెబ్ డెవలపర్/అడ్మినిస్ట్రేటర్, డేటా బేస్ అడ్మినిస్ట్రేటర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, హెల్ప్‌డెస్క్ ఆపరేటర్, పీసీ సపోర్ట్ అడ్మినిస్ట్రేటర్, నెట్‌వర్క్ సపోర్ట్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేయవచ్చు.
- ★ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో నిపుణుడు ఐటీ ప్రాజెక్ట్ మేనేజర్, టెక్ సపోర్ట్ మేనేజర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, వెబ్‌డెవలపర్, వెబ్‌సైట్ అడ్మినిస్ట్రేటర్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అనలిస్ట్, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్, అప్లికేషన్ డెవలపర్, సాఫ్ట్‌వేర్ టెస్టర్‌గా పనిచేయవచ్చు.
- ★ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ నిపుణుడు సిస్టమ్ అనలిస్ట్, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ మేనేజర్, అప్లికేషన్ ప్రోగ్రామర్‌గా చేరవచ్చు.
- ★ కంప్యూటర్ ఫోరెన్సిక్ నిపుణుడు డిజిటల్ ఫోరెన్సిక్ అనలిస్ట్, ఎగ్జామినర్ అనలిస్ట్, కంప్యూటర్ ఫోరెన్సిక్స్ టెక్నాలజిస్ట్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్ సెక్యూరిటీ ఆఫీసర్, సిస్టమ్ అనలిస్ట్, సిస్టమ్ ఇంజనీర్, డేటాబేస్ అనలిస్ట్, కంప్యూటర్ ఫోరెన్సిక్ అసోసియేట్‌గా పనిచేయవచ్చు.
- ★ గేమ్స్ డిజైన్ ఎక్స్‌పర్ట్ గేమ్ డిజైనర్, గేమ్ ఆర్టిస్ట్, గేమ్ ప్రొడ్యూసర్, గేమ్ టెస్టర్, గేమ్ సౌండ్ ఇంజనీర్‌గా చేరవచ్చు.

3ఎల్ తప్పనిసరి

కంప్యూటర్ సైన్స్ అనే కాదు, ఏ బ్రాంచ్ తీసుకున్న విద్యార్థికి అయినా తన సబ్జెక్టుపై లోతైన అవగాహన ఉండాలి. అప్పుడే జాబ్ మార్కెట్లో ఇతరులపై ఎడ్జ్ ఉంటుంది. అదే అనుకున్న లక్ష్యానికి చేరువ చేస్తుంది. అదేవిధంగా ఎంపిక చేసుకున్న రంగానికి సంబంధించి తదుపరి కోర్సులపై కూడా దృష్టిసారించాలి. ఎప్పటికప్పుడు టెక్నికల్‌గా అప్డేట్ అవుతూ ఉండాలి. తద్వారా మరింత పరిణతి సాధించాలి. అంటే ఈ రంగంలో నిలదొక్కుకోవాలంటే లైఫ్ లాంగ్ లెర్నింగ్(3ఎల్)కు అలవడాలి. మరోవైపు వాస్తవ పరిస్థితినీ గమనించాలి. పెద్ద ఎత్తున కోర్సులు అలాగే ఛాయిస్‌లు ఉన్న ఈ రోజుల్లో చదివిన కోర్సుకు తగ్గ ఉద్యోగం లభించడం, అందులో నిలదొక్కుకోవడం ఒక రకంగా కత్తిమీద సాము అనే చెప్పాలి. కంప్యూటర్ సైన్స్ విషయానికి వస్తే దాని పరిధి ఏటేటా విస్తృతమవుతోంది. స్పెషలైజ్డ్ టాపిక్స్ పెరుగుతున్నాయి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్, నెట్‌వర్కింగ్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ నుంచి ఎన్నో స్పెషలైజేషన్లు ఉన్నాయి. అటు అవకాశాలు, ఇటు ఆసక్తిని అనుసరించి ఎందులో ఉండదలుచుకున్నామో నిర్ణయించుకోవాలి. అలా బెస్ట్ కంప్యూటర్ సైన్స్ కోర్సులను ఎంచుకోవాలి.

కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(సీఎస్ఈ) లేదా డేటా సైన్స్, ఏఐ, మెషీన్ లెర్నింగ్ వంటి బ్రాంచీలను తీసుకునే ముందు విద్యార్థులు కొన్ని విషయాలను అర్థం చేసుకోవాలి. వాటిలో...

- మేథ్స్‌లో బలమైన పునాది ఉండాలి. కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించి ఇది కీలకమైన సబ్జెక్టు. ఆల్జీబ్రా, కాలిక్యులస్, ప్రాబబిలిటీ, డిస్క్రీట్ మేథమెటిక్స్ చాలా ముఖ్యమైనవి.
- పైథాన్, జావా లేదా సి++ వంటి ప్రోగామింగ్ లాంగ్వేజ్‌లు తెలిసి ఉండాలి. వేరియబుల్స్, లూప్స్, ఫంక్షన్స్, డేటాస్ట్రక్చర్స్ వంటి బేసిక్ ప్రోగ్రామింగ్ కాన్సెప్ట్లు తెలిసి ఉండాలి.
- కంప్యూటర్ల పనితీరుపై ప్రాథమిక అవగాహన తప్పనిసరి. సీపీయూ, మెమరీ, స్టోరేజ్, ఆపరేటింగ్ సిస్టమ్స్ తెలియాలి.
- బేసిక్ అల్గోరిథమ్స్, డేటా స్ట్రక్చర్స్ అంటే అరేస్, లింక్డ్ లిస్ట్స్, స్టేక్స్, క్యూస్, ట్రీస్, సార్టింగ్ అల్గోరిథమ్స్ వంటి కంప్యూటర్ సైన్స్ ఫండమెంటల్స్‌పై పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి.
- కంప్యూటర్ ఆర్కిటెక్చర్ బేసిక్స్ కూడా తెలియాలి. లాజిక్ గేట్స్, ప్రాసెసర్స్, మెమరీ హైరార్కీ, ఇన్‌పుట్/ఔట్‌పుట్ సిస్టమ్స్ వంటివి ఉపయోగకరం.
- సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ ప్రిన్సిపల్స్ కూడా తెలియాలి. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ప్రాసెసస్, డిజైన్ ప్యాటర్న్స్, టెస్టింగ్ మెథడాలజీస్, వెర్షన్ కంట్రోల్ సిస్టమ్స్‌పై అవగాహన పెంచుకోవాలి.
- నెట్‌వర్కింగ్ అండ్ సైబర్ సెక్యూరిటీపై ప్రాథమిక అవగాహన ఉండాలి. నెట్‌వర్క్స్, ప్రొటోకాల్స్, సైబర్ సెక్యూరిటీ కాన్సెప్ట్స్ వంటివి ఇవాల్టి సాంకేతిక ప్రపంచంలో చాలా ముఖ్యం.
- ప్రాబ్లెమ్ సాల్వింగ్ స్కిల్స్ ఉండాలి. కంప్యూటర్ సైన్స్‌లో తరచూ ఎదరయ్యే క్లిష్టమైన ప్రాబ్లెమ్స్‌ను సమర్థంగా పరిష్కరించగలగాలి. ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలను ఎంత బాగా నేర్చుకుంటే అంత మంచి కెరీర్ మున్ముందు ఉంటుంది.

వీటన్నింటిపై ముందస్తు పరిజ్ఞానం ఉంటే కంప్యూటర్ సైన్స్‌లో రాణించేందుకు వీలు ఉంటుంది. ఈ టాపిక్స్‌ను కవర్ చేసే ఫౌండేషన్ కోర్సులు ఉన్నాయి. అన్నింటికీ మించి టెక్నాలజీపై అనురక్తి ఉంటే, నేర్చుకునే స్వభావం అందుకు తోడైతే పెద్దగా అనుభవం లేకున్నప్పటికీ ఈ రంగంలో దూసుకు వెళ్ళవచ్చు.

లిటిల్స్



నిజాయితీకి పరీక్ష!

సౌగంధపురం అనే దేశాన్ని నరేంద్ర భూపతి అనే రాజు పాలిస్తూ ఉండేవాడు. ఆయన దగ్గర పనిచేసే కోశాధికారి మరణించటంతో నిజాయితీపరుడైన ఒక ఉద్యోగి అవసరమయ్యాడు. మహామంత్రిని పిలిచి నమ్మకస్తుడైన వ్యక్తిని ఎంపిక చేయమని ఆదేశించాడు. మహామంత్రి కొందరు యువకులను ఎంపిక చేసి వారందరిని ఒక పరీక్ష పెట్టాడు. గదిలో ఉన్న ఒక విగ్రహం చుట్టూ వేగంగా పది సార్లు పరిగెత్తాలి. పరీక్షకు వచ్చిన వారిలో ఒక యువకుడు తప్ప మిగిలిన వారందరూ ఏదో ఒక సాకు చెప్పి పరిగెత్తలేదు. మహామంత్రి పరిగెత్తిన యువకుడిని కోశాధికారిగా ఎంపిక చేసి రాజు దగ్గరకు పంపాడు. "ఈ యువకుడిని మీరు ఎందుకు ఎంపిక చేశారు" అని మహామంత్రిని రాజు అడిగాడు.





అప్పుడు మహామంత్రి - "రాజా! యువకులందరినీ ముందుగా బంగారు నాణేలు ఉన్న ఒక చీకటి గదిలో ఉంచా. ఒక్కరు తప్ప మిగిలిన వారందరూ- బంగారు నాణేలకు తన దుస్తుల్లో దాచుకున్నారు. విగ్రహం చుట్టూ పరిగెత్తమన్నప్పుడు- వారు బంగారు నాణేలు కిందపడతాయనే భయంతో పరిగెత్తలేదు. వారెవ్వరూ నిజాయితీపరులు కారు. అందుకే ఈ యువకుడిని ఎంపిక చేశా" అని చెప్పాడు.

సరైన నీడ ఏది?



5 తేడాలు గుర్తించండి





దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 323

3			1		5			4
9				3			7	
	4	2			9			
7				4			8	
			3		2			
	5			9				1
			7			4	1	
	6			1				5
1			2		4			3

సుడోకు - 322 సమాధానం

3	1	9	7	8	5	2	4	6
7	8	5	6	2	4	3	9	1
2	6	4	1	9	3	8	5	7
6	2	7	5	1	9	4	3	8
5	9	3	4	6	8	7	1	2
1	4	8	3	7	2	5	6	9
8	3	6	2	5	1	9	7	4
4	7	2	9	3	6	1	8	5
9	5	1	8	4	7	6	2	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.